# సినాదం
నిఖార్సైన జర్నలిజం

బుధవారం, జూన్ 11, 2025 | సంపుటి - 20 | సంచిక 151 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## హైకోర్టులో హరీష్ రావుకు ఊరట
### ఎన్నికల పిటిషన్‌ను కొట్టేసిన కోర్టు



హైదరాబాద్ : తెలంగాణ హైకోర్టులో మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఊరట లభించింది. ఆయనపై వేసిన ఎన్నికల పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. ఎన్నికల అఫిడవిట్‌లో హరీశ్‌రావు సరైన వివరాలు ఇవ్వలేదని గతంలో చక్రధర్ గౌడ్ వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సిద్దిపేటలో బీఆర్ఎస్ నుంచి హరీశ్‌రావు, కాంగ్రెస్ నుంచి హరికృష్ణ, బీఎస్పీ నుంచి చక్రధర్ గౌడ్ పోటీ చేశారు. అయితే ఈ ఎన్నికల్లో గెలిచిన హరీశ్‌రావు అఫిడవిట్‌లో పూర్తి సమాచారం వెల్లడించకుండా రహస్యంగా ఉంచారని చక్రధర్ గౌడ్ పిటిషన్ దాఖలు చేశారు. 2లో



## కవిత అరెస్ట్
### బస్ పాస్ ధరల పెంపుపై నిరసన

**బస్ భవన్ ముట్టడికి కవిత యత్నం**

**రోడ్డుపై బైఠాయించడంతో అరెస్ట్**

**బస్ భవన్ ఎదుట బిఆర్ఎస్‌వి మెరుపు ధర్నా**

హైదరాబాద్ : తెలంగాణ జాగృతి నేత, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టయ్యారు. పెంచిన బస్ పాస్ ధరలను వెంటనే తగ్గించాలంటూ తెలంగాణ జాగృతి కార్యకర్తలతో కలిసి మంగళవారం బస్ భవన్‌ను ముట్టడించేందుకు కవిత ప్రయత్నించారు. ఆ క్రమంలో ఆమె ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆమె రోడ్డుపై బైఠాయించడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. ఈ మేరకు కవిత, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. కవిత ధర్నాతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. దీంతో కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఆమెను చంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మిగతా 2లో

## ఆషాఢ బోనాలకు 20 కోట్లు విడుదల

శాఖల మధ్య సమన్వయంతో ముందుకు సాగాలి

హైదరాబాద్‌కు పేరు తెచ్చేలి బోనాల నిర్వహణ

అధికారులతో మంత్రులు పొన్నం, కొండా సురేఖల సమీక్ష

2

## తెలంగాణలో రూ. 2,125 కోట్ల పెట్టుబడులు



**యూఏఈ కంపెనీలు షైవ గ్రూప్, టారనిస్ కేపిటల్ పెట్టుబడి**

**5020 మంది యువతకు ఉపాధి అవకాశాలు**

**రాష్ట్రానికి చెందిన అయిదు కంపెనీలతో అవగాహన ఒప్పందం**

**రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి**

*తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల్లో చూపించే ప్రభుత్వం అని ఐటీ- శాఖా మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. తెలంగాణ ప్రతిభకు కేర్ ఆఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. పెట్టుబడుల విషయంలో ప్రతిపక్షాలు దుష్ప్రచారాలు చేయొద్దని, తెలంగాణకు వచ్చే పెట్టుబడులు ప్రతిపక్షాలకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం కొత్త పరిశ్రమలకు మెరుగైన అవకాశాలు కల్పిస్తోందని, తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహకాలు చూసి షైవ గ్రూప్ సంస్థ పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పకుందని తెలిపారు.*



హైదరాబాద్ : తెలంగాణలో షైవా గ్రూప్ భాగస్వామిగా మారిందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. షైవా గ్రూప్, టారానిస్ క్యాపిటల్ కలిపి రాష్ట్రంలో రూ. 2,125 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో మంగళవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. బయోసైన్స్, కృత్రిమ మేధలో పెట్టు బడులకు తెలంగాణ అనుకూల ప్రదేశమన్నారు. తెలంగాణ పురోగతిలో భాగస్వామ్యమయ్యేందుకు ముందుకు వచ్చిన సంస్థలకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఏడాదిన్నరలో 60వేల ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రైవేటు రంగంలో లక్షకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించా మన్నారు. ఏడాదిన్నరలో రూ. 3లక్షల కోట్లకు పైగా పెట్టుబడులకు అవగాహన ఒప్పందాలు కుదిరాయని చెప్పారు. ప్రభుత్వంపై నమ్మకంతో పెట్టు-బడిదారులు ముందుకు వస్తున్నారన్నారు. యువత మన ఆస్తి.. వారిలో నైపుణ్యాలు నింపేందుకు స్కిల్ యూనివర్సిటీ- ఏర్పాటు- చేశామని తెలిపారు. మిగతా 2లో

## పాక్ ఉగ్రవాద చర్యలను ఏమాత్రం సహించం

ఇలాగే కొనసాగితే పాక్‌లో చొచ్చుకు వెళ్లి దాడి చేస్తాం

విదేశాంగ మంత్రి జై శంకర్ ఘాటు హెచ్చరికలు



2



## నేడు కాళేశ్వరం కమిషన్ ముందుకు కెసిఆర్

మరోమారు కెసిఆర్‌తో హరీష్ సుదీర్ఘ మంతనాలు

చర్చనీయంశాలపై ఇరువురు నేతల మల్లగుల్లాలు

భారీ కాన్వాయ్‌తో కెసిఆర్ హాజరయ్యేలా ప్లాన్

గజ్వేల్ : కాళేశ్వరం కమిషన్ విచారణకు బుధవారం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ హాజరు కానున్నారు. ఈ సందర్భంగా భారీగా జనసమీకరణతో రావాలని పార్టీలో చర్చించారు.

మిగతా 2లో

## అమృత్ భారత్ స్కీమ్.. కాంట్రాక్టర్ల స్కామ్

**ఆధునీకరణ పేరుతో అస్తవ్యస్తంగా మారిన పెద్దపల్లి రైల్వే స్టేషన్**

**నిలువ నీడ లేక అల్లాడుతున్న ప్రయాణికులు**

**హడావిడిగా అధికారులు ప్రజాప్రతినిధులు పలుమార్లు సందర్శించిన అభివృద్ధి పనులలో పురోగతి శూన్యం**

**పాత బిల్డింగ్ పడగొట్టడానికే సంవత్సర కాలం పట్టింది మరి నూతన బిల్డింగ్ నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో ?**






పెద్దపల్లి ప్రతినిధి :

అమృత్ భారత్ రైల్వేస్టేషన్ల ఆధునీకరణలో భాగంగా పెద్దపల్లి రైల్వే స్టేషన్ లో అభివృద్ధి పనులను దేశ ప్రధాని నరేంద్ర మోడీ మార్చ్యుల్‌గా ప్రారంభించి సంవత్సరకాలం దాటుతున్న ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా అమృత్ భారత్ స్కీం కాస్త కాంట్రాక్టర్ల స్కామ్ అయింది. పెద్దపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు అటకెక్కాయి. అధికారుల నిర్లక్ష్యమో, కాంట్రాక్టర్ల అలసత్వమో ఆధునీకరణ పనుల పేరుతో పెద్దపల్లి రైల్వే స్టేషన్ అస్తవ్యస్తంగా మారింది. నిలువ నీడ లేక ప్రయాణికులు అల్లాడుతున్నారు. జిల్లా కేంద్రంలోని పెద్దపల్లి రైల్వే జంక్షన్ లో నిత్యం వేలాదిమంది ప్రయాణికులు రైళ్లలో రాకపోకలు సాగిస్తుంటారు రైల్వే స్టేషన్ లో త్రాగునీరు లేక పోగా మల మూత్ర విసర్జనల కోసం ప్రయాణికుల ఇబ్బందులు వర్ణాతీతంగా ఉన్న అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తోంది. మిగతా 2లో



## ఆడబిడ్డలపై చేయి వేయాలంటేనే భయపడాలి

అనంత జిల్లాలో ఘటనలపై సిఎం చంద్రబాబు సీరియస్

పోలీస్ అధికారులతో సమీక్ష.. కఠిన చర్యలకు ఆదేశం

2

## ఢిల్లీలోనే మకాం వేసిన సిఎం రేవంత్



మంత్రులకు శాఖల కేటాయింపులపై కసరత్తు

కొందరు మంత్రుల శాఖల మార్పుపైనా చర్చ

కెసి వేణుగోపాల్, ఖర్గేలతో సిఎం మంతనాలు

పిలుపు రావడంతో హుటాహుటిన ఢిల్లీకి మంత్రి ఉత్తమ్



హైదరాబాద్ : తెలంగాణ మంత్రుల శాఖల్లో భారీ మార్పులకు అవకాశం ఉన్నట్లు సమాచారం. కొత్త మంత్రులకు శాఖల కేటాయింపుతో పాటు శాఖల మార్పులపైన కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే రెండురోజులుగా ఢిల్లీలో మకాం వేసిన సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అగ్రనేతల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఢిల్లీ నుంచి పిలుపు వచ్చింది. దీంతో ఆయన హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఇకపోతే సోమవారం కాంగ్రెస్ కార్యదర్శి కేసీ వేణుగోపాలతో గంటకుపైగా రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. మంగళ వారం మధ్యాహ్నం 12 గంటలకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సీఎం రేవంత్ రెడ్డి బేటి అయ్యారు. ఖర్గేతో భేటీ తరువాత మంత్రుల శాఖల మార్పులు ఖరారు కానున్నాయి సమాచరం. అలాగే కొత్త మంత్రులకు కూడా శాఖల కేటా యింపు జరుగుతుంది. ఈ క్రమంలో ప్రస్తుతం వివిధ శాఖలను నిర్వహిస్తున్న మంత్రుల శాఖల్లో కూడా 2లో

## ఏజెన్సీ ప్రాంతాల్లోని స్థానికులకే ఉద్యోగాలు

**ఏజెన్సీ ప్రాంతాల్లోని స్థానికులకే ఉద్యోగాలు**

**ఉట్నూరు, ఏటూరునాగారం ఐటిడిఎల అభివృద్ధికి రూ. 12 కోట్లు**

**గ్రామసభల అనుమతితోనే అటవీ అధికారుల చర్యలు ఉండాలి**

**ఏజెన్సీ ప్రాంత ఎమ్మెల్యేలతో సమీక్షలో మంత్రి సీతక్క**



హైదరాబాద్ : ఏజెన్సీ ప్రాంతాల్లోని ఉద్యోగాలు స్థానికులకే దక్కెలాగా జిఓ నెం. 3ను పునరుద్ధరించాలన్న పక్రియను ప్రభుత్వం ప్రారంభించిందని మంత్రి సీతక్క తెలిపారు. వెనకబడ్డ ఉట్నూరు, ఏటూరునాగారం ఐటిడిఎల అభివృద్ధికి రూ. 12 కోట్లు- ప్రత్యేకంగా కేటాయించినట్లు వెల్లడించారు. మంగళవారం మంత్రి సీతక్క అధ్యక్షతన మాసబ్ ట్యాంక్ లోని సంక్షేమ భవన్ లో గిరిజన, ఆదివాసి ఎంఎల్ఎల సమావేశం జరిగింది. 3లో



## 11 ఏళ్లలో అవినీతి రహిత సమర్థ పాలన

**అనేక సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం**

**ప్రపంచ దేశాలు భారత్‌వైపు చూసేలా చేసిన మోడీ**

**11 ఏళ్ల అభివృద్ధి కార్యక్రమాలపై పుస్తకం విడుదల**

**కార్యక్రమంలో మాట్లాడిని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

విజయవాడ : మోదీ నాయకత్వంలో.. ఈ 11 సంవత్సరాలలో దేశంలోని అన్ని రంగాలు అభివృద్ధి పథంలో ముందుకి దూసు కెళుతున్నాయని భారత ప్రధాని నరేంద్ర మోదీపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రశంసల జల్లులు కురి పించారు. దేశ ప్రజల కోసం ఆయన అనేక సంక్షేమ కార్యక్రమాలు అందించారని అన్నారు. విజయవాడ పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దేశంలో బీజేపీ ప్రభుత్వం సాధించిన

మిగతా 2లో

# కవిత అరెస్ట్

తెలంగాణ ప్రజలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అడ్డగోలుగా దోచుకుంటోందని.. విద్యార్థులు, ప్రజలపై తీవ్ర భారం పడుతోందని ఈ సందర్భంగా కవిత ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రాయణ గుట్ట పోలీస్ స్టేషన్‌కు కవితను తరలించడంతో జాగృతి కార్యకర్తలు సైతం భారీగా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పోలీసులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అన్ని రకాల బస్ పాస్ ఛార్జీలను టీజీఎస్ఆర్టీసీ పెంచింది. ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌తోపాటు– మెట్రో డీలక్స్ ఛార్జీలనూ పెంచేసింది. మరోవైపు పెంచిన బస్ పాస్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులు బస్ భవన్ ఎదుట మెరుపు ధర్నా చేపట్టారు. ధర్నాకు దిగిన అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షుడు పడాల సతీష్, కడారి స్వామి యాదవ్‌తో పాటు– బీఆర్ఎస్వీ శ్రేణులను, విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా గెల్లు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సు పాస్ ఛార్జీలు పెంచడం వల్ల పేద విద్యార్థులపై ఆర్థిక భారం పడుతుంది. ఒక్కో విద్యార్థిపై రూ. 250 నుంచి రూ. 350 వరకు భారం పడుతోంది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విద్యార్థులపై ఈ విధమైన భారం ఏదీ విధించలేదు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి, ఒకవైపు బస్సులను పెంచక విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ.. మరోవైపు చార్జీలు పెంచి విద్యార్థులపై రేవంత్ సర్కార్ ఆర్థిక భారాన్ని మోపుతుందని గెల్లు శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. పెంచిన బస్సు చార్జీలను వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. బస్ పాస్ ఛార్జీలు పెంచి చాలా కాలమైందని.. ఈ నేపథ్యంలో వాటిని పెంచాల్సి వచ్చిందంటూ వివరణ ఇచ్చారు. బస్ ఛార్జీల పెంపు నేపథ్యంలో ప్రజలపై ఆర్థిక భారం పడుతుందంటూ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని బస్ భవన్‌ను ముట్టడించేందుకు యత్నించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టయ్యారు

## హైకోర్టులో హరీష్ రావుకు ఊరట

తన కుమారుడి వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించలేదని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై తాజాగా మరోసారి విచారణ చేపట్టిన హైకోర్టు.. దాన్ని కొట్టివేసింది. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఇప్పటికైనా ప్రతిపక్ష నాయకులపై కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి కక్ష సాధింపు రాజకీయాలు మానుకోవాలని హితవుపలికారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టిసారించాలని సూచించారు. అక్రమ కేసులకు భయపడేది లేదని.. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీ నయవంచనను ఎండగట్టి తీరుతామని హెచ్చరించారు. ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

## పాక్ ఉగ్రవాద చర్యలను ఏమాత్రం సహించం

బ్రసెల్స్ : ఉగ్రదాడులతో రెచ్చగొడితే పాక్‌స్థాన్ లోపలకు చొచ్చుకెళ్లి మరీ భారత్ దాడులు చేస్తుందని విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ దాయాది దేశాన్ని మరోమారు హెచ్చరించారు. పహల్గాం వంటి పాశవిక ఉగ్రదాడులకు టెర్రరిస్టు సంస్థలు, వారి నేతలు పాల్పడితే దెబ్బకు దెబ్బ తీస్తామని స్పష్టం చేశారు. బహిరంగంగా పాక్ ఉగ్రవాదులకు శిక్షణను ఇస్తూ వారిని భారత్‌పైకి ఉసిగొల్పుతున్నారని, దీనిని ఇకముందు సహించేది లేదన్నారు. పహల్గాం ఉగ్రదాడికి జవాబుగా భారత్ ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన నెల రోజుల అనంతరం యూరప్‌లో జైశంకర్ పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా బెల్జియం, లక్సంబర్గ్‌లో భారత సంతతి ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఎంతో మంది అమాయకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులకు బహిరంగంగానే పాకిస్థాన్ శిక్షణ ఇస్తూ, వారిని ఇండియాపైకి ఉసిగొలుపుతోందని కేంద్రమంత్రి దుయ్యపట్టారు. ఉగ్రవాదంతో ఉద్రిక్తతలు పెంచడానికే వాళ్లు కట్టుబడి ఉంటే ఆ పరిస్థితులు ఉన్నట్టేనని ఆయన సమాధానమిచ్చారు. యుద్ధం సందర్భంగా జరిగిన నష్టంపై కేంద్రమంత్రిని ప్రశ్నించగా.. సంబంధిత అధికారులు ఇందుకు సిద్ధంగా ఉన్నప్పుడు వెల్లడిస్తారని చెప్పారు. ఉగ్రవాదం అనేది ఏ రెండు దేశాలకో సంబంధించిన అంశంగా చూడరాదని, ప్రపంచ సమస్యగానే చూడాలని అన్నారు. ఈ సమావేశంలో బెల్జియం విదేశాంగ మంత్రి మాక్సిమ్ ప్రెవోట్ సైతం పాల్గొన్నారు.

## ఢిల్లీలోనే మకాం వేసిన సీఎం రేవంత్

మార్పులు చోటుచేసుకుంటాయని ప్రచారం నడుస్తోంది. మంత్రి పదవులే కాదు.. శాఖల కేటాయింపుల్లోనూ సామాజిక న్యాయంకు ప్రాధాన్యత నివ్వాలని కాంగ్రెస్ అధిష్టానం పేర్కొంది. కొందరు మంత్రుల పనితీరు సరిగా లేదంటూ ఇప్పటికే కొందరు పార్టీ నేతలు అధిష్టానానికి నివేదించారు. అలాగే మంత్రుల పనితీరుపై ఇప్పటికే పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ అధిష్టానానికి నివేదిక ఇచ్చారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, వివిధ స్థాయి నేతలతో భేటీలో అందిన సమాచారం ఆధారంగా ఆమె నివేదికలు రూపొందించారు. కీలక శాఖల బాధ్యతలు అన్ని కొందరు మంత్రులే నిర్వహిస్తుండటంతో పని భారం కారణంగా కొన్ని శాఖల్లో ఆశించిన ఫలితాలు రావట్లేదనే అంచనలో కాంగ్రెస్ ముఖ్య నేతలు ఉన్నారు. మంత్రుల పనితీరు వ్యవహార శైలిపై కేసి వేణుగోపాల్ గతంలోనే ఢిల్లీలో సమావేశం నిర్వహించి సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రభుత్వ పాలనా వ్యవహారాలు, మంత్రుల వ్యవహార శైలి, పనితీరుపై తన అంచనాలను అధిష్టాన ముఖ్యులతో సీఎం రేవంత్ రెడ్డి పంచుకున్నారు. విద్య, మున్సిపల్ పట్టణాభివృద్ధి, హోం, న్యాయం సహా పదికి పైగా కీలక శాఖలు ముఖ్యమంత్రి వద్దే ఉన్నాయి. ప్రస్తుతం ముఖ్యమంత్రి వద్ద ఉన్న మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖను విడగొట్టి మున్సిపల్ శాఖను మరొకరికి ఇచ్చే అవకాశం ఉంది. కాగా తనకు విద్యుత్తు లేదా విద్యాశాఖ ఇవ్వాలని వివేక్ కోరుతున్నారు. ప్రస్తుతం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వద్ద విద్యుత్ శాఖ ఉంది. త్వరలో కొన్ని కార్పొరేషన్ ఛైర్మన్ పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాగా తెలంగాణలో కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులకు శాఖల కేటాయింపుపై హస్తినలో కసరత్తు మొదలైంది. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయి దాదాపు గంటసేపు చర్చించారు. మంత్రులకు శాఖల కేటాయింపుపైనే ప్రధానంగా వీరి చర్చ సాగినట్టు– తెలిసింది. ప్రస్తుతం మంత్రివర్గంలో ఎవరెవరి దగ్గర ఏయే శాఖలున్నాయి? రెండు, మూడు మంత్రిత్వ శాఖలు నిర్వహిస్తున్న వారెవరు? కొత్తగా మంత్రివర్గంలో చేరిన వాకిటి శ్రీహరి, గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్‌కు ఏ శాఖలు కేటాయించాలి? అనే అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్టు సమాచారం. అయితే, ప్రస్తుతం ఎవరికీ కేటాయించని శాఖలన్నీ ముఖ్యమంత్రి వద్దే ఉన్నాయి. అందులో ప్రధానమైనవి.. విద్య, పురపాలకం, హోం, గనులు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ– సంక్షేమం, వాణిజ్య పన్నులు, పశు సంవర్ధక శాఖ, న్యాయ, కార్మిక, క్రీడలు యువజన శాఖ. వీటిలో విద్యా శాఖను తనకు కేటాయించాలని గడ్డం వివేక్ కోరుతున్నట్టు– తెలిసింది. ఇదే విషయాన్ని మల్లికార్జున ఖర్గేకు సైతం తెలియజేసినట్టు– సమాచారం. అయితే, వివేక్‌కు కార్మిక, మైనింగ్, క్రీడల శాఖ.. అడ్లూరి లక్ష్మణ్‌కు ఎస్సీ, ఎస్టీ సంక్షేమం, వాకిటి శ్రీహరికి పశుసంవర్ధక, యువజన, న్యాయ లేదా మత్స్య శాఖ కేటాయించే అవకాశం ఉన్నట్టు– జోరుగా ప్రచారం జరుగుతోంది. దీంతోపాటు–.. మంత్రివర్గంలో స్థానం దక్కుతుందని ఆశించి నిరాశ చెందిన వారి ప్రభావమెంత వారిని శాంతింపజేయడం ఎలా అనే అంశాలపై కూడా కేసీ, రేవంత్ రెడ్డి మధ్య చర్చ జరిగినట్టు సమాచారం. మంత్రివర్గంలో మరో ముగ్గురికి అవకాశం ఉన్న నేపథ్యంలో మిగిలిన వారికి ఈసారి చోటు– కల్పిస్తామనే నమ్మకం కలిగించాలని రేవంత్ రెడ్డికి కేసీ సూచించినట్టు తెలిసింది. అలాగే.. ప్రస్తుతం కీలక మంత్రిత్వ శాఖలు నిర్వహిస్తున్న వారి వ్యవహారశైలి, పనితీరు తదితర అంశాలను ఆయన అడిగి తెలుసుకున్నట్టు– సమాచారం.

# తెలంగాణలో రూ.2,125 కోట్ల పెట్టుబడులు

రాష్ట్రం అవకాశాల గని.. ఆవిష్కరణలకు, అవకాశాలకు, ప్రతిభకు కేంద్రమని పేర్కొన్నారు. అంతర్జాతీయ భాగస్వాములను రాష్ట్రం ఆకర్షిస్తోందన్నారు. 18 నెలల్లో 3 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలు కుదిరాయని, లక్ష మందికి తెలంగాణ యువతకు ఉపాధి లభించిందని మంత్రి శ్రీధర్ బాబు చెప్పుకొచ్చారు. 'తెలంగాణ ప్రభుత్వం కొత్త పరిశ్రమలకు మెరుగైన అవకాశాలు కల్పిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహకాలు చూసి శైవ గ్రూప్ సంస్థ పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పుకుంది. 13 వందల కోట్లతో బయోటెక్ సంస్థ పెట్టుబడులు పెడుతున్నారు. ఐదు సంస్థల్లో 2100 కోట్లు–, 5 వేల మందికి ఉపాధి కలగనుంది. సాంకేతిక పరమైన కొత్త ఆవిష్కరణలకు ప్రభుత్వం పెట్టుబడి దారులకు సహకారం అందిస్తుంది. 18 నెలల్లో 3 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలు, లక్ష మందికి తెలంగాణ యువతకు ఉపాధి లభించింది. కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి అడుగు నుంచే విమర్శలు చేస్తున్నారు. మాది మాటల ప్రభుత్వం కాదు.. చేతల్లో చూపిస్తున్నాం' అని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. 'పెట్టుబడులు రావడం లేదు, కంపెనీలు పోతున్నాయి అనే విమర్శలకు ఇది కౌంటర్ అన్నారు. తెలంగాణకు వచ్చే పెట్టు–బడులు ప్రతిపక్షాలకు కనిపించడం లేదా?. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో యువతకు మరింత ఉపాధి లభించనుంది. తెలంగాణ ప్రతిభకు కేర్ ఆఫ్ అడ్రస్‌గా మారింది. పెట్టుబడుల విషయంలో ప్రతిపక్షాలు దుష్ప్రచారాలు చేయొద్దు. పరిశ్రమల వాతావరణాన్ని డిస్టర్బ్ చేయొద్దు. భవిషత్తులో పెద్ద సంఖ్యలో పెట్టు–బడులు తీసుకొస్తాం' అని మంత్రి శ్రీధర్ బాబు చెప్పుకొచ్చారు.

## నేడు కాళేశ్వరం కమిషన్ ముందుకు కెసిఆర్

కెసిఆర్ వెంట భారీ కాన్వాయ్‌తో వచ్చి హల్‌చల్ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇదిలావుంటే మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి కెసిఆర్‌తో భేటీఅయ్యారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్, హరీశ్ రావు మధ్య కాళేశ్వరం కమిషన్ విచారణ అంశంపై సుదీర్ఘ చర్చ జరిగింది. కాళేశ్వరం కమిషన్ ఎదుట కేసీఆర్ హాజరుకానున్న నేపథ్యంలో ఇద్దరు నేతలు విచారణ అంశంపై చర్చించారు. బలప్రదర్శన ఏర్పాట్లపై కూడా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కాళేశ్వరం కమిషన్‌కి ఇచ్చేందుకు ఇప్పటికే కేసీఆర్ నివేదిక సిద్ధం చేశారు. అయితే హరీష్ రావును కాళేశ్వరం కమిషన్ అడిగిన ప్రశ్నల ఆధారంగా మరో నివేదిక కూడా సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది. హరీష్ రావుతో పాటు– ఫామ్‌హౌస్‌లో మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కూడా ఉన్నారు. సోమవారం కాళేశ్వరం కమిషన్ విచారణకు సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు హాజరయ్యారు. విచారణ అనంతరం నేరుగా ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లిన హరీశ్ రావు.. కేసీఆర్‌తో భేటీ అయ్యారు. కాళేశ్వరం కమిషన్ అడిగిన ప్రశ్నలు, విచారణ తీరుపై కేసీఆర్‌కు వివరించారు. వీరి భేటీ సుమారు 5 గంటల పాటు సాగింది. మంగళవారం మరోసారి హరీశ్ రావు ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లి కేసీఆర్‌తో భేటీ– అయ్యారు. కాళేశ్వరం కమిషన్ విచారణకు బుధవారం కేసీఆర్ హాజరుకావాల్సి ఉండడంతో వీరి భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. విచారణ సందర్భంగా కమిషన్‌కు అందించాల్సిన డాక్యుమెంట్స్ ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కూడా ఇచ్చే యోచనలో కేసీఆర్ ఉన్నట్లు– సమాచారం. కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరయ్యేందుకు కేసీఆర్ వెళ్లే సమయంలో ఆయనకు మద్దతుగా భారీ సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇప్పటికే ప్రణాళికలు రూపొందించినట్లు– సమాచారం. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డితో పాటు– చుట్టుపక్కల జిల్లాల నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివస్తారని తెలుస్తోంది. మేడిగడ్డ బ్యారేజీ పియర్స్ కుంగడం.. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో బుంగలు బయటపడిన నేపథ్యంలో గతేడాది రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో విచారణ కమిషన్‌ను నియమించింది. ఇప్పటికే ఈటెల, హరీష్‌లతో విచారణ ముగిసింది.

## 11 ఏళ్లలో అవినీతి రహిత సమర్థ పాలన

విజయాలను మాట్లాడుతూ.. గత 11 సంవత్సరాల్లో భారతదేశం అనేక రంగాల్లో అసాధారణ పురోగతి సాధించిందని స్పష్టం చేశారు.' ఒక్క రూపాయి అవినీతి జరిగిందని ఏ రాజకీయ పార్టీ కూడా ఆరోపణలు చేయలేదని, నీతి నిజాయితీతో ఒక సమర్థవంతమైన నాయకత్వంతో మోదీ పాలన కొనసాగుతోందన్నారు.. ప్రపంచ దేశాలు సైతం భారత దేశం వైపు చూసేలా మోదీ పాలన సాగుతోంది. అన్ని సామాజిక వర్గాల వారికి పెద్దపీట వేసి పాలన చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపట్టిన అనేక పథకాలు క్షేత్ర స్థాయిలో అమలు జరిగేలా ప్రణాళికలు ఉంటున్నాయి. కరోనా సమయంలో పేద ప్రజలు ఎవరు ఆకలితో ఉండకూడదనే ఉద్దేశంతో రేషన్ అందించారు. 4 కోట్ల ప్రజలకి ఇళ్లు కట్టించారు. మౌలికంగా అనేక మార్పులు తీసుకొచ్చారని అన్నారు. అలాగే మోడీ ప్రభుత్వం 11 ఏళ్ల అభివృద్ధి కార్యక్రమాలపై పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి ఇంకా బీజేపీ నేతలు దేశ అభివృద్ధికి మోడీ పాలన ఎంత కీలకమైందో వివరించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. గత 11 ఏళ్లలో మోడీ ప్రభుత్వం మీద ఒక్క అవినీతి ఆరోపణ కూడా రాలేదని, ఇది దేశ ప్రజల నమ్మకానికి నిదర్శనమన్నారు. పేద, అణగారిన వర్గాలకు పెద్దపీట వేసేలా మోడీ పాలన ఉందని అన్నారు. రైతులు, యువత, మహిళలు ఈ నాలుగు ప్రధాన విభాగాల అభివృద్ధి కోసమే ప్రతి కార్యక్రమం రూపకల్పన చేశారని అన్నారు. భారతదేశం నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని, ఇటీవలే 4 ట్రిలియన్ డాలర్స్ ఎకానమీగా మారిందని కిషన్ రెడ్డి తెలిపారు. పన్నుల వ్యవస్థలో సమగ్ర మార్పులు చేసి, జీఎస్టీ ద్వారా 'వన్ నేషన్ వన్ ట్యాక్స్' లక్ష్యాన్ని సాధించామని తెలిపారు. 2014లో 6.91 కోట్ల పన్నులు కట్టే వారు ఉండగా, ఇప్పుడు 15.66 కోట్లకు పెరిగిందని వివరించారు. అలాగే మోడీ ప్రభుత్వం రైతుల కోసం పలు కీలక నిర్ణయాలు తీసుకుందని తెలుపుతూ.. వ్యవసాయ బడ్జెట్ 25,633 కోట్ల నుంచి 1.33 లక్షల కోట్లకు పెరిగిందని, 82 శాతం వరకు గిట్టుబాటు ధరలు పెరిగినట్లు వెల్లడించారు. 11 కోట్ల మంది రైతులకు కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఏటా నేరుగా రైతు అకౌంట్ లోకి నగదు అందిస్తామని అన్నారు. అలాగే ఉగ్రవాదం విషయంలో జీరో టాలరెన్స్ పాలసీ అనుసరిస్తున్నామని చెప్పారు. పఠాన్ కోట్ సర్జికల్ స్ట్రయిక్ పహల్గావ్ దాడి, ఆపరేషన్ సింధూర్ వంటి చర్యలు భారత్ శక్తిని చాటిచెప్పినట్టు– పేర్కొన్నారు. బ్రహ్మోస్, బ్రహ్మాస్త్రం వంటి సామర్థ్యాలు దేశ రక్షణను మరింత బలంగా తీర్చిదిద్దాయని అన్నారు. మరోవైపు దేశంలో అమృత్ భారత్ పథకం కింద 1300 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తుండగా.. 1.46 లక్షల కి.మీ. జాతీయ రహదారులు, 7.7 లక్షల కిమీ గ్రామీణ రహదారులు నిర్మించామని చెప్పారు. రైల్వే బడ్జెట్ 29,056 కోట్ల నుంచి 2.42 లక్షల కోట్లకు పెరిగిందని, 136 వందే భారత్ రైళ్లు ప్రారంభించామని వివరించారు. ఇక ఉడాన్ స్కీం ద్వారా సామాన్యులకూ విమానయానాన్ని అందుబాటులోకి తెచ్చామని, 2014లో 71 విమానాశ్రయాలు ఉండగా.. ఇప్పుడు 159కి పెరిగినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 26 ఆఒఃఝ ఆసుపత్రులు ఇప్పటికే పనిచేస్తుండగా, మరో 15 నిర్మాణంలో ఉన్నాయని వివరించారు. బేటీ– బచావో – బేటీ– పఢావో, దీన్ దయాళ్ ఉపాధ్యాయ విద్యుత్ యోజన, ఆర్టికల్ 370 రద్దు, 140 శాటిలైట్‌ల ప్రయోగం, చంద్రుడి దక్షిణ ధృవాన్ని చేరటం వంటి చర్యలు మోడీ ప్రభుత్వం సామాజికంగా, శాస్త్రీయంగా దేశాన్ని ముందుకు నడిపించిందని అన్నారు. ఇక తెలంగాణ రాష్ట్రం గురించి మాట్లాడుతూ.. 2014లో లాభాల్లో ఉన్న రాష్ట్రం, మోడీ విధానాలను పాటించకపోవడంతో ఇప్పటికి 10 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమికి ప్రజలు మంచి విజయాన్ని అందించారని బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతదేశానికి సుపరిపాలన, ధృడమైన నాయకత్వంతో మంచి పాలన అందిస్తున్నారని ఉద్ఘాటించారు.

## ఆషాఢ బోనాలకు 20 కోట్లు విడుదల

హైదరాబాద్ : నగరంలో ప్రసిద్ధి చెందిన ఆషాఢ పండుగ బోనాల ఉత్సవాలు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో బోనాల ఉత్సవాలపై మంగళవారం అన్ని విభాగాల అధికారులతో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్లఉ సమీక్షించారు. బోనాల పండుగ కోసం ప్రభుత్వం రూ. 20 కోట్లు కేటాయించిందని మంత్రి తెలిపారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా గత ఏడాది బోనాల పండుగ జరుపుకున్నామని, ఒకటి రెండు చోట్ల ఇబ్బందులు తలెత్తాయని.. ఈ సారి ఎలాంటి సమస్యలు లేకుండా నిర్వహించాలని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు. వీఐపీ మూమెంట్‌లో తొక్కిసలాటలు జరుగుతున్నాయని, అవి జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు– చెప్పారు. జోగినీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని.. గతంలో జరిగిన దానికంటే ఇంకా మంచిగా బోనాల ఉత్సవాలు జరపాలని అనుకుంటున్నామని మంత్రి కొండా సురేఖ చెప్పారు. సరస్వతి పుష్కరాలు కూడా అద్భుతంగా నిర్వహించామని.. పక్క రాష్ట్రాల భక్తులు కూడా ఎంతో అభినందించారని అన్నారు. అధికారులు సమన్వయంతో ఉండి డ్యూటీ చేయాలని.. సంయమనం పాటించాలని కోరుతున్నామన్నారు. భక్తులతో దురుసుగా ప్రవర్తించకుండా మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ దర్శనం చేయించాలన్నారు. గత ఏడాది బోనాల సమయంలో పొన్నం ప్రభాకర్ వీడియో వైరల్ అయిందని.. ఈసారి ఎలాంటి తప్పిదాలు జరగకుండా ఎవరి డ్యూటీ వారు సక్రమంగా చేయాలని మంత్రి కొండా సురేఖ అధికారులకు సూచించారు. గోల్కొండ జగదాంబిక అమ్మవారి తొలి బోనంతో బోనాల ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. గోల్కొండ జాతర, బల్కంపేట ఎల్లమ్మ తల్లి వార్షిక కల్యాణోత్సవం, లష్కర్, లాల్ దర్వాజ బోనాలు, అమ్మవారి అంబారి ఊరేగింపు, రంగం కార్యక్రమాలు అన్ని సక్రమంగా జరిగేలా యాక్షన్ ప్లాన్ రెడీ చేస్తున్నామని మంత్రి చెప్పారు. ఈసారి బోనాలకు ప్రభుత్వం రూ. 20 కోట్లు– విడుదల చేసిందన్నారు. నూతన దేవాలయాలు యాడ్ అయ్యాయి కాబట్టి ఇంకో 10 శాతం ఫండ్స్ రిలీజ్ చేయాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎండోన్మెంట్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ చెక్కులు డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలన్నారు. డ్యూటీ లా కాకుండా ప్రతి ఒక్కరు అమ్మవారి ఆజ్ఞతో సేవ చేస్తున్నామని అనుకోవాలన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమం జరగాలని కోరుకుంటు–న్నట్లు– మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ఈ ఏడాది తొలి బోనం జూన్ 26న చారిత్రాత్మక గోల్కొండ కోటలో ప్రారంభం కానుందని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. తర్వాత వరుసగా బల్కంపేట ఎల్లమ్మ, ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజ బోనాలు జరగనున్నాయి. బోనాల పండుగను రాష్ట్ర గౌరవానికి మారు పేరుగా మార్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే రూ. 20 కోట్లు– కేటాయించింది. పండుగకు ముందు దేవాలయాల అభివృద్ధికి ఇవ్వబోయే చెక్కులను రెవెన్యూ మరియు ఎండోమెంట్స్ శాఖలు సమన్వయం చేసుకొని పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రత్యేకంగా హైదరాబాద్ నగరానికి గుర్తింపు తీసుకొచ్చే బోనాల ఉత్సవాలపై ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. బోనాల పండుగను ఏ అడ్డంకులు లేకుండా నిర్వహించేం దుకు జీహెచ్ఎంసీ, శానిటేషన్, రెవెన్యూ, లైటింగ్, వాటర్ ఫెసిలిటీ–, కంట్రోల్ రూమ్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. పోలీసు శాఖ లా అండ్ ఆర్డర్ పరంగా అప్రమత్తంగా ఉండాలి. అన్ని శాఖలతో సమన్వయం పెంచి పండుగ వేళ ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. అధికారులు తమ బాధ్యతను కేవలం ఉద్యోగంగా కాకుండా, భక్తి భావంతో సేవగా భావించి ప్రతి చర్యను శ్రద్ధగా చేయాలని మంత్రి సూచించారు. ప్రత్యేకించి ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజ, బల్కంపేట ఎల్లమ్మ ఉత్సవాలపై 'ప్లాన్ ఆఫ్ యాక్షన్' సిద్ధం చేయాలని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో బోనాల పండుగ విజయవంతంగా జరిగితే, ఇది హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయ స్థాయిలో గౌరవాన్ని తీసుకొస్తుంది అని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. అందరూ బాధ్యతగా తమ పనిని నిర్వహించి, నృత్యాలు, ఊరేగింపులు, సంప్రదాయ వేడుకలతో బోనాలను ఘనంగా జరపాలని పిలుపునిచ్చారు.

## ఆడబిడ్డలపై చేయి వేయాలంటేనే భయపడాలి

అమరావతి : ఆడబిడ్డలపై చేయి వేయాలంటే భయపడే పరిస్థితిని రాష్ట్రంలో తీసుకురావాలని పోలీస్ ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని రామగిరి మండలంలో ఎనిమిదో తరగతి బాలికపై సామూహిక లైంగిక దాడి ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఈ ఘటనలో నిందితులను వెంటనే అరెస్ట్ చేసి.. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంగళవారం అమరావతిలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో చోటు– చేసుకున్న ఘటనలపై ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక యువతి హత్య, మరో బాలికపై సామూహిక అత్యాచారం కేసును వేగంగా విచారణ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పక్కా ఆధారాల సేకరణతో నిర్దిష్ట సమయంలో నిందితులకు శిక్ష పడేలా చూడాలని అధికారులకు ఆయన సూచించారు. పోలీసులకు పూర్తి స్వేచ్ఛను ఇస్తున్నానన్నారు. గంజాయి బ్యాచ్ ఆట కట్టించాలని స్పష్టం చేశారు. ఇక ఈ రెండు ఘటనల్లో దర్యాప్తు, చర్యల వివరాలను సీఎం చంద్రబాబుకు ఈ సందర్భంగా డీజీపీ, ఉన్నతాధికారులు వివరించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రామగిరి మండలంలో ఎనిమిదో తరగతి చదువుతోన్న దళిత బాలికపై గత రెండేళ్లుగా అత్యాచారం జరుగుతోంది. ఈ ఘటనలో యువకుల నుంచి 60 ఏళ్ల వృద్ధుల వరకు ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటన చాలా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో ఆరుగురు



నిందితులను మంగళవారం అచ్చంపల్లి వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఏడుగురు నిందితులు పరారీలో ఉన్నారు. వారిని సైతం అరెస్ట్ చేస్తామని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రత్న వెల్లడించారు. బాధితురాలని వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించామన్నారు. అలాగే బాధితురాలికి పూర్తి భద్రత కల్పించామని స్పష్టం చేశారు.

# అమృత్ భారత్ స్కీమ్.. కాంట్రాక్టర్ల స్కామ్

### కూల్చడానికే సంవత్సరకాలం - కట్టడానికి ఎన్ని సంవత్సరాలో....

అమృత్ భారత్ అభివృద్ధి పనులలో పెద్దపల్లి రైల్వే స్టేషన్ పాత భవనాన్ని కూల్చడానికే సంవత్సర కాలం దాటిందని, మరి నూతన భవనాన్ని నిర్మించడానికి ఎన్ని సంవత్సరాల కాలం పడుతుందో అధికారులకు కాంట్రాక్టర్లకే తెలియాలని ప్రయాణికులు రైల్వే అధికారులపై మండిపడుతున్నారు. అమృత్ భారత్ రైల్వేస్టేషన్లో ఆధునీకరణ పనులలో అన్ని రైల్వే స్టేషన్లలో పనులు పురోగతిలో ఉండగా పెద్దపల్లిలో మాత్రం ఎందుకు ముందుకు సాగడం లేదని ఇక్కడ ప్రాతినిథ్యం వహిస్తున్న ప్రజా ప్రతినిధులు,రైల్వే శాఖ ఉన్నత అధికారులు కాంట్రాక్టర్లపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రయాణికులు విమర్శలు గుప్పిస్తున్నారు. అమృత్ భారత్లో ఎంపికైన. మంచిర్యాల, రామగుండం, కరీంనగర్ రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు చక చక పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధం కాగా మరి పెద్దపల్లి రైల్వే స్టేషన్ పనులు నిలిచిపోవడం పట్ల ప్రయాణికులు అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### కనీస సౌకర్యాలు కరువు - నిఘా నేత్రాలు లేవు

పెద్దపల్లి రైల్వే స్టేషన్ లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలైన త్రాగునీరు, స్నానపు గదులు, మరుగుదొడ్లు కనుమరుగయ్యాయి. ముల్లె ముటా, పిల్లాపాపలతో సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు భద్రత లేకుండా పోయింది. ప్రయాణికుల భద్రత నిమిత్తం పెద్దపల్లి రైల్వే జంక్షన్ అయినప్పటికీ కనీసం ఒక్క ఆర్పిఎఫ్, జి ఆర్ పి పోలీస్ కూడా విధులకు కేటాయించకపోవడం రైల్వే అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. పెద్దపల్లి రైల్వే స్టేషన్ లో ఇప్పటికే పలు దొంగతనాలు అఘాయిత్యాలు అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకుంటున్న కనీసం స్టేషన్ ఆవరణలో నిఘా నేత్రాలు లేకపోవడం. దురదృష్టకరమని ప్రయాణికులు అధికారులపై మండిపడుతున్నారు. రైల్వే బుకింగ్ కౌంటర్ లో పదే పదే "కృపయా జాందే మీరు నిఘా నేత్రాల నీడలో ఉన్నారు ప్రతిక్షణం ప్రయాణికుల కదలికలు గమనిస్తున్నాము" అంటూ అనౌన్స్మెంట్ రికార్డింగ్ తప్ప స్టేషన్ పరిసరాలలో ఎక్కడ నిఘా నేత్రాల జాడలేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

### అధికారుల హడావిడే తప్ప అభివృద్ధి పనులలో పురోగతి శూన్యం

అమృత్ భారత్ పథకంలో పెద్దపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం అయినప్పటి నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు హడావిడిగా వస్తూ పోతున్నారే తప్ప అభివృద్ధి పనుల్లో మాత్రం పురోగతి లేదని స్థానిక నాయకులు ఆరోపిస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం, డిఆర్ఎమ్, ఏడిఆర్ఎం,రైల్వే శాఖ ఉన్నత అధికారులు పలుమార్లు పెద్దపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను పర్యవేక్షించిన పనులు ముందుకు సాగడం లేదని పెద్దపల్లి పార్లమెంటరీ సభ్యులు గడ్డం వంశీ కృష్ణ సైతం మొన్నటికి మొన్న రైల్వే స్టేషన్ సందర్శించి అభివృద్ధి సుందరీకరణ పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించిన తూతూ మంత్రంగా పనులను ప్రారంభించి మళ్లీ పూర్తిగా పనులను నిలిపివేశారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ గతవారం పెద్దపల్లి రైల్వే స్టేషన్ సందర్శనలో భాగంగా పలు సంఘాల నాయకులు, స్థానికులు పెద్దపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల జాప్యంపై పలు వినతులు చేశారు. ఇప్పటికైనా స్థానిక ఎంపీ, ప్రజా ప్రతినిధులు, రైల్వే ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టర్ పై తగు చర్యలు తీసుకొని అమృత్ భారత్ అభివృద్ధి పనులను త్వరగాతిన పూర్తి చేసేలా చూడలని కోరుతున్నారు.



# స్వామి వారి దయ నియోజకవర్గ ప్రజల ఆశీస్సుల వల్ల మంత్రి పదవి వచ్చింది

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ధర్మపురి, జూన్ 10, :
ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి వారి దయ, నియోజకవర్గ ప్రజల ఆశీస్సుల వల్ల తనకు మంత్రి పదవి వచ్చిందని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసి మంత్రి హోదాలో మొదటి సారిగా ధర్మపురి నియోజకవర్గానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం రావడం జరిగింది. ఈ సందర్భంగా మొదటగా పత్తిపాక %ఇ% రోడ్ వద్ద నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో పెద్ద ఎత్తున స్వాగతం పలికి అక్కడి నుండి రాజరంపల్లె రాయపట్నం మీదుగా బారి ర్యాలీగా ధర్మపురికి చేరుకొని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొన్నారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత మొట్ట మొదటిసారిగా ఆలయానికి వచ్చిన మంత్రి లక్ష్మణ్ కుమార్ కు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మీనరసింహస్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని లక్ష్మీ నరసింహ గార్డెన్స్లో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధర్మపురిలక్ష్మీనరసింహస్వామి దయ, నియోజకవర్గ ప్రజల ఆశీస్సుల వల్ల తనకు మంత్రి పదవి లభించిందనీ పేర్కొన్నారు. ఈ పదవి ద్వారా పేదల సంక్షేమానికి ప్రత్యేకంగా కృషి చేస్తానని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయబోనని, గత ప్రభుత్వంలో సాధ్యం కాదు అని పక్కకు పెట్టీన నైట్ కాలేజ్ను తిరిగి పునఃప్రారంభం చేసుకోవడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఆలయ అర్చకులు, ఉద్యోగస్థుల జీతాలు కూడా నేను ప్రత్యేకంగా చొరవ చూపించి పెంపుదల చేయించడం జరిగిందని, నీటి అవసరం ఉన్న ప్రతి చోట బోర్వేల్స్ వేయించడం, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేయడం, గత 10 సంవత్సరాల బి.ఆర్.ఎస్ ప్రభుత్వ హయంలో చెగ్యం భూ నిర్వాసితులకు అందించని పరిహారాన్ని తాను గెలిచిన వెంటనే ముఖ్యమంత్రి, మంత్రి బట్టి విక్రమార్క గారితో మాట్లాడి 18 కోట్ల రూపాయలు విడుదల చేయించి నిర్వాసితులకు అందించడం జరిగిందని తెలిపారు. ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి వారి పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామని, ధర్మపురిలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ను కూడా వంద కోట్ల రూపాయలతో మంజూరు చేయడం జరిగిందని, అదే విధంగా ధర్మారం మండలంలో ఐటీఐ కళాశాలను కూడా ఏర్పాటు చేస్తామని, పాశిగామ వద్ద ఒక ట్రామా సెంటర్ ఏర్పాటుకు కూడా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని లక్ష్మణ్ కుమార్ వివరించారు. పవిత్ర గోదావరిలో సివరేజ్ నీరు కలవకుండా ఒక సివరేజ్ ప్లాంట్ ఏర్పాటుకు పరిపాలన అనుమతులు ఇవ్వాలని ముఖ్యమంత్రిని కలిసి వారిని కోరడం జరిగిందని, ఒక సామాన్య కార్యకర్త స్థాయి నుండి ఈ రోజు ఒక మంత్రి స్థాయిలో మీ ముందు ఉన్నానంటే అది మా కార్యకర్తలు పడిన కష్టం వల్లనే అని పేర్కొన్నారు. పార్టీకోసం నా గెలుపుకోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని, ధర్మపురి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తామని, రానున్న పుష్కరాలను కూడా ఎంతో వైభవంగా నిర్వహిస్తామని, ప్రతి కార్యకర్త కష్టసుఖాల్లో నేను మీకు అండగా ఉంటామని, మీకు ఎదురుపడే ప్రతి కష్టం ముందు నేను ఉంటానని ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మేజిక్ రాజాకు స్ఫూర్తి పురస్కారం

### రవీంద్ర భారతిలో సత్కారం

### మిమిక్రీ, స్టాండప్ కామెడీతో అలరించిన రాజా



రామగిరి జూన్ 10:-సకల కళా కోవిదుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి మేజిక్ రాజా స్ఫూర్తి పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మంగళవారం నిర్వహించిన వసుంధర విజ్ఞాన వికాస మండలి 32వ వార్షికోత్సవ వేడుకలలో హాజరైన అతిథులు మేజిక్ రాజాను శాలువాతో సత్కరించి, పురస్కారాన్ని అందజేశారు. స్థానిక లోకల్ ఛానల్ లో తొలితరం న్యూస్ రీడర్ గా, పాత్రికేయునిగా, కళాకారుడిగా ఆయన బహుముఖ ప్రతిభ అభినందనీయమన్నారు. జాతీయస్థాయి ఛానెళ్ళలో ఏ న్యూస్ రీడర్ కు తీసిపోని విధంగా తప్పులు లేని భాషోచ్ఛారణ ఆయన సొంతమన్నారు. భాష మీద పట్టుతో నాటి ముఖ్యమంత్రి, మంత్రుల పలు బహిరంగ సభలకు వ్యాఖ్యాతగా వ్యవహరించడం ఆయన ప్రతిభకు నిదర్శనమని ప్రశంసించారు. రాజా కవి, రచయిత, వ్యాఖ్యాత, ఇంద్రజాలికుడు, ధ్వన్యనుకరణ, మూకాభినయ కళాకారుడిగా, మోటివేటర్ గా రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో అవార్డులు అందుకున్నారని కొనియాడారు. కాగా రాజా ఈ పురస్కారం అందుకోవడం పట్ల స్థానిక స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్, రామగుండం కళాకారుల సంక్షేమ సంఘం, గోదావరి సరిగమలు, నియర్ అండ్ డియర్ స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ వ్యక్తిగత కార్యదర్శి, ప్రముఖ కవి ఏనుగు నర్సింహా రెడ్డి, కాళోజి అవార్డు గ్రహీత కోట్ల వెంకటేశ్వర్ రెడ్డి, వసుంధర సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మధుకర్ వైద్యుల, కన్వీనర్ దేవీ లక్ష్మీ నర్సయ్య, నిర్వహణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. మేజిక్ రాజా మిమిక్రీ, స్టాండప్ కామెడీతో సభికులను కడుపుబ్బా నవ్వించారు.

# అమ్మ మాట అంగన్వాడీ బాట




గుండాల జూన్10: మండలంలోని బ్రాహ్మణ పల్లి గ్రామంలో మంగళవారం రోజున అమ్మ మాట అంగన్వాడీ బాట కార్యక్రమం అంగన్వాడీ కేంద్రం 2లో నిర్వహించారు. అందులో భాగంగా గృహ సందర్శన చేసి పిల్లల ప్రాథమిక విద్య పోషకహారం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మోత్కూర్ ప్రాజెక్ట్ ఐసిడిఎస్ అధికారి జ్యోత్స్న, అనంతారం సూపర్ వైజర్ ఎస్. కె. యాకూబ్ పాషా, అంగన్వాడీ టీచర్ మహేశ్వరి, ఆశా వర్కర్లు రమ, నవనీత, సంఘబంధ సభ్యులు, ఆయా లక్ష్మి, ఆరోగ్య కమిటీ సభ్యులు, తల్లులు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రాంతాల్లోని స్థానికులకే ఉద్యోగాలు

ఈ సమావేశంలో డిప్యూటీ కానున్న డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్, ఎంఎల్ఎలు పాయం వెంకటేశ్వర్లు, వెడ్మ బొజ్జు పటేల్, కోవ లక్ష్మి, అనిల్ జాదవ్, ఆదినారాయణ, -ట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్య నాయక్, జిసిసి ఛైర్మన్ కోట్నాక్ తిరుపతి, -ట్రైబల్ సెక్రటరీ శరత్, ఎస్టి గురుకుల సంస్థ కార్యదర్శి సీతాలక్ష్మీ, అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి, జిసిసి, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు. రూ. 1,000 కోట్లతో రాజీవ్ యువ వికాశం, రూ. 12,600 కోట్లతో ఇందిర సౌరజల గిరి వికాసం, రూ.17,168 కోట్లతో ఎస్టి ఎస్డిఎఫ్ నిధులతో గిరిజనుల విద్య, ఆరోగ్యం, వసతి, ఉపాధి, మౌలిక వసతుల కల్పన వంటి ప్రజా ప్రయోజన పథకాలు అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్కకు సమావేశం ధన్యవాదాలు తెలిపింది. ఏజెన్సీ పాంత్రాల్లో అటవీ శాఖ అధికారుల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులను ఎంఎల్ఎలు మంత్రి దృష్టికి తెచ్చారు. గ్రామ సభల అనుమతులు లేకుండా, పెసా చట్టాలను ఉల్లంఘిస్తు అటవీ అధికారులు ఏక పక్షంగా వ్యవహరిస్తున్నారని అసంతృప్తిని వ్యక్తం చేశారు. తడోబా టైగర్ రిజర్వ్, కవ్వాల్ -టైగర్ రిజర్వు మధ్యలో ఉన్న ప్రాంతాన్ని కొమురం భీం కన్జర్వేషన్ రిజర్వుగా ప్రకటిస్తూ తెచ్చిన జిఓ నెం.49ను ఉపసంహరించుకోవాలని ఎంఎల్ఎలు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో గ్రామసభ అనుమతి లేకుండానే గ్రామంలో ప్రవేశించి ఫారెస్ట్ ఏరియా పేరుతొ భూములను స్వాదీనం చేసుకోవడాన్ని వారు తప్పుపట్టారు. గ్రామసభ అనుమతి లేకుండా గిరిజన గ్రామల్లో, పొలాల్లో అటవీశాఖ అధికారులు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వన్ని విజ్ఞప్తి చేస్తూ సమావేశం తీర్మానించింది. రాజీవ్ యువ వికాసం, ఇందిర సిరి జల వికాసం, అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల పై ప్రదానం గా చర్చ జరిగింది. డిప్యూటీ స్పీకర్ రామచంద్రనాయక్ ను ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. ఈ సమావేశంలో మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ ఐటిడిఎల ద్వారా ఇందిరమ్మ ఇండ్లు సాధించుకున్నామన్నారు. ఎస్టిలకు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రత్యేక కోటా కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇందిరా సౌర జల గిరి వికాసం ద్వారా గిరిజన రైతుల భూముల్లో సిరులు పండించబోతున్నామన్నారు. గిరిజన సంక్షేమ శాఖను ముఖ్యమంత్రి బలోపేతం చేసే దిశలో అడుగులు వేస్తున్నారన్నారని, రూ. 17,168 కోట్లు- కేటాయించారని తెలిపారు. పెసా నిబంధనలకు విరుద్దంగా అటవీ శాఖ తెచ్చిన జిఓ 49 ని ఉపసంహరించుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎంఎల్ఎలు కోరుతున్నారన్నారు. వారి అభిప్రాయాలను ముఖ్యమంత్రి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు తీసుకుంట్టామని మంత్రి సీతక్క హామినిచ్చారు. గిరిజన సంక్షేమ శాఖలో పెండింగ్ బిల్లులు ఉన్నాయని, వాటిని సిఎం, డిప్యూటీ- సిఎం దృష్టికి తీసుకెళ్లి విడుదల చేయిస్తామని తెలిపారు. మన సంస్కృతితోనే మన అస్థిత్వం కపాడబడుతుందని, అందుకే మన సంస్కృతిని, కళలను కపాడుకునేలా చర్యలు తీసుకుంమని చెప్పారు. గిరిజన విద్యా సంస్థల్లో జాతి గొప్పతనాన్ని చాటేలా మన అటలు, పాటల ద్వారా మన సంస్కృతిని చాటి చెప్పేల చర్యలు తీసుకుందాంమన్నారు. జననం నుంచి మరణం వరకు ఆదివాసుల జీవితాలను అక్షర బద్ధం చేసి భవిష్యత్తు తరాలకు అందిద్దామన్నారు. భద్రాచలం లో ఏర్పాటు- చేసిన -ట్రైబల్ మ్యూజియం తరహాలోనే ఇతర ఐటిడిఎల్లో మ్యూజియంలను, లైబ్రరీలను ఏర్పాటు- చేయాలన్నారు. ఏజెన్సీ ఏరియాలో ప్రత్యేక జాబ్ మేళాలను ఏర్పాటు- చేసి యువతకు ఉపాధి మార్గాలు కల్పిస్తామన్నారు. త్వరలో మహబూబాబాద్, ఆసిఫాబాద్లలో జాబ్ మేళాలు ఏర్పాచు చేస్తామని, గిరిజన సంక్షేమ శాఖలో అంతర్ భాగంగా ఉన్న సంస్కృతిక విభాగాన్ని బలోపేతం చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామన్నారు. గతంలో ఐటిడిఎ పరిధిలో ఉన్న 26 శాఖలను తిరిగి ఐటిడిఎ గోడుగు కిందికి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. అంబేద్కర్ ఓవర్సిస్ స్కాలర్ షిప్లో గిరిజన విద్య సంస్థల్లో చదువుకున్న విద్యార్థులకు 40 నుంచి 50 శాతం రిజర్వేషన్ అమలు చేసేలా నిర్ణయం తీసుకుంటామన్నారు. గిరిజన ఎంఎల్ఎల సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ముఖ్యంత్రి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిర్ణయాలను అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని సీతక్క హామినిచ్చారు. అంతకు ముందు మంత్రి సీతక్క సంక్షేమ భవన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ట్రైబల్ కెఫటేరియాను ప్రారంభించి, -ట్రైబల్ దేవాలయాలను దర్శించు కున్నారు. గిరిజనులు, అటవీ ప్రాంత వాసులకే పరిమితమైన చిరు, తృణ ధాన్యాలు, కల్తీకి తావులేని సహజ సిద్ధమైన ఆటవీ ఉత్పత్తులతో తయారుచేసిన చిరుతిళ్లు, వంటకా లను రాష్ట్ర ప్రజలందరికి రుచి చూపేందుకు కెఫ్ ఏర్పాటు- చేసిందన్నారు. అటవీ ఉత్పత్తు లతో తయారుచేసిన చిరుతిళ్లు, ఇతర వంటకాలను ప్రజలందరికి పరిచయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, హైదరాబాద్ లోని మాసాబ్ ట్యాంక్ వద్ద గల తెలుగు సంక్షేమ భవన్లో గిరిజన మ్యూజియం ముందు గిరిజన ఆహారశాల పేరుతో స్టాల్ ఏర్పాటు- చేశారు. 20 రకాల -ట్రైబల్ వంటకాలు ను అందుబాటు- లో ఉంచారు. మంత్రి సీతక్క గిరిజన వంటలను రుచి చూశారు. గిరిజన ఆడిటోరియంలో ప్రదర్శించిన ఆదివాసుల ఆరాధ్య దైవం కొమురం భీం పోరాటం, అమరత్వం ఇతివృతంగా రూపొందించిన కొమరం భీమ్ డాక్యుమెంటరీ చిత్ర ప్రదర్శనను గిరిజన ఆదివాసి ఎంఎల్ఎ లతో కలిసి సీతక్క వీక్షించారు.

# భారతీయ విద్యార్థిని హింసించిన తీరుపై విమర్శలు

### చట్టవిరుద్ధమైన వారికి యూఎస్లో ప్రవేశం లేదు

### చట్టబద్ధ ప్రయాణికులకు స్వాగతం ఉంటుందని వివరణ

న్యూఢిల్లీ,జూన్10 : భారతీయ విద్యార్థి పట్ల అమెరికా అధికారులు ప్రవర్తించిన తీరు ప్రస్తుతం చర్చనీయాంశమవుతున్న వేళ అమెరికన్ ఎంబసీ దీనిపై వివరణ ఇచ్చుకుంది. న్యూయార్క్ ఎయిర్పోర్ట్లో విమానం దిగిన అతడ్ని సెక్యూరిటీ అధికారులు అడ్డుకున్నారు. తలను నేలకేసి నొక్కిపెట్టి హింసించారు. ఇదుకు సంబంధించిన వీడియో వైరల్ అయ్యింది. ఈ ఘటనను భారతీయులు తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన నేపథ్యంలో భారత్లోని యూఎస్ రాయబార కార్యాలయం తాజాగా కీలక వ్యాఖ్యలు చేసింది. చట్టబద్ధమైన ప్రయాణికులను అమెరికా స్వాగతిస్తూనే ఉంటుందని పేర్కొంది. అయితే, చట్టవిరుద్ధమైన వారికి తమ దేశంలోకి ప్రవేశించే హక్కు లేదని పేర్కొంది. ఈ మేరకు ఎక్స్లో పోస్టు పెట్టింది. 'మా దేశంలోకి వచ్చే చట్టబద్ధమైన ప్రయాణికులను అమెరికా స్వాగతిస్తూనే ఉంటుంది. అయితే, చట్టవిరుద్ధమైన వారికి యూఎస్ను సందర్శించే హక్కు లేదు. అక్రమ ప్రవేశం, వీసాల దుర్వినియోగం, యూఎస్ చట్టాలను ఉల్లంఘించడాన్ని మేము సహించము. వారిని మా దేశంలోకి అనుమతించబోము' అని భారత్లోని యూఎస్ ఎంబసీ తన టీ-÷-వట్లో పేర్కొంది. ప్రస్తుతం ఈ టీ-÷-వట్ వైరల్ అవుతోంది. కాగా, రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్.. అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఆ దేశంలో అక్రమంగా నివసిస్తున్న వారిని గుర్తించి స్వదేశాలకు పంపుతున్నారు. ఈ క్రమంలో భారత్కు చెందిన ఓ విద్యార్థి న్యూయార్క్ ఎయిర్పోర్ట్లో దిగగానే అక్కడి పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. నేలపై పడుకోబెట్టి, చేతులకు బేడీలు వేశారు. వీసా రద్దయిందని, చట్ట వ్యతిరేకంగా అమెరికాలోకి ప్రవేశించావని చెప్తూ తిరిగి వెనక్కి పంపించారు. ఎయిర్పోర్ట్లో ఈ వీడియో తీసిన కునాల్ జైన్ అనే ప్రవాస భారతీయుడు సోషల్మీడియాలో పోస్ట్ చేశాడు. సదరు విద్యార్థి మాటతీరు చూస్తుంటే హర్యానాకు చెందిన వ్యక్తిగా అనిపించాడని పేర్కొన్నాడు. కలలను సాకారం చేసుకోవడానికి వచ్చానని, ఎవరికీ హాని తలపెట్టేందుకు రాలేదని.. విద్యార్థి బోరున విలపిస్తున్నా పట్టించుకోకుండా నేరస్థుడి పట్ల వ్యవహరించినట్టు- ప్రవర్తించారని చెప్పాడు. ప్రత్యక్ష సాక్షిగా ఈ దారుణంపై స్పందించలేని, నిస్సహాయ స్థితిలో చూస్తూ ఉండిపోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశాడు.

# మధు ధర్మ రెడ్డికి మెమొంటో అందజేత



రామగిరి జూన్ 10:- వసుంధర విజ్ఞాన వికాస మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు మధు ధర్మ రెడ్డికి జ్ఞాపికను కమాన్ పూర్ లైన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. వసుధర విజ్ఞాన వికాస మండలి గత 32 సంవత్సరాలుగా వివిధ కార్యక్రమాలను చేపట్టారు. రామగుండం కార్పొరేషన్ ఎనిమిదవ కాలనీలో ప్రారంభమైన వసుంధర విజ్ఞాన వికాస మండలి 32 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా పలువురు ప్రముఖులకు అవార్డులను అందజేయడం జరిగింది. దీనిలో భాగంగా వ్యవస్థాపక అధ్యక్షుడు మధు ధర్మ రెడ్డికి తమ సంస్థ ద్వారా చేసిన సహాయ సహకారాల ను ఫోటో రూపంలో ప్రచురించి అట్టి జ్ఞాపకను మధు ధర్మ రెడ్డి కి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ జబ్బార్ ఖాన్, దేవీ లక్ష్మీ నరసయ్య, మ్యూజిక్ రాజా, కే చంద్రశేఖర్ రెడ్డి , కటుకూరి శంకర్, నల్లవెల్లి శంకర్, రాచకొండ రాజు, తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి భూభారతి రెవెన్యూ సదస్సులలో దరఖాస్తు చేసుకోవాలి

### ప్రజల వద్దకే భూ పరిపాలన భూభారతి చట్టం

### రామగిరి తహసీల్దార్ సుమన్




రామగిరి జూన్ 10:- భూ సమస్యల పరిష్కారానికి భూభారతి రెవెన్యూ సదస్సులలో దరఖాస్తు చేసుకోవాలి భూభారతి రెవెన్యూ సదస్సులో భూములకు సంబంధించిన దరఖాస్తులు చేసుకోవాలని రామగిరి తహసీల్దార్ సుమన్ అన్నారు. మంగళవారం రామగిరి మండల పరిధిలోని ఆదివారం పేట గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రామగిరి తహసీల్దార్ సుమన్ మాట్లాడుతూ ప్రజల దగ్గరకే రెవెన్యూ వ్యవస్థ కదిలి వెళుతుంది. ప్రతి గ్రామంలో భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తారు అధికారులు. ఆగస్టు 15 నాటికి ఆ సమస్యలను ఉచితంగానే పరిష్కరిస్తారు. దీని కోసం రాష్ట్రంలోని అన్ని మండలాల్లో ట్రైనింగ్ ఇచ్చిన సర్వేయర్లతో సర్వే నిర్వహిస్తారు. గ్రామాల్లో నెలకొన్న భూముల సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందని అన్నారు. ఈ చట్టం ప్రకారం భూములకు సంబంధించిన సమస్యలు అధికారులు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. గ్రామాల్లో వివిద రకాలుగా ఉన్న భూసమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సులలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మైదం వరప్రసాద్, దాసిపెల్లి రాజిరెడ్డి, గోడిసేల సంతోష్, ఇల్లందుల సంజీవ్ మండల రెవిన్యూ అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# 14న గద్దర్ అవార్డుల వేడుక

### ముస్తాబవుతున్న హైటెక్స్ వేదిక

హైదరాబాద్ : జూన్ 14న గద్దర్ అవార్డుల వేడుకను అంగరంగ వైభవంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించడానికి తెలంగాణ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దాదాపు కొంత విరామం తరువాత ప్రభుత్వ అందిస్తున్న తెలంగాణ గద్దర్ అవార్డులు అందుకోనుండడం పట్ల అవార్డుల విజేతలు, తెలుగు సినిమా ప్రముఖులు, తెలుగు సినిమా ప్రేక్షకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రతిభను గుర్తించి తగు రీతిలో సత్కరించబోతున్న తెలంగాణ ప్రభుత్వం మీద ప్రశంసల జల్లులు కురిపిస్తున్నారు. ఈ వేడుకను సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటి రెడ్డి వెంకటరెడ్డి, ఎఫ్డీసీ ఛైర్మన్ దిల్ రాజు అత్యంత ఘనంగా జరిపించడానికి తగు ఏర్పాట్లు- చేయిస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక వేడుకకు తెలుగు తారాలోకమంతా తరలి రాబోతున్నారు. కొంత విరామం తరువాత సినిమా నటీనటులను, సాంకేతిక నిపుణుల ప్రతిభను ప్రోత్సాహించే సంప్రదాయ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం మళ్లీ శ్రీకారం చుట్టింది. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్ను ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే.

# సంపాదకీయం

## అక్షర సంకల్పానికి తూట్లు !

ప్రతి ఆవాసంలోనూ స్కూలు పెట్టి పిల్లలకు విద్యను చేరువ చేయాలన్న సంకల్పంతో ఏర్పాటు చేసిన ఏకోపాధ్యా పాఠశాలలు కనుమరుగు అయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలను ఓ క్రమపద్ధతిలో ప్రైవేట్ పాఠశాలలు మింగేశాయి. దీంతో మారుమూల గ్రామాల ప్రజలకు ప్రైవేట్ స్కూళ్లు దిక్కయ్యాయి. వారు మెల్లగా గ్రామాలకు బస్సులను పెట్టి, మండల కేంద్రాల్లో స్కూళ్లు పెట్టి, అందమైన బొమ్మలు చూపి ముగ్గులోకి దించుతూ వచ్చారు. ఇలాగత దశాబ్దకాలంగా ప్రైవేట్ స్కూళ్ల విజృంభణతో ప్రభుత్వ పాఠశాల లు కనుమరుగు అయ్యాయి. ఉమ్మడి ఎపిలో ఇలా అనేక స్కూళ్లు మూతపడ్డాయి. రాష్ట్ర విభజన తరవాత కూడా పాలకులు ఇదే ధోరణి అవలంబించడంతో అనేక పాఠశాలలు మూతపడ్డాయి. డిఎస్సీల గొడవ, జీతాల గొడవ లాంటివి లేకుండా చేసే కుట్రలో భాగంగా అనేక స్కూళ్లను మూసేశారు. ఘనత వహించిన తెలంగాణలో కెసిఆర్ సర్కార్ ఈ విషయంలో వడివడిగా అడుగులు వేసింది. అందుకే విద్యారంగంలో తీసుకున్న చర్యలు క్షేత్రస్థాయిలో ఎలాంటి ప్రభావం చూపలేదు. పేదలకు విద్య అందించాలన్న ఆలోచన లేకుండా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకున్నాయి. ఇంగ్లీష్ మీడియం ఆశ చూపి స్కూళ్ల విలీనంతో చిన్నపిల్లలు తమ సమీప స్కూళ్లకు వెళ్లే అవకాశం కోల్పోయేలా చేసిన ఘనతను నాటి సిఎం జగన్ సాధించారు. ఒకప్పుడు విద్యను గ్రామస్థాయికి తీసుకుని వెళ్లాలన్న సంకల్పంతో ఏకోపాధ్యాయ పాఠశాలలను ప్రారంభించారు. చిన్న గ్రామానికి కూడా స్కూలు ఉండాలన్న సంకల్పం వచ్చింది. అక్కడ ఒక్కరే టీచర్‌ను నియమించి నడిపించారు. దీంతో అనేక గ్రామాల్లో ఏకోపాధ్యాయ స్కూళ్లు ఏర్పడ్డాయి. తల్లిదండ్రులు తమపిల్లలను ఉన్న ఊర్లోని స్కూలుకు పంపడం వల్ల అక్షరజ్ఞానం వచ్చింది. ఇది అక్షరాస్యతకు తోడ్పడింది. అక్షరాస్యతను పెంచే క్రమంలో ఇదో విప్లవాత్మక చర్యగా చూడాలి. ఈ లక్ష్యం దెబ్బతినకుండా ప్రభుత్వాలు మరింత పకడ్బందీగా విద్యావ్యవస్థను అమలు చేయాల్సింది పోయి వాటిని మూతేశారు. ప్రభుత్వాలు జీతాల భారం తగ్గించుకునే క్రమంలో స్కూళ్ల విలీనం చర్యలకు పూనుకున్నాయి. దీనివల్ల సామాన్యులకు ప్రభుత్వ విద్య దూరం అయ్యింది. ఇది కూడా కార్పోరేట్ కుట్రలో భాగమే అని చెప్పాలి. వారు వెనకవుండి ఆడించిన కారణంగానే ప్రభుత్వాలు ఈ చర్యలకు దిగాయి. ఈ సమస్యను అర్థం చేసుకోకుండా ప్రాథమిక పాఠశాలలను.. ప్రాథమి కోన్నత, ఉన్నత విద్యాపాఠశాలల్లో విలీనం చేసారు. గతంలో పాలించిన జగన్ నాయకత్వంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పై విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర నిరసన వ్యక్తం అయ్యింది. మా పాఠశాలను వేరే పాఠశాలలో విలీనం చేయవద్దంటూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చేశారు. నిజానికి ప్రతి గ్రామానికి పాఠశాల ఉండాలన్న సంకల్పం దెబ్బతనికుండా చూడాల్సిన ప్రభుత్వం విలీనం పేరుతో ఇలా చేయడంతో సామాన్యులకు విద్యను దూరం చేశారు. అలాగే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇదే తంతు కొనసాగింది. ఇలా వందలాది పాఠశాలలను మూసివేశారు. ఇదంతా కుట్రపూరితంగా జరిగిన కార్యక్రమంగా గుర్తించాలి. దీంతో ప్రైవేట్ విద్యా సంస్థలు తమ విస్తరణకు అవకాశంగా తీసుకున్నాయి. గ్రామాలకు బస్సులను నడుపుతూ, మండల కేంద్రాల్లో స్కూళ్లను పెడుతూ, వాటిని పెంచుకుంటూ వచ్చారు. దీంతో విధిలేక తల్లిదండ్రులు ఇంటిముందుకు వచ్చే బస్సులో తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు పంపుతున్నారు. దీంతో వారిపై ఆర్థికభారం పడుతోంది. అనివార్యంగా ఇప్పుడు గ్రామాల్లో ప్రజలు తమ పిల్లను ప్రైవేట్ స్కూల్లకు బలిచేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం పెట్టాలన్న సంకల్పం మంచిదే అయినా గ్రామాలకు పాఠశాలలను దూరం చేయడం మాత్రం సరికాదు. ప్రాథమిక పాఠశాలలను విలీనం చేయడం ద్వారా తమ పిల్లలు బడులకు దూరమవుతారంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్న తీరు ప్రభుత్వం వెంటనే గుర్తించి దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి. సంస్కరణల పేరుతో పాఠశాలలను మూసివేస్తామంటే ఎలాగని గతంలోనే ఎపి హైకోర్టు నిలదీసింది. జాతీయ విద్యావిధానమంటూ విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా పాఠశాలల విలీనం, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ఎలా చేపడతారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. విద్యాహక్కు చట్టం మేరకు విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిని పాటిస్తున్నట్లు కనిపించడం లేదని కూడా హైకోర్టు అభిప్రాయ పడింది. ప్రాథమిక విద్య మాతృభాషలోనే ఉండాలని విద్యా హక్కు చట్టం చెబుతోంది. సర్కారు చర్యలు విద్యా వ్యవస్థను బలపరిచేలా ఉండాలే కానీ నిర్వీర్యం చేసేలా ఉండకూడదని పాలకులగుర్తించడం లేదు. నూతన విద్యా విధానం అమలు పేరుతో పాఠశాల విద్య దెబ్బతినకుండా, పిల్లలకు పాఠశాలలు దూరం కాకుండా చూసుకోవాలి. పాఠశాలల విలీనం, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ద్వారా స్కూళ్ల సంఖ్యను తగ్గించే ప్రయత్నం చేయరాదు. స్కూళ్లను పెంచి, సౌకర్యాలు కల్పించి, టీచర్లను పెంచడం ద్వారా మరింత పటిష్టంగా ప్రభుత్వ విద్య అమలయ్యేలా చూడాలి. ప్రభుత్వ అనాలోచిత చర్య కారణంగా చిన్నారులు, బాలికలు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉంది. విద్యారంగం అన్నది ఏ రాష్ట్రానికైనా ప్రాధాన్యరంగం కావాలి. ఏకోపాధ్యా స్కూళ్లను మరింతగా మెరుగు పరచి ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలి. దీంతో నిరుద్యోగ సమస్యా తీరవచ్చు. ఆర్థికంగా భారమైనా విద్యాయరంగానికి కేటాయింపులు పెంచి అనుత్పాదక రంగాలకు, ఉచితపథకాలకు కోతలు పెట్టాలి. అప్పుడే విద్యారంగం పటిష్టం కావడంతో పాటు..అక్షరాస్యతా ఉద్యమం ముందు సాగగలదు.

# ఆషాఢ బోనాలకు దగ్గర పడుతున్న సమయం



### ముందస్తు ఏర్పట్లో అధికార గణం

హైదరాబాద్ : మరికొన్ని రోజుల్లో ఆషాడ మాసం రానుంది. ఈ నేపద్యంలో హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలూ బోనాల జాతరను జరుపుకునేందుకు రెడీ అవుతున్నాయి. ఈ నెల 26వ తేదీ నుంచి ఆషాడ మాసం ప్రారంభం కానుంది. అయితే మొదటి రోజే గురువారం రావడంతో జూన్ 26వ తేదీ నుంచే బోనాల సంబురాలు ప్రారంభం కానున్నాయి. జూన్ 26న ఆషాడం మాసం ప్రారంభం కానుంది. ఆరోజు గురువారం కనుక తొలి బోనం గోల్కొండ లోని అమ్మవారికి సమర్పించడంతో బోనాల సంబురాలు ప్రారంభం అవుతాయి. ఆషాఢ మాస బోనాల ఏర్పాట్ల గురించి ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. అధికారులకు సూచనలు ఇస్తోంది. జంట నగరాల్లోని మొత్తం 28 ఆలయాల్లో ఆషాఢ బోనాల జాతర ఘనంగా జరపాలని చెప్పారు. భక్తులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు రావొద్దని.. బోనాల పండగను జరపడం కోసం ఎక్కడ లోటు- లేకుండా ప్రభుత్వం బడ్జెట్ కేటాయించిందని.. ప్రభుత్వం నుంచి ఇప్పటికే రూ 20 కోట్ల మంజూరు చేశామని చెప్పారు. ఒకవేళ బోనాల ఏర్పాట్లకు ఈ డబ్బులు సరిపోలేదు ఇంకా కావాలంటే సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి ఈ విషయాన్నీ తీసుకెళ్దామని.. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. భక్తులకు ఇబ్బందులు ఎక్కడా రానివ్వకుండా ఏర్పాట్లు- చేయాలనీ అధికారులకు సూచించారు. ఆషాఢ మాస బోనాలు సందర్భంగా అమ్మవారి ఆశీర్వాదం అందరి మీద ఉండాలని.. గతంలో ఏర్పాట్లు- చేసే సమయంలో జరిగిన సమస్యలను దృష్టిలో పెట్టుకుని.. మళ్ళీ జరగకుండా ఈ ఏడాది ముందస్తుగా భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఎ÷-లాన్ ఆఫ్ యాక్షన్ తయారు చేసుకుని ముందుకు వెళ్ళాలని మంత్రి కొండా సురేఖ సూచించారు. గోల్కొండ తర్వాత వరసగా బల్కంపేట, ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజ బోనాలు ఉంటాయి. ఈ బోనాల సందర్భంలో విధులను నిర్వహించే అధికారులు.. ఉద్యోగంలా భావించకుండా.. ఒక సేవ చేస్తున్నామని భావించాలని చెప్పారు. ఎందుకంటే సాంస్కృతిక కార్యక్రమాలు దైవ చింతనతో జరగాలని అన్నారు. అదే విధంగా బోనాల జాతరలో విధులను నిర్వహించే పోలీస్ సిబ్బంది.. లా అండ్ ఆర్డర్ ఎక్కడ ఇబ్బందులు లేకుండా అన్ని రకాల శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

# వరిరైతుకు కలసిరాని కాలం

### అకాల వర్షాలకు తోడు..సర్కార్ నిర్లక్ష్యం

గుంటూరు : వరి రైతుకు ఈ ఏడాది కాలం కలిసి రాలేదు. తెగుళ్లు, అధిక వర్షాలు, ఎలుకలు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపాయి. మరోవైపు మద్దతు ధర లభించే పరిస్థితి కానరావడం లేదు. వర్షం.. తెగుళ్లు.. ఎలుకలు.. ఇలా ధాన్యం రైతును దెబ్బతీశాయి. ఆరుగాలం కష్టించి సాగు చేసినా ఆశించిన దిగుబడులు రాక అన్నదాత అల్లాడుతున్నాడు. సాగు కష్టాలను అధిగమించి పండించిన ధాన్యానికి మార్కెట్‌లో మద్దతు గిట్టుబాటు ధర లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఆర్‌బీకేలో ధాన్యం కోనుగోళ్లకు ఏర్పాట్లు చేసినా శాంపిల్స్ స్థాయిలోనే ఉన్నాయి.నిబంధనలు పరిశీలిస్తే ధాన్యం విక్రయించుకునే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. యంత్రాలతో నూర్పిళ్లు చేస్తున్నందున తేమ ఉంటుందన్నారు. అయితే 17 శాతం లోపే తేమ ఉండాలని మార్కెటింగ్ శాఖ షరతులు విధిస్తున్నది. దీనికి తోడు ట్రాన్స్‌ఫోర్టు ఖర్చులు, కాటా కూలి కలిపితే బస్తాకు వందకుపైగా ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. షరతులు సడలించాలని, తేమను పరిగణనలోకి తీసుకోకుండా కోనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో కూడా మద్దతు ధర అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. మరోవైపు ఎకరాకు 5 నుంచి 10 బస్తాల వరకు దిగుబడులు తగ్గాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో వైపు మార్కెట్‌లో ధాన్యం ధర పతనమైంది. ఒకవైపు దిగుబడులు తగ్గడం.. మరోవైపు ధర పతనంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతుల నుంచి ధాన్యం కోనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందే కాని క్షేత్రస్థాయిలో చర్యలు లేవు. సాగర్ ఆయకట్టు ప్రాంతంలో కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఏటా 30 నుంచి 40 బస్తాల వరకు దిగుబడులు ఉండేవని ఈ ఏడాది పది బస్తాల వరకు తగ్గిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు రూ.30 వేల నుంచి 37 వేల వరకు సాగు వ్యయమైందని.. ఈ పరిస్థితుల్లో అప్పులే మిగిలాయని వాపోతున్నారు. ఆర్‌బీకేలలో ఇంకా పూర్తి స్థాయిలో కోనుగోలు చేయడంలేదు. ధాన్యం ఆరబెట్టి తీసుకెళ్లడం సాధ్యం కాదని అంటున్నారు.



# వ్యవసాయ విధానంలో లోపం

### సమగ్ర సాంకేతికతకు దూరం


### అనుబంధరంగాలకు దక్కని ప్రోత్సాహం

న్యూఢిల్లీ : కేంద్రం మద్దతు ధరలు ప్రకటించి..రైతుకు అండగా ఉన్నామని చెప్పడం...అయినా రైతుల పరిస్థితి మారడం లేదు. ఇటీవలే మద్దతు ధరలను కేంద్రం సవరించింది. వరి మొదలుకుని పలు పంటలకు మద్దతు ధరలను పెంచింది. అయితే వ్యవసాయ ముఖచిత్రం మారినా...ఆర్థికంగా రైతులు, దానిని నమ్ముకున్న ఇతర పనివాళ్లు బాగు పడడం లేదు. ఇకపోతే విదేశాల నుంచి నూనెల దిగుమతి వేరుశనగ రైతులకు శరా ఘాతంగా మారింది. నూనెల ధరలు మండుతున్నా నూనెగింజల ఉత్పత్తిని ప్రోత్సహించడం లేదు. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూసారం తగ్గుతోంది. ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జఠిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారిపోయింది. వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. అవసరం ఉన్నా..లేకున్నా ఇబ్బడి ముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా రైతులకు శాపంగా మారింది. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. మన అసవరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. అలాగే మన అసవరాలకు అనగుణంగా పంటల విధానం తీసుకుని రావాలి. పంటల విధానంలో మార్పులు రావాలని రైతులతో పాటు, శాస్త్ర వేత్తలు, నిపుణులు కూడా కోరుకుం టున్నారు. నిజానికి కార్పోరేట్ లేదా ఇతర కంపెనీలకు మించిన ఆదాయాన్ని, ఉద్యోగ కల్పనను వ్యవసాయరంగమే కల్పిస్తోంది. వ్యవసాయానికి పెద్దపీట వేసివుంటే ఈ రంగం దేశ ఆర్థిక పురోగతిలో కీలకం కానుంది. అయినా ఈ విషయంలో ప్రభుత్వాలది నిర్లక్ష్య ధోరణి తప్ప మరోటి కాదు. నేటికీ పంటల విధానం, కొనుగోళ్ల విధానం సక్రమంగా అమలు కావడం లేదు. ధాన్యాగారాల్లో మగ్గుతున్న ధాన్యం దేశం దాటి పోవడం లేదు. వాటిని ఇతర దేశాలకు అమ్ముకునేలా విధానాలు అమలు కావడం లేదు. బహుళజాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. అనేక కంపెనీలకు ఇస్తున్న రాయితీల మాదిరి వ్యవసాయానికి కూడా రాయితీలు ఇచ్చి పంటల ఉత్పత్తిని సవాల్‌గా తీసుకుంటే దేశంలోని సగం దరిద్రం పోతుంది. ఈ క్రమంలో సేంద్రియ వ్యవసాయానికి చేయూతను ఇస్తే అంతర్జాతీయంగా మన పంటలకు డిమాండ్ కూడా పెరుగుతుంది. అలాగే దేశంలో ఉన్న వ్యవసాయ భూముల్లో ఎక్కడెక్కడ ఏ పంట పండుతుందో తెలుసుకుని.. అందుకు అనుగుణంగా పంటల విధానం తీసుకుని రావాలి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టి యువతను ప్రోత్సహించడం ద్వారా నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టవచ్చు. కానీ అలా జరగడం లేదు. సస్యవిప్లవానికి నాంది పలికేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలకు పూనుకోవాల్సిన తరుణంలో వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారు. దేశీయంగా వ్యవసాయ పురోభివృద్ధికి పాటుపడడం లేదని వ్యవసాయరంగ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. అలా చేయడం వల్ల వ్యవసాయం రంగం అతిపెద్ద ఉత్పాదక రంగంగా మారగలదని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెంచితే మంచిది. తెలంగాణలో పండే జొన్న, మక్కజొన్న,సజ్జ పంటలకు సరైన ధరలు రావడం లేదు. రైతులను ఆదుకున్నామని చెబుతున్న ప్రభుత్వాలు..క్షేత్రస్థాయిలో రైతులు ధాన్యం కొనాటంలూ ఆందోళన చేస్తున్నా పట్టించుకోని దౌర్భాగ్యం నేటికీ కనిపిస్తోంది. రైతుల గురించి మాట్లాడుతున్న పాలకులు ధాన్యం కొనుగోళ్లలో వస్తున్న ఆందోళనలను పట్టించుకోవడం లేదు. ముందుగా వానాకాలం ... తరవాత యాసంగిలో ఏ ధాన్యం వేయాలో మండలాల వారీగా నిర్ణయించి.. రైతులకు సూచనలు చేయాలి. అవసరమైతే వారినిచైతన్యం చేయాలి.కానీ అందుకు భిన్నంగా ప్రభుత్వాలు వ్యయసాయ విధానాలను కొనసాగిస్తున్నారు. నిజానికి ధాన్యం కొనుగోలు అన్నది ఒక పంటకు ముందే నిర్ణయించాలి. ఏ పంట వేయాలో ముందే చెప్పాలి. కానీ అదేమీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం మీద కేంద్రం... కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వాలు దుమ్మెత్తి పోసుకోవడం సరికాదు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఒకరి మీద ఒకరు నెపం నెట్టేసుకోవడం తప్ప ధాన్యం నిల్వలను కొనేందుకు నిర్దుష్ట ప్రణాళికతో ముందుకు రావడం లేదు.



# త్యాగం.. మహోన్నతం

ఇస్లాంలో ఖుర్బానీ (త్యాగం), బలి దానాల భావన అత్యంత ఉన్నతమైనది. ఈదుల్ అజ్హాను ఖుర్బానీ పండుగ అని కూడా పిలుస్తారు. హజ్రత్ ఇబ్రహీం (అ.స) అసాధారణ త్యాగాలను ఈ పండుగ గుర్తుచేస్తుంది. 'మీరు అమితంగా ప్రేమించే వస్తువులను అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టనంత వరకు మీరు సత్కార్య స్థాయికి చేరుకోలేరు. మీరు ఖర్చు చేసేదంతా అల్లాహ్‌కు బాగా తెలుసు' అని త్యాగం విలువలను అల్లాహ్ ఖురాన్‌లో (3: 92) వివరించారు. త్యాగనిరతి ఎంత ఎక్కువగా ఉంటే, సత్కార్య ప్రమాణం అంత ఎక్కువగా ఉంటుంది. హజ్రత్ ఇబ్రహీం (అ.స)కు అల్లాహ్ ప్రసన్నత కోసం చూపిన గొప్ప త్యాగనిరతి అల్లాహ్ పట్ల ఆయనకు ఉన్న అపారమైన ప్రేమ వల్లనే జనించింది. 'ఆయన నాకు మార్గం చూపుతున్నాడు. నా ఆకలిని తీర్చి నా రోగాలను నయం చేస్తున్నాడు. ఆయనే మృత్యువును కలిగించి మళ్లీ జీవితాన్ని అనుగ్రహిస్తాడు' అని హజ్రత్ ఇబ్రహీం (అ.స) అన్నారు. దేవుడు ఒకే ఒక్కడనే ఏకదైవారాధన సందేశాన్ని ప్రజలకు అందించడానికి హజ్రత్ ఇబ్రహీం (అ.స) తన జీవితాన్ని అంకితం చేశారు. సమాజం వ్యతిరేకించినా, రాజు (నమ్రూద్) మరణ శిక్ష విధించినా ఆయన తన లక్ష్యాన్ని వీడలేదు. తన భార్యను, పసిబిడ్డను చుక్క నీరు లేని నిర్జన లోయలో విడిచి పెట్టాల్సి వచ్చినా చలించలేదు. కన్న కొడుకుని బలి ఇవ్వమని ఆదేశం వచ్చినా వెనుకాడలేదు. ఈ మూడు పరీక్షల్లో విజయం సాధించిన తర్వాతే, అల్లాహ్ ఆయన్ను మానవాళికి నాయకుడిగా చేశాడు. అల్లాహ్ ప్రేమ కోసం సమస్తాన్నీ త్యాగం చేయడానికి సిద్ధంగా ఉండాలని హజ్రత్ ఇబ్రహీం (అ.స) జీవితం మనకు తెలియజేస్తుంది



ఆధ్యాత్మికం

## అక్రమంగా ఇసుక తరలిస్తున్నందుకు ఎఫ్ఐఆర్ నమోదు

**- ఇన్చార్జి డిప్యూటీ తహసిల్దార్ ఉదయ్ కుమార్**



**ధర్మారం, జూన్ 10 :** అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారిపై ఎఫ్ ఐ ఆర్, పోలీసులు నమోదు చేసినట్టు ఇంచార్జ్ డిప్యూటీ తహసిల్దార్ తెలిపారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని నర్సింగాపూర్ గ్రామ శివారులో ఇసుక అక్రమంగా తరలిస్తున్న వారి నుండి ట్రాక్టర్ ఇసుక జాలి మోటర్ ను రెవెన్యూ ఇన్స్పెక్టర్ 1 వరలక్ష్మి పోలీసు ఆధ్వర్యంలో పట్టుకోవటం జరిగింది. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారు పెగడపల్లి మండలానికి చెందినవారుగా గుర్తించి ఈరోజు మంగళవారం స్థానిక ధర్మారం మండల పోలీస్ స్టేషన్ లో ఎఫ్ఐఆర్ నమోదు అయినట్టు ప్రస్తుతం మండల ఇంచార్జ్ డిప్యూటీ తహసిల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకనుండి ఎవరైనా అక్రమంగా ఇలాగ తరలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## భూ భారతి -రెవిన్యూ సదస్సులను పర్యవేక్షించిన ఆర్డీవో..







**జమ్మికుంట జూన్ 10 :** జమ్మికుంట మండలం వావిలాల గ్రామంలో మంగళవారం రోజున నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మొత్తం 221 దరఖాస్తులు వివిధ భూ సమస్యలపై రావడం జరిగింది. వీటిని రెవెన్యూ డివిజన్ అధికారి రమేష్ బాబు పర్యవేక్షించినారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నల్ల వెంకట రెడ్డి, నాయబ్ తహశీల్దార్ శ్రీనివాస్, గిర్దావర్లు సత్యనారాయణ, శంకర్, ఎంపీఎస్ఓ, సర్వేయర్ ఇతర రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి హెూదాలో మొదటి సారి విచ్చిన అడ్లూరి

**- ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు**



**ధర్మారం,జూన్ 10 :** మంత్రి హెూదాలో మొదటి సారి నియోజకవర్గం విచ్చిన అడ్లూరికి ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ క్యాబినెట్ విస్తరణలో మంత్రి పదవి పొందిన సందర్భంగా అడ్డూరి లక్ష్మణ్ కుమార్ మొదటిసారి ధర్మపురి నియోజకవర్గంలో మంత్రి హెూదాలో విచేస్తున్న సందర్భంగా ధర్మారం మండలం పత్తిపాక ఎక్స్ రోడ్ వద్ద నియోజవర్గం మండలాల నుండి వచ్చిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్కు ఘన స్వాగతం పలికారు. ఇక్కడినుండి కార్యకర్తలు అభిమానులతో ర్యాలీగా ధర్మపురి కి వెళ్ళారు..

## విద్యుత్ ఘాతానికి గొర్రెలు మృతి



**ధర్మారం,జూన్ 10 :** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని చామనపల్లి గ్రామానికి చెందిన గొర్ల కాపరులు రోజువారీగా తమ గొర్లను మేపటానికి సున్నం మాటు వద్దకు వెళ్ళారు అక్కడ ఉన్న కాలువకు వెళ్లిన గోర్లు విద్యుత్ షాక్ కు గురై అక్కడికక్కడే సుమారు యాభై గోర్లు మరణించినట్టు స్థానికుల సమాచారం. పక్కన ఉన్న విద్యుత్ తీగలకు గడ్డితిగ అల్లుకొని దాని ద్వారా ప్రమాదం జరిగినట్టు గొర్ల కాపర్లు తెలిపారు. జరిగిన నష్టానికి ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

# ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలి

**◆ డి ఎం హెచ్ ఓ డాక్టర్ వెంకటరమణ**








**జమ్మికుంట జూన్ 10 :** జమ్మికుంట పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం( సి హెచ్ సి) లో ఈరోజు నుండి జరుగుతున్న ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని డి ఎం హెచ్ ఓ డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ డి ఎం హెచ్ వో డాక్టర్ చందు, పి ఓ ఎం సి హెచ్ డాక్టర్ సన జవేరియా తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా డి ఎం హెచ్ ఓ డాక్టర్ వెంకట రమణ ఆరోగ్య మహిళ శిబిరానికి వచ్చిన మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి మంగళవారం, శుక్ర వారం ఆరోగ్య మహిళా శిబిరం నిర్వహిస్తారని వైద్యురాలు సూచన మేరకు వైద్య పరీక్షలు చేసుకోవాలని సుమారు 56 రకాల వైద్య పరీక్షలు చేస్తారని ప్రతి మహిళ కనీసం మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేసుకోవాలని కుటుంబం గురించి ఆలోచించే మహిళలు ముందుగా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఒకవేళ అనారోగ్యం బారిన పడితే ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి నష్టపోకుండా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లాలని సూచించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత,పరిసరాల పరిశుభ్రత, వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు ముఖ్యంగా డ్రై డే మీద అవగాహన కల్పించారు ప్రతి మహిళ ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యం ఉపకేంద్రం ఆకస్మిక తనిఖీ... డి ఎం హెచ్ ఓ డాక్టర్ వెంకటరమణ ఆరోగ్య ఉప కేంద్రం1 ను ఆకస్మిక తనిఖీ చేసి ఉపకేంద్రం కేంద్రం యొక్క హాజరు పట్టిక, రికార్డులను తనిఖీ చేసి పేషెంట్లకు పంపిణీ చేస్తున్న మందులను పరిశీలించడం జరిగింది. ఎన్ సి డి క్లినిక్ లోని అధిక రక్తపోటు మరియు డయాబెటిస్ రోగుల వివరాలను వారికి అందుతున్న మందుల వివరాల నమోదును పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ చందు, సివిల్ హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి,పిఓఎంసిహెచ్ డాక్టర్ సనజవేరియా, జిమ్మికుంట ఆరోగ్య ఉప కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చందన, మోహన్ రెడ్డి హెల్త్ ఎడ్యుకేటర్, సూపర్వైజర్స్ రత్నకుమారి, అరుణ లతో పాటు పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

**◆ జిల్లా విద్యాశాఖ అధికారి డి మాధవి**



**పెద్దపల్లి ప్రతినిధి :** పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి మాధవి తెలిపారు. మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి డి మాధవి, పెద్దపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురులో ఉపాధ్యాయులు, పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వ పాఠశాలలో చేపట్టాల్సిన పారిశుధ్య చర్యలు గురించి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి డి మాధవి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల వ్యాప్తిని నిరోధించేందుకు అవసరమైన చర్యలు ప్రభుత్వ పాఠశాలలో కట్టుదిట్టంగా తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని వ్యర్థ పదార్థాల నిర్వహణపై ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. పాఠశాలలోని తరగతి గదులు టాయిలెట్లు కారిడార్ మెట్లు ఆట స్థలాలు అసెంబ్లీ ప్రాంతాలు సిబ్బంది గదులు కార్యాలయ ప్రాంతాలు నీటి ట్యాంకులు అండ్ వాషింగ్ స్టేషన్లను ఎలా శుభ్రపరుచుకోవాలో అనే అంశం మీద ప్రతి మండలం నుంచి ఒక ఉపాధ్యాయునికి, 2 పారిశుధ్య సిబ్బందికి శిక్షణ అందించామని అన్నారు.జూన్ 11 నాడు ప్రతి మండలంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, పారిశుధ్య కార్మికుల సిబ్బందికి మండల కేంద్రాలలో ప్రభుత్వ పాఠశాలలో చేపట్టాల్సిన పారిశుధ్య పనులపై అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారి సూచించారు. పాఠశాలలోని పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రత చేతులు తరచుగా కడుక్కోవడం, మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి అంశాల పట్ల అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారి సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక మండల విద్యాశాఖ అధికారి టి సురేందర్, రిసోర్స్ పర్సన్ దయాకర్, సమన్వయకర్త అజీమ్ దబీర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ హామీలపై గ్రామాల్లో ప్రశ్నించండి

**- సంకల్ప సాకార యోజన యోజన జిల్లా ఇన్చార్జి గుజ్జ శ్రీనివాస్**





**తిమ్మాపూర్, జూన్ 10,:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలోని సాయిరాం గార్డెన్ లో మంగళవారం బిజెపి మండలాధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వర చారి ఆద్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా సంకల్ప సాకార యోజన జిల్లా ఇన్చార్జి గుజ్జ శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ.....కాంగ్రెస్ హామీలపై గ్రామాల్లో ఎల్లప్పుడూ ప్రశ్నిస్తూనే 11ఏళ్ళలో మోడీ ప్రభుత్వం చేసిన గణమైన కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు.నరేంద్ర మోదీ నేత్రుత్వంలో భారత ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటూ ప్రజలకు సుపరిపాలన అందిస్తుందని,కాశ్మీర్ లో ఇటీవల జరిగిన ఉగ్రదాడికి ప్రతీకార చర్యలతో ప్రపంచ వ్యాప్తంగా భారతదేశం సత్తాను చాటామని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల మంజూరులో కాంగ్రెస్ నాయకులు వివక్షత చూపుతున్నారని ఆరోపిస్తూ ఇచ్చిన హామీల అమలు విషయంలో చిత్తశుద్ధతో పనిచేయాలని డిమాండ్ చేస్తూ ప్రతీ కార్యకర్త పార్టీ కార్యక్రమాలకు హాజరై పార్టీని పటిష్టం చేసేందుకు కృషి చేయాలని కోరుతూ రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని సుగుర్తి జగదీశ్వర చారి సూచించారు. అనంతరం గార్డెన్ ఆవరణలో పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తల్లి పేరుతో మొక్కను నాటారు.కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బూట్ల శ్రీనివాస్, చింతం శ్రీనివాస్, మాజీ జడ్పటీసి ఎడ్ల జోగిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, కిన్నెర అనిల్, వివిధ మోర్చా అధ్యక్షులు, జిల్లా భాద్యులు, బూత్ కమిటీ కార్యవర్గం అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## టీపీసీసీ మైనారిటీ సెల్ తొర్రూరు మండలం అధ్యక్షులుగా షేక్ హైమద్ పాషా







**తొర్రూరు, :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తొర్రూరు మండల మైనారిటీ సెల్ అధ్యక్షులుగా హరిపిరాల గ్రామానికి చెందిన షేక్ అహ్మద్ పాషా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హనుమాన్ల ఝాన్సీ రెడ్డి, ఎమ్మెల్యే యశస్వినివి రెడ్డి సహకారంతో మైనారిటీ విభాగం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ ఖలీల్ అహ్మద్ చేతుల మీదుగా మంగళవారం నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా హైమద్ పాషా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం మరియు కాంగ్రెస్ పార్టీకి ఏడు సంవత్సరాల నుండి ఎంతో నమ్మకంగా పార్టీని బలోపేతం చేయడంలో మరియు రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీని కాపాడుకునేందుకు తన వంతు పాత్ర వహిస్తారని అన్నారు. ఈ బాధ్యతను అప్పజెప్పినటువంటి జిల్లా రాష్ట్ర నాయకత్వానికి ఎంతగానో రుణపడి ఉంటానని అన్నారు.

# తుది వరకు ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటా

## ◆ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



**తిమ్మాపూర్, జూన్ 10,:** మంగళవారం తన పుట్టిన రోజు సందర్భంగా పార్టీ శ్రేణులతో వేడుకలు జరుపుకునేందుకు సతీసమేతంగా వచ్చిన ఎమ్మెల్యే కవ్వంపల్లి దంపతులకు బెజ్జంకి క్రాస్ రోడ్డు వద్ద నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికి క్రేన్ ద్వారా బారీ గజమాలతో ఎమ్మెల్యేను సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. తిమ్మాపూర్ మండలం నుస్లాపూర్ లోని ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అల్గునూరులోని ఉన్నతి ఫంక్షన్ హాల్ లో పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎమ్మెల్యే కవ్వంపల్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ...... ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు తన తుది వరకు శ్రమిస్తానని తన కష్టాల్లో వెన్నంటి ఉంటున్న పార్టీ శ్రేణులను కాపాడుకుంటూ వాళ్ళ కష్టసుఖాల్లో పాలుపంచు కుంటానని ధీమా వ్యక్తంచేశారు. పదవులు శాశ్వతం కాదని అనుబంధాలే శాశ్వతమని తనకు మంత్రి పదవి రాలేదని ఎవరూ నిరాశపడవద్దని, ప్రజల ప్రోత్సాహంతో ఆ ప్రయత్నాన్ని కొనసాగిస్తానని, ప్రయత్నించే వారికే విజయం సొంతమవు తుందంటూ తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసేందుకు తరలివచ్చిన ప్రజలకు, పార్టీ శ్రేణులకు, అభిమానులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ..... ప్రజలకు సేవ చేయాలన్న తపన గల వారికి పదవులు ముఖ్యం కాదని పేర్కొంటూ వైద్యుడిగా, ఎమ్మెల్యేగా అందించిన సేవలతో కవ్వంపల్లి సత్యనారాయణ ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించు కున్నారని కొనియాడారు. ఈ వేడుకలో అన్ని మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు బండారి రమేశ్ గౌడ్, నందగిరి రవీంద్రచారి, గోపగోని బసవయ్య గౌడ్, ముస్కు ఉపేందర్ రెడ్డి ముక్కిస రత్నాకర్ రెడ్డి, కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, తిమ్మాపూర్ మాజీ వైస్ ఎంపిపి తుమ్మనపల్లి శ్రీనివాస్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్లు పులి కృష్ణ, మర్రి ఓదెలు యాదవ్, చైతన్య మహేందర్ రెడ్డి జిల్లా స్థాయి, మండల స్థాయి నాయకులు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్మికులందరూ జీవిత బీమా కల్గి ఉండాలి

## ◆ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ



**గోదావరి ఖని టౌన్ :** ప్రతి కార్మికుడు తప్పనిసరిగా బీమా కల్గి ఉండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ అన్నారు. మంగళవారం ఎన్టిపిసి కాకతీయ కళ్యాణ మండపంలో నిర్వహించిన ఇన్సురెన్స్ మేళా కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ పాల్గోన్నారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రమాదాలలో పారిశుధ్య కార్మికులు, రాక్ ఫిల్లర్లు, హెల్త్ వర్కర్ మరణిస్తే వారి కుటుంబానికి కొంత పరిహారం అందాలి ప్రతి కార్మికుడికి తప్పనిసరిగా బీమా కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ సూచించారు. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతులలో పనిచేస్తున్న వివిధ పారిశుద్ధ్య కార్మికులు, హెల్త్ వర్కర్, రాక్ ఫిలర్ల కు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాల పై అవగాహన కల్పించి వారి నుంచి బీమా సౌకర్యం కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్, డిప్యూటీ కమిషనర్ ఎన్ వెంకట స్వామి, రీజినల్ మేనేజర్ రవీందర్ సింగ్, రామకృష్ణ, ఎస్బిఐ మేనేజర్ నవీన్ కుమార్, మున్సిపల్ కార్యాలయ సూపరిండెంట్ పి. శ్రీనివాస్ జూనియర్ అసిస్టెంట్ మర్రి శంకర స్వామి, సాయి శానిటర్ ఇన్స్పెక్టర్లు ఎల్ కుమారస్వామి, డి కిరణ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పుట్టినరోజు వేడుకలకు మొక్కలు నాటాలి....

## ◆ పర్యావరణ పరిరక్షణతో ఆరోగ్యకరమైన జీవితం ◆ హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ కే సమ్మయ్య





**హుజురాబాద్ జూన్ 10 :** ప్రతి ఒక్కరు తమ పుట్టినరోజు వేడుకలకు మొక్కలు నాటాలనీ, దీంతో పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యకరమైన జీవితం ఏర్పడుతుందని హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ కే సమ్మయ్య పేర్కొన్నారు. మంగళవారం హుజురాబాద్ పట్టణంలోని బుడగ జంగాల కాలనీ అంగన్వాడీ టీచర్, సామాజిక కార్యకర్త కోటోజు జ్యోతిరాణి కుమారుడు సాయికిరిటి జన్మదినం సందర్భంగా హుజురాబాద్ మునిసిపల్ కమిషనర్ సమ్మయ్య ఆధ్వర్యంలో మేనేజర్ రావుల భూపాల్ రెడ్డి, వార్డ్ అధికారులు నూనే రమేష్, రొడ్డ సురేష్, అందే రవీందర్, వెంకటరమణ, రజిత, నాగమణి, అనుషలు పలు రకాల ఔషధ మొక్కలను మున్సిపల్ ఆవరణంలో నాటడం జరిగింది. ఎవరైనా జన్మదిన, వివాహ వేడుకలకు కేకులు కట్ చేసి డబ్బులు దుబారా చేస్తే బధలు ఆరోగ్యాన్ని ఇచ్చే ప్రజాసంక్షేమాన్ని ఆశించి విరివిగా మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలి అన్నారు. జ్యోతి రాణి గత 20 ఏళ్లుగా తమ పిల్లల పుట్టినరోజుకు మొక్కలు నాటడం సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం ఆనవాయితీగా రావడం అభినందనీ యమన్నారు. విద్యార్థిని విద్యార్థులు చదువు కోవడానికి వీలుగా జ్యోతి రాణి సుమారు 10,000 రూపాయల విలువ గల పోటీ పరీక్షల పుస్తకాలను హుజురాబాద్ లైబ్రరీకి అందజేయడం జరిగిందనీ, ఇలాంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టేందుకు ఆమెను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మండల యాదగిరి, సీనియర్ పాత్రికేయులు ఆనుమాస రాజేందర్, పరాంకుశం కిరణ్ కుమార్, గడ్డం హర్షవర్ధన్, చిలుకమారి సత్యరాజు, కె శ్రీధర్, సబ్బని వెంకటేష్, భాషబోయిన రాజు,ఆయుర్వేద వైద్యుడు సుధాకర్, అంగన్వాడీ టీచర్లు సుకన్య, సబిత, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలి

**- ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడి అరికట్టాలి**

**- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జిల్లాల ప్రశాంత్**

**పెద్దపల్లి ప్రతినిధి :** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అనుమతులు లేని పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలనీ ప్రవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల దోపిడీ అరికట్టాలని పెద్దపల్లి జిల్లా విద్యాధికారి మాధవి గారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి జిల్లాల ప్రశాంత్ మాట్లాడుతూలి పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేకుండా ప్రైవేట్ పాఠశాలలను నడుపుతున్నారు వారిపైన చర్యలు తీసుకోనీ ఆ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ లేకుండా పోయింది విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు ప్రతి సంవత్సరం ఫీజులను పరిమితికి మించి ఫీజులను వసూలు చేస్తున్నారని అన్నారు వెంటనే ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థలలో పాఠ్యపుస్తకాలు దుస్తులు స్టేషనరీ లాంటివి అక్రమంగా అమ్ముతూ విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని మోపుతున్నారు కాబట్టి వెంటనే ఈ యొక్క సమస్యల పైన తనిఖీలు నిర్వహించి విద్యా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న పాఠశాలల పైన కఠినమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. లేనిపక్షంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు గద్దల సిద్ధార్థ, పెద్దపల్లి నగర కార్యదర్శి ఆర్నకొండ ఆదిత్య , నాయకులు అభిరామ్, శశాంక్, అభినవ్ తదితరులు పాల్గొన్నారు



# పాఠశాలలలో పారిశుద్ధ్యం సక్రమంగా నిర్వహించాలి

**- డిఇఓ యాదయ్య**



**లక్షెట్టిపేట, జూన్ 10 :** మండలంలోని అన్ని పాఠశాలలలో పారిశుద్ధ్యం సక్రమంగా నిర్వహించి విద్యార్థులకు వ్యాధులు ప్రబలకుండా చూడాలని మంచిర్యాల డీఈవో యాదయ్య అన్నారు. మండల స్థాయి స్కావెంజర్ల శిక్షణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పారిశుధ్యం పై అవగాహన కల్పించవలసిన బాధ్యత స్కావెంజర్లపై ఉంటుందని మరియు వర్షాకాలంలో వచ్చే అంటూ వ్యాధులను నివారించే విధానాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. నూటికి 90% వ్యాధులు అపరిశుభ్రత వల్లనే వస్తాయని కావున అవి సంక్రమించకుండా చూడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటే రాష్ట్రం దాంతోపాటు దేశం ఆరోగ్యంగా ఉంటుందని కావున ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండడం కనీస బాధ్యత అన్నారు. మండల రిసోర్స్ పర్సన్ కొన్జర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ తరగతి గదులు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలి దానితో పాటు చెట్లు మొక్కలు దోమలకు ఆలవాలం కాకుండా చూసుకోవాలని మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఎంఈఓ శైలజ సెక్టోరల్ ఆఫీసర్ చౌదరి మరియు స్కావెంజర్లు పాల్గొన్నారు.

# బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో ప్రవేశం కొరకు దరఖాస్తుల ఆహ్వానం

**- జూన్ -17 సాయంత్రం 5 గంటల లోపు కరీంనగర్ జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలి - జూన్ -20న లాటరీ పద్ధతిలో విద్యార్థుల ఎంపిక - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి ప్రతినిధి :** 2025-26 సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ స్కూల్ లో 3వ, 5వ, 8వ తరగతుల్లో ప్రవేశం కొరకు పెద్దపల్లి జిల్లాలోని గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు జూన్ 6 లోగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ నందు జిల్లాకు చెందిన గిరిజన విద్యార్థినీ, విద్యార్థులకు మొత్తము (5) సీట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. మూడవ తరగతిలో లంబాడ బాలికలకు ఒకటి, బాలురకు ఒకటి, ఎరుకుల బాలురకు ఒకటి చొప్పున కేటాయించడం జరిగిందని తెలిపారు. ఐదవ తరగతిలో గోండు బాలురకు ఒకటి, 8వ తరగతి లో లంబాడ బాలికలకు ఒకటి చొప్పున కేటాయించడం జరిగిందన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం అర్బన్ ప్రాంతంలో రెండు లక్షలు, రూరల్ ప్రాంతంలో ఒక లక్షా 50 వేలు ఉండాలని, ధ్రువీకరణ పత్రాలు ఆదాయం, కులం, బర్త్, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, పాస్ పోర్ట్ 2 సైజ్ ఫోటోలను జత చేసి పూర్తి చేసిన దరఖాస్తులను జూన్ 17లోగా కరీంనగర్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని, వచ్చిన దరఖాస్తుల నుండి జూన్ 20న లాటరీ పద్ధతిలో ద్వారా ఎంపిక చేయనున్నట్లు, ఇతర వివరాలకు ఫోన్ నెంబరు 9652118867 నందు సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

**- ముత్తారం ఎస్ఐ గోపతి నరేష్**





**ముత్తారం.జూన్.10.** ముత్తారం మండలంలోని పలు విత్తన,ఎరువుల దుకాణాలలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి అనూష, ముత్తారం ఎస్సై గోపతి నరేష్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా విత్తన దుకాణాలలో విత్తన రిజిస్టర్ లను, బిల్ బుక్ లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని,నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని సూచించారు. దుకాణదారులు విత్తనాలను కొనుగోలు చేసిన ప్రతి రైతుకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని, ప్రతి రైతు విత్తనం కొనుగోలు చేసిన వెంటనే రశీదు తప్పక తీసుకోవాలని దానిని పంట కాలము ముగిసే వరకు జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని తెలిపారు.

# అల్గునూరు అంగన్వాడీ -2 కేంద్రంలో బడిబాట కార్యక్రమం



**తిమ్మాపూర్, జూన్ 10,:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూరు కాకతీయ కాలనీలోగల అంగన్వాడీ -2 కేంద్రంలో మంగళవారం బడి బాడ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా డిడబ్లూఓ అధికారిని హాజరై మాట్లాడుతూ.... ప్రతీ ఇంటికి వెళ్ళి బడికి వెళ్ళని మూడు నుండి ఐదు సంవత్సరాల పిల్లలను గుర్తించి బడి యొక్క ప్రాముఖ్యతను తెలుపుతూ పిల్లలను బడికి పంపేలా తల్లిదండ్రులను ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. తమపిల్లల విద్యభ్యాసానికి ప్రతి ఒక్క తల్లిదండ్రులు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డిడబ్ల్యూఓ, సిపిడిఓ, సూపర్వైజర్, అంగన్వాడీ ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బుర్ర శ్రీకాంత్ గౌడ్



**మానకొండూర్, జూన్ 10,:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బుర్ర శ్రీకాంత్ గౌడ్ మంగళవారం అల్గునూరు ఉన్నతి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకల్లో పాల్గొని ఎమ్మెల్యే కవ్వంపల్లిని శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు.

# ఘనంగా వాసవి క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు





**తొర్రూరు, :** వాసవి క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షులు ఇరుకుల్ల రామకృష్ణ జన్మదిన వేడుకలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. వాసవి క్లబ్ వాసవి వనిత క్లబ్ వాసవి శివాజీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో ఆయుష్ ఆయుర్వేద వైద్యశాల వద్ద మొక్కలు నాటారు .అనంతరం పట్టణంలో అన్నారం రోడ్డుకు బీదలకు అన్నదాన వితరణ చేశారు .ఇందుకు సహకరించిన మదర్ వాలంటరీ ఆర్గనైజేషన్ వారికి సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ రీజియన్ సెక్రెటరీ చౌదారపు రాము, అధ్యక్షులు చిదురాల నవీన్ కుమార్, ప్రధాన కార్యదర్శి గోపారపు నిరంజన్ శివాజీ యూత్ క్లబ్ జోన్ చైర్మన్ సాయి తేజ, అధ్యక్షుడు సిహెచ్ నిఖిల్, క్లబ్ బాధ్యులు తమ్మి రమేష్ మదర్ వాలంటరీ ఆర్గనైజేషన్ ఫౌండర్ సిరికొండ విక్రమ్ కుమార్ అధ్యక్షులు సాయినాథ్ మొక్కలు నాటే కార్యక్రమంలో అవోపా జిల్లా బాధ్యులు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యులు డాక్టర్ పీ కిరణ్ కుమార్ , పాల్గొని మాట్లాడుతూ జన్మదిన సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అనీయం అన్నారు, పట్టణ ప్రముఖులు లైన్స్ క్లబ్ బాధ్యులు తుమ్మేటి వెంకట్ రెడ్డి, యోగ శిక్షకులు స్పందన సంఘ బాధ్యులు పాల్గొనగా సుమారు 200 మందికి అన్నదాన వితరణ చేశారు.

# ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

**- రొంపి కుంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేగోలపు సత్యనారాయణ గౌడ్**




**రామగిరి జూన్ 10:** కమాన్ పూర్ ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని రొంపి కుంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేగోలపు సత్యనారాయణ గౌడ్ అన్నారు. మంగళవారం కమాన్ పూర్ మండలంలోని రొంపికుంట పాఠశాల ఆవరణలో సోమవారం బడి బాట కార్యక్రమంలో భాగంగా గ్రామ సభ నిర్వహించారు. అనంతరం గ్రామంలో బడి ఈడూ పిల్లలను బడిలో చేర్పించాలని ర్యాలీ తో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు వేగోళం సత్యనారాయణ గౌడ్, హై స్కూల్ ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ఏం శ్రీనివాస్ రెడ్డి , గ్రామ పంచాయతీ కార్యదర్శి తిరుపతి ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాళ్లు, ఏ. ఎన్. ఎమ్, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# మంత్రి లక్ష్మణ్ కుమార్ యాత్రలో కార్యకర్తల అసమ్మతి

**- సీనియర్ కార్యకర్తలను నేటిస్తారా అంటూ ఆగ్రహం..**





**ఎండపల్లి,జూన్10:** మంత్రివర్గ విస్తరణలో భాగంగా ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ని మంత్రిగా పదోన్నతి రాగా రాజ్ భవన్ లో ప్రమాణం స్వీకారం చేసిన సంగతి విధితమే. కాగా నూతన మంత్రి మొదటిసారి ధర్మపురి నియోజకవర్గనికి విచ్చేయాగ భారీ ఎత్తున ర్యాలీకి తరలి వచ్చిన కార్యకర్తలలో జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాంపల్లి సమీపంలో లక్ష్మణ్ కుమార్ ని కలిసే క్రమంలో కార్యకర్తలకు మధ్య వాగ్వద్ధంతో గంధరగోళం నెలకొంది. రాజారాంపల్లి చేరుకున్న లక్ష్మణ్ కుమార్ ని కలిసే క్రమంలో ఒక్కసారిగా తోపులాట జరగగా ఒక్క వర్గన్ని సమర్థిస్తూ మంత్రి వద్దకు పంపిస్తున్నారని, ఇంకొక వర్గాన్ని చిన్న చూపు చూడటం ఏమిటని, ఆపద కాలంలో కండువా మోసిన కార్యకర్తలను నెట్టి వేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్ని సంవత్సరాల నుండి మీరంతా ఎక్కడ ఉన్నారని లక్ష్మణ్ కుమార్ గెలిపుకై అహర్నిశలు మేము పాటుపడ్డామని ఇప్పుడు గెలవగానే ముందు వరుసలో నిలబడటం ఏంటని ఆరోపించారు. నిజాయితీగా పార్టీలో సేవలందించిన కార్యకర్తలను ఇలా అవమానించడం సరైన పద్ధతి కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తాతంగమంతా మంత్రికి లక్ష్మణ్ కుమార్ పేజీలో సోషల్ మీడియా వేదికగా రావడం విశేషం.

# అమృత్ భారత్ స్కీమ్ - కాంట్రాక్టర్ల స్కామ్

- ఆధునీకరణ పేరుతో అస్తవ్యస్తంగా మారిన పెద్దపల్లి రైల్వే స్టేషన్
- నిలువ నీడ లేక అల్లాడుతున్న ప్రయాణికులు
- హడావిడిగా అధికారులు ప్రజాప్రతినిధులు పలుమార్లు సందర్శించిన అభివృద్ధి పనులలో పురోగతి శూన్యం
- పాత బిల్డింగ్ పడగొట్టడానికే సంవత్సరకాలం పట్టింది మరి నూతన బిల్డింగ్ నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో ?






**పెద్దపల్లి ప్రతినిధి :** అమృత్ భారత్ రైల్వేస్టేషన్ల ఆధునీకరణలో భాగంగా పెద్దపల్లి రైల్వే స్టేషన్ లో అభివృద్ధి పనులను దేశ ప్రధాని నరేంద్ర మోడీ మార్చ్యుల్ గా ప్రారంభించి సంవత్సరకాలం దాటుతున్న ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా అమృత్ భారత్ స్కీం కాస్త కాంట్రాక్టర్ల స్కామ్ అయింది. పెద్దపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు అటకెక్కాయి. అధికారుల నిర్లక్ష్యమో, కాంట్రాక్టర్ల అలసత్వమో ఆధునీకరణ పనుల పేరుతో పెద్దపల్లి రైల్వే స్టేషన్ అస్తవ్యస్తంగా మారింది. నిలువ నీడ లేక ప్రయాణికులు అల్లాడుతున్నారు. జిల్లా కేంద్రంలోని పెద్దపల్లి రైల్వే జంక్షన్ లో నిత్యం వేలాదిమంది ప్రయాణికులు రైళ్లలో రాకపోకలు సాగిస్తుంటారు రైల్వే స్టేషన్ లో త్రాగునీరు లేక పోగా మల మూత్ర విసర్జనల కోసం ప్రయాణికుల ఇబ్బందులు వర్ణాతీతంగా ఉన్న అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తోంది.

**కూల్చడానికే సంవత్సరకాలం - కట్టడానికి ఎన్ని సంవత్సరాలో....**

అమృత్ భారత్ అభివృద్ధి పనులలో పెద్దపల్లి రైల్వే స్టేషన్ పాత భవనాన్ని కూల్చడానికే సంవత్సర కాలం దాటిందని, మరి నూతన భవనాన్ని నిర్మించడానికి ఎన్ని సంవత్సరాల కాలం పడుతుందో అధికారులకు కాంట్రాక్టర్లకే తెలియాలని ప్రయాణికులు రైల్వే అధికారులపై మండిపడుతున్నారు. అమృత్ భారత్ రైల్వేస్టేషన్లో ఆధునీకరణ పనులలో అన్ని రైల్వే స్టేషన్లలో పనులు పురోగతిలో ఉండగా పెద్దపల్లిలో మాత్రం ఎందుకు ముందుకు సాగడం లేదని ఇక్కడ ప్రాతినిథ్యం వహిస్తున్న ప్రజా ప్రతినిధులు,రైల్వే శాఖ ఉన్నత అధికారులు కాంట్రాక్టర్లపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రయాణికులు విమర్శలు గుప్పిస్తున్నారు. అమృత్ భారత్లో ఎంపికైన. మంచిర్యాల, రామగుండం, కరీంనగర్ రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు చక చక పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధం కాగా మరి పెద్దపల్లి రైల్వే స్టేషన్ పనులు నిలిచిపోవడం పట్ల ప్రయాణికులు అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**కనీస సౌకర్యాలు కరువు - నిఘా నేత్రాలు లేవు**

పెద్దపల్లి రైల్వే స్టేషన్ లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలైన త్రాగునీరు, స్నానపు గదులు, మరుగుదొడ్లు కనుమరుగయ్యాయి. ముల్లె ముటా, పిల్లాపాపలతో సుదూర ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణికులకు భద్రత లేకుండా పోయింది.ప్రయాణికుల భద్రత నిమిత్తం పెద్దపల్లి రైల్వే జంక్షన్ అయినప్పటికీ కనీసం ఒక్క ఆర్పిఎఫ్, జి ఆర్ పి పోలీస్ కూడా విధులకు కేటాయించక పోవడం రైల్వే అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. పెద్దపల్లి రైల్వే స్టేషన్ లో ఇప్పటికే పలు దొంగతనాలు అఘాయిత్యాలు అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకుంటున్న కనీసం స్టేషన్ ఆవరణలో నిఘా నేత్రాలు లేకపోవడం. దురదృష్టకరమని ప్రయాణికులు అధికారులపై మండి పడుతున్నారు. రైల్వే బుకింగ్ కౌంటర్ లో పదే పదే “కృపయా జాందే మీరు నిఘా నేత్రాల నీడలో ఉన్నారు ప్రతిక్షణం ప్రయాణికుల కదలికలు గమనిస్తున్నాము” అంటూ అనౌన్స్మెంట్ రికార్డింగ్ తప్ప స్టేషన్ పరిసరాలలో ఎక్కడ నిఘా నేత్రాల జాడలేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

**అధికారుల హడావిడే తప్ప అభివృద్ధి పనులలో పురోగతి శూన్యం**

అమృత్ భారత్ పథకంలో పెద్దపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం అయినప్పటి నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు హడావిడిగా వస్తూ పోతున్నారే తప్ప అభివృద్ధి పనుల్లో మాత్రం పురోగతి లేదని స్థానిక నాయకులు ఆరోపిస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం, డిఆర్ఎమ్, ఏడిఆర్ఎం,రైల్వే శాఖ ఉన్నత అధికారులు పలుమార్లు పెద్దపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను పర్యవేక్షించిన పనులు ముందుకు సాగడం లేదని పెద్దపల్లి పార్లమెంటరీ సభ్యులు గడ్డం వంశీ కృష్ణ సైతం మొన్నటికి మొన్న రైల్వే స్టేషన్ సందర్శించి అభివృద్ధి సుందరీకరణ పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించిన తూతూ మంత్రంగా పనులను ప్రారంభించి మళ్లీ పూర్తిగా పనులను నిలిపివేశారు.దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ గతవారం పెద్దపల్లి రైల్వే స్టేషన్ సందర్శనలో భాగంగా పలు సంఘాల నాయకులు, స్థానికులు పెద్దపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల జాప్యంపై పలు వినతులు చేశారు. ఇప్పటికైనా స్థానిక ఎంపీ, ప్రజా ప్రతినిధులు, రైల్వే ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టర్ పై తగు చర్యలు తీసుకొని అమృత్ భారత్ అభివృద్ధి పనులను త్వరగాతిన పూర్తి చేసేలా చూడలని కోరుతున్నారు.

# సోనియా గాంధీ విగ్రహాలపై వివాదం..

- **రూ. 250 కోట్లు అవసరమా?”**
- **సామాజికవేత్త కాశెట్టి కుమార్**



**హుజూరాబాద్ జూన్ 10 :** తెలంగాణ రాష్ట్రంలో సోనియా గాంధీ విగ్రహాల ఏర్పాటు ప్రతిపాదనపై తీవ్ర దుమారం రేగుతోంది. సామాజికవేత్త కాశెట్టి కుమార్ ఈరోజు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో సోనియా? గాంధీ విగ్రహానికి రూ. 25 లక్షల చొప్పున మొత్తం రూ. 250 కోట్లు ఖర్చు చేసేందుకు ప్రైవేట్ టెండర్లు పిలిచే అవకాశం ఉందని వచ్చిన వార్తలపై అభ్యంతరం వ్యక్తం చేశారు.“ఒకవైపు జీతాలు లేవని, అప్పు పుట్టలేదని ప్రభుత్వం అంటున్నప్పుడు, రూ. 250 కోట్లు ఖర్చు చేసి సోనియా గాంధీ విగ్రహాలు పెట్టడం ఎంతవరకు సమంజసం?” అని కాశెట్టి కుమార్ ప్రశ్నించారు. మిస్ వరల్డ్ పోటీలకు కూడా భారీగా ఖర్చు చేశారని ఆయన ఆరోపించారు. “బతికున్నప్పుడు విగ్రహాలా?” సోనియా గాంధీ బతికి ఉండగానే విగ్రహాలు ఏర్పాటు చేయడంపై కాశెట్టి కుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. “బతికి ఉన్నప్పుడు విగ్రహాలు చేయడం సరైన పద్ధతి కాదు. కాంగ్రెస్ నాయకులే చాలామంది సోనియా గాంధీకి బతికున్నప్పుడు విగ్రహాలు చేయవద్దని నాకు ఫోన్ చేసి చెబుతున్నారు,” అని ఆయన తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని ఆలోచించాలని ఆయన కోరారు. అవసరం లేని ఖర్చు, ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టాలి. విగ్రహాల ఏర్పాటుకు బదులుగా ఆ నిధులను పేద పిల్లల స్కూళ్ల నిర్మాణానికి, అర్హులైన వారికి పెన్షన్లు ఇవ్వడానికి ఉపయోగించవచ్చని కాశెట్టి కుమార్ సూచించారు. “నిన్న విదేశాల నుంచి వచ్చిన అందగత్తెల పోటీలకు, వారికి బనాయించడం, చేతులు పిసుక్కోవడం వంటి రిమార్కులు వస్తున్నాయి. ఇవన్నీ చాలా చెడ్డ విషయాలు,” అని ఆయన తీవ్రంగా విమర్శించారు. సోనియా గాంధీ విగ్రహాలకు బదులుగా సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు, పొట్టి శ్రీరాములు, భగత్ సింగ్ వంటి స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని కాశెట్టి కుమార్ డిమాండ్ చేశారు. “వారు మన దేశానికి సేవ చేశారు. అటువంటి విగ్రహాలు పెట్టండి,” అని ఆయన రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

# ఆరోగ్య కేంద్రంలో 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలి



**రామగిరి జూన్ 10:**-కమాన్ పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 30 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆదివారాలలో స్వామి ఆలయ ప్రాంగణంలో మండల పార్టీ అధ్యక్షుడు కొయ్యడ సతీష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీజేపీ పార్టీ మండల స్థాయిల కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయం స్వంత భవనం ఏర్పాటు చేయాలని, మండల కేంద్రంలో సెంట్రల్లైటింగ్, మండల కేంద్రంలో నుండి పెంచికల్ పేట వరకు రోడ్డు నిధులు విడుదల చేయాలని, మండల కేంద్రంలోని హాస్పిటల్ షాపింగ్ కాంప్లెక్స్, అన్ని గ్రామాలలో వీధి దీపాలు, పారిశు ధ్యం నిర్వహించాలని, ఎంటిపిసి సిఎస్సార్ నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ వినియోగంలోకి తీసుకురావాలని, కమాన్ పూర్ నుండి ముల్కలపల్లి రోడ్డు మరమత్తులు చేపట్టాలని అలాగే రొంపికుంట నుండి నాగారం చెరువుకట్టపై రోడ్డు నిర్మించాలని కోరారు. అలాగే మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అన్ని రకాల మందులను అందుబాటులో ఉండేలా చూడాలని పలు తీర్మానాలు చేసారు సమస్యలను పరిష్కరించని యెడల ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కమాన్ పూర్ మండల బీజేపీ అధ్యక్షుడు కొయ్యడ సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మచ్చగిరి రాము, మట్ట శంకర్, మల్లారపుఅరుణ్, జంగపల్లి అజయ్, బర్ల సది, పంతకాని విశ్వతేజ, కొమ్ము శ్రీనివాస్, పిల్లి చంద్రయ్య, మొరప్రశాంత్, సాగంటి లక్ష్మణస్వామి, ఆసంశ్రీనివాస్, సుధాకర్, పడాల కనుకయ్య, జంగపల్లి శ్రీను, బండ రాజలింగు, సంతోష్తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# నేత్ర, శరీర,అవయవ దానాలకు ముందుకు రండి

**- ముందుకు వచ్చేలా చూడండి - నేత్ర, శరీర, అవయవ దానాలపై శిక్షణార్థులకు అవగాహన - ప్రపంచ నేత్రదాన దినోత్సవం సందర్భంగా యువతకు సదాశయ పిలుపు**

**రామగిరి, జూన్ 10:** మరణానంతరం కూడా మానవ శరీరాలు సమాజానికి ఎంతో ఉపయోగపడతాయని సదాశయ ఫౌండేషన్ జాతీయ సలహాదారు నూకా రమేష్, జాతీయ ప్రధాన కార్యదర్శి చోడవరపు లింగమూర్తి అన్నారు.మంగళ వారం జూన్ 10 ప్రపంచ నేత్రదాన దినోత్సవం పురస్కరించుకొని రామగుండం డివిజన్-త్రీ లోని మైన్స్ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్లో నేత్ర, శరీర, అవయవ దానాలపై శిక్షణార్థులకు అవగాహన కల్పించారు.మరణానంతరము నేత్రదానం వల్ల అంధులైన వారికి చూపు ప్రసాదించవచ్చని, అవయవ దానం వల్ల మరికొందరికి పునర్జన్మ ప్రసాదించవచ్చని, శరీర దానం వైద్య కళాశాల విద్యార్థుల విద్యాబోధనకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. మరణాంతరం శరీరాలను ఖననం చేసినా, దహనం చేసినా ప్రయోజనం ఉండదని కనుక వాటిని సమాజ ప్రయోజనాల కోసం వైద్య కళాశాలలకు ఉపయోగించాలన్నారు. మొదటగా ఇన్స్టిట్యూట్ మేనేజర్ నేత్రదానానికి ముందుకు వచ్చి డోనార్ కార్డ్ స్వీకరించారు అలాగే శిక్షణ పొందిన 30 మంది యువ ఉద్యోగులు సదాశయ ఆశయానికి సంసిద్ధత ప్రకటించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు వారికి డోనర్ కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సదాశయ కార్యవర్గ సభ్యులు వెల్ది అనంతరాములు, రాజమహేందర్ రెడ్డి, సమ్మయ్య సిబ్బంది పాల్గొన్నారు. నేత్ర అవయవ శరీర దానాలకు ముందుకు వచ్చిన యువకులను ఆర్.జి- త్రీ జిఎం కొలిపాక నాగేశ్వరరావు, ఎస్ ఓ టు-జిఎం బి.వి సత్యనారాయణ అభినందించారు. సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రవణ్ కుమార్, గౌరవాధ్యక్షులు సాన రామకృష్ణారెడ్డి, ప్రచార కార్యదర్శి వాసు, మాజీ జెడ్పిటిసి వెంకటరమణారెడ్డి అభినందించారు.



# వెల్ఫేర్ బోర్డు ద్వారానే ప్రమాద బీమా, సంక్షేమ పథకాలు ఇవ్వాలి

- ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రమాద భీమ మాత్రమే ఇస్తుంది
- సంక్షేమ పథకాలు రాక కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుంది.
- ఇదివరకు ఉన్న పద్ధతిలోనే ప్రమాద బీమా సంక్షేమ పథకాలు వర్తించాలి
- భవన నిర్మాణ కార్మిక సమైక్య సంఘం అధ్యక్షులు చిలువేరు స్వామి

**రామగిరి, జూన్ 10:** వెల్ఫేర్ బోర్డు ద్వారా లేబర్ కార్డు పొందిన భవన నిర్మాణ కార్మికులకు అందించే ప్రమాద బీమా సంక్షేమ పథకాలు ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వాలన్న నిర్ణయాన్ని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని భవన నిర్మాణ కార్మిక సమైక్య సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు చిలువేరు స్వామి అన్నారు. ఈ సందర్భంగా రామగిరి మండల కార్యాలయంలో వారు మాట్లాడుతూ... వెల్ఫేర్ బోర్డు ద్వారా లేబర్ కార్డు పొందిన కార్మికులకు ప్రమాద బీమా మరియు సంక్షేమ పథకాలు వర్తిస్తాయని అన్నారు. తెలంగాణ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా జూన్ 4 న ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలు దరఖాస్తు చేసుకోవడానికి ఆహ్వానించింది అన్నారు. ప్రమాద బీమా 8 లక్షలు,శాశ్వత వైకల్యం 5లక్షలు, పాక్షికవైకల్యం 4 లక్షలు, సాధారణ మరణం 2 లక్షలు, ఇవ్వాలని షెడ్యూల్లో పేర్కొన్నారని, అందులో మ్యారేజ్ గిఫ్ట్, మిటర్నిటీ బెనిఫిట్, హాస్పటిలైజేషన్ రిలీఫ్, ఇవ్వలేదన్నారు. దీనివలన కార్మికులకు సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందకపోవచ్చు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్సూరెన్స్ కంపెనీలు పెట్టే నిబంధనలు కార్మికులకు అర్థం కాక వారు అడిగే సర్టిఫికెట్స్ ఇవ్వలేక కార్మికులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం మరో మారు ఆలోచించి ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వాలన్న నిర్ణయాన్ని విరమించుకోవాలని, ఇదివరకు ఉన్న పద్ధతిలోనే కార్మికులకు ప్రమాద బీమా మరియు సంక్షేమ పథకాలు అందివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు తిరునహరి రాజు, ఎస్కే షరీఫ్, బైరి శంకర్, మల్లేష్, శంకర్, రాజయ్య, రమేష్, చంద్రమౌళి, పాల్గొన్నారు.



# ధర్మపురి నరసింహ స్వామి ఆలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక పూజలు

- పూర్ణకుంభంతో స్వాగతం పలికిన అర్చకులు







**ధర్మపురి, జూన్ 10, :** మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం సాయంత్రం ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత మొదటిసారిగా ఆలయానికి వచ్చిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దయ, నియోజకవర్గ ప్రజల ఆశీస్సుల వల్ల తనకు మంత్రి పదవి లభించిందన్నారు. ఈ పదవి ద్వారా పేదల సంక్షేమానికి ప్రత్యేకంగా కృషి చేస్తానని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయబోనని ఆయన పేర్కొన్నారు.

## కష్టపడేవారికి పార్టీలో గుర్తింపు ఉంటుంది

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దుద్దిళ్ల శ్రీనుబాబు నియామకం
- రామగిరి మండల పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు
- మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్





**రామగిరి, జూన్ 10:-** పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారికి కాంగ్రెస్ పార్టీలో ఎప్పటికీ గుర్తింపు ఉంటుందని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్ వ్యాఖ్యానించారు. అందుకు ఉదాహరణ మన ప్రియతమ నాయకుడు, రాష్ట్ర యువజన నాయకుడు దుద్దిళ్ల శ్రీను బాబు అని గుర్తుచేశారు. మంగళవారం టిపిసిసి ప్రధాన కార్యదర్శిగా దుద్దిళ్ల శ్రీను బాబు ని నియమించినందుకు రామగిరి మండల అధ్యక్షుడు రోడ్డ బాపన్న ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు సెంటినరీ కాలని శ్రీపాద భవన్ వద్ద బాణసంచా పేల్చి భారీ ఎత్తున సంబరాలు చేశారు. అనంతరం మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా దుద్దిళ్ల శ్రీనివాస్(శ్రీ నుబాబు) నియామకం కష్టపడిన కాంగ్రెస్ కార్యకర్తకు లభించిన అరుదైన గౌరవం అని తెలిపారు. కాంగ్రెస్ లో ఆయన కొన్నేళ్లుగా క్రియాశీ లంగా పనిచేస్తున్నారనీ,ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు సోదరుడు శ్రీనుబాబు అన్నకు వెన్నంటి ఉంటూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలతో పాటు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనీ గెలుపుకు కృషి చేశారని పేర్కొన్నారు. యూత్ నేతగా మంచి పేరు తెచ్చుకొని,నిత్యం వందలాది వివాహాలు, పరామర్శలతో పాటు అనేక సేవా కార్యక్రమాల్లో శ్రీను బాబు ఉత్సహంగా పాల్గొంటు ఎల్లప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటునురనీ తెలిపారు. అన్నకు తగ్గ తమ్ముడిగా మంచి పేరు సంపాదించుకునీ, మంథనితో పాటు ఇతర నియోజక వర్గాల్లో సైతం అనేక కార్యక్రమాల్లో పాల్గొం టూ యువతలో ఉత్సాహం నింపుతున్న నాయకుడికి కాంగ్రెస్ పార్టీ లో సముచిత స్థానం లభించిందని అన్నారు. భవిష్యత్తులో మరెన్నో పదవులు పొందుతూ ఉన్నత స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు...

## రోస్టర్ రికార్డులను పరిశీలించిన ఎస్.సి. ఉద్యోగుల చీఫ్ లైజన్ ఆఫీసర్

- కమిటీ సభ్యులు రోస్టర్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం




**రామగిరి, జూన్ 10:-** సింగరేణి అన్ని ఏరియాల వ్యాప్తంగా చేస్తున్న రోస్టర్ రికార్డుల పరిశీలనలో భాగంగా మంగళవారం జి.యం. కార్యాలయానికి విచ్చేసిన షెడ్యూల్డ్ కులాల చీఫ్ లైజన్ ఆఫీసర్ దుర్గం రాంచందర్, కమిటీ సభ్యులు ఇ.రాజేశ్వర్, యం.వెంకటేశ్వరరావు, ఎ.నాగేశ్వరరావు, కె.తిరుపతి, గడిపల్లి మహేష్ లకు రామగుండం-త్రీ, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, ఇతర అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఏరియాలోని వివిధ గనులు, విభాగాలలో ఉన్నటువంటి ఎన్.సి.డబ్ల్యు.ఏ. పోస్టుల ఖాళీలకు అనుగుణంగా షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ ప్రకారం రోస్టర్ విధానంలో చేపట్టిన నియామకాలు, పదోన్నతుల వివరాలను పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం కమిటీకి అందజేశారు. చీఫ్ లైజన్ ఆఫీసర్ దుర్గం రాంచందర్, కమిటీ సభ్యులు రోస్టర్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులకనుగుణంగా ఏరియాలో అమలు చేస్తున్న రూల్ ఆఫ్ రిజర్వేషన్ పద్దతిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సివిల్ విభాగం ద్వారా నిర్వహిస్తున్న వివిధ కాంట్రాక్టులలో ఎస్.సి. రిజర్వేషన్ అమలును పరిశీలించారు. రికార్డుల నిర్వహణలో పలు సలహాలు, సూచనలు అందించారు. షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ నిష్పత్తి ప్రకారం వివిధ గనులు, విభాగాలలో ఉన్న ఖాళీలు నింపడానికి సరిపడా ఉద్యోగులు లేనందున, షెడ్యూల్డ్ కులాలకు చెందిన అభ్యర్థులకు ఏరియాలో ఉన్న బ్యాక్ లాగ్ ఖాళీల వివరాలు, అర్హత ప్రమాణాలపై అవగాహన కల్పించాలని ఏరియా లైజన్ ఆఫీసర్, సింగరేణి షెడ్యూల్డ్ కులాల ఉద్యోగుల సంఘం ప్రతినిధులను కోరారు. ఈ సందర్భంగా చీఫ్ లైజన్ ఆఫీసర్ దుర్గం రాంచందర్ మాట్లాడుతూ ప్రస్తుత బహిరంగ మార్కెట్లో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా సింగరేణి సంస్థలో బొగ్గు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం ఉందని, నాణ్యతతో కూడిన బొగ్గును ఉత్పత్తి చేయాలని, ఉద్యోగులందరూ క్రమం తప్పకుండా విధులకు హాజరు కావాలని, సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం బాధ్యతతో కూడిన విధులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటుజియంలు యం.రామ్మోహన్, బి.వి.సత్యనారాయణ, విభాగాధిపతులు కె.చంద్రశేఖర్, బి.రాజేంద్ర కుమార్, ఏరియా ఎస్.సి.ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు బత్తుల శంకర్, బాలాంకుస్, ఇ.శ్రీనివాస్, ఐ.ఉదయ్ కుమార్, బొచ్చు శంకర్, జి.రమేశ్, కె.రాజేష్ కుమార్, బి.భాస్కరరాజు, ఎం.శంకర్ దయాల్ శర్మ, బి.శ్రీనివాస్, అధికారులు గుర్రం శ్రీహరి, మతీన్ హుస్సేన్, పి.రాజేశం, ఆఫీస్ సూపరింటెండెంట్ టి.వి.సురేష్ బాబు, శ్రావణి చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్.జి-త్రీ ఏరియాలో పర్యటించిన రీజినల్ సేఫ్టీ జి.యం



**రామగిరి, జూన్ 10:-** రామగుండం రీజియన్ సేఫ్టీ జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ మంగళవారం రామగుండం-త్రీ ఏరియాలో పర్యటించారు. రామగుండం రీజియన్ సేఫ్టీ జనరల్ మేనేజర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటిసారిగా రామగుండం-త్రీ ఏరియాలో పర్యటించిన సందర్భంగా జి.యం. కార్యాలయంనందు రామగుండం-త్రీ, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు వారిని సన్మానించి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం వారు ఓసిపి-టు ఉపరితల గనిలో భద్రతా పరంగా తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఎస్వోటుజియంలు యం.రామ్మోహన్, బి.వి.సత్యనారాయణ, ప్రాజెక్ట్ ఇంజినీర్ చంద్రశేఖర్, మేనేజర్ కె.వి.రామారావు, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ షబ్బీరుద్దీన్, అధికారులు టి.నాగేశ్వరరావు, కోల శ్రీనివాస్, గుర్రం శ్రీహరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కవ్వంపల్లి యువసేనను అభినందించిన డాక్టర్ అనూరాధ



**మానకొండూర్,:** మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన సందర్భంగా మంగళవారం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అల్గునూరులోని ఉన్నతి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వేడుకల్లో మానకొండూర్ మండల కవ్వంపల్లి యువసేన అద్యక్షుడు కనకం రాకేష్ ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వేడుకల్లో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నిర్వహించిన రక్తదాన శిబిరంలో కవ్వంపల్లి యువసేన సభ్యులు రక్తదానం చేయగా కవ్వంపల్లిపై ఉన్న అభిమానానికి ఎమ్మెల్యే సతీమణి వైద్యురాలు అనూరాధ సంతోషం వ్యక్తం చేస్తూ యువసేన సభ్యులను అభినందించారు.

## పారిశుధ్య కార్మికులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం



**గుండాల జూన్10:** కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు మంగళవారం రోజున గుండాల ఎంపీపీ ఎస్ లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కోర్సు డైరెక్టర్ మండల విద్యాధికారి మన్నే అగ్గి రాములు మాట్లాడుతూ. పాఠశాల లోని తరగతి గదులను. మరుగు దొడ్లు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని పాఠశాల శుభ్రం గా ఉంటేనే పిల్లలు ఆరోగ్యం గా ఉంటారు అన్నారు. ఈ కార్యక్రమం లో ఆర్పీగా జి అమరేందర్ . వివిధ పాఠశాలకు సంబందించిన పారిశుధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## లిటిల్ పెబ్బల్ స్కూల్ ప్రభుత్వ అనుమతి లేదు

- రామగిరి మండల విద్యాధికారి కొమురయ్య

**రామగిరి, జూన్ 10:-** తల్లిదండ్రులు తమ పిల్లలను అనుమతి ఉన్న పాఠశాలలకు పంపించాలని అనుమతి లేని పాఠశాలలకు పంపించి ఇబ్బందులు పడవద్దని లిటిల్ పెబ్బల్ స్కూల్ ప్రభుత్వం నుండి ఎటువంటి అనుమతులు లేవని కాబట్టి ఈ పాఠశాలలో అడ్మిషన్లు తీసుకోవద్దని రామగిరి మండల విద్యాధికారి కొమురయ్య అన్నారు.రామగిరి మండలములొని కల్వచర్ల, సెంటినరీ కాలనీ లో గల లిటిల్ పెబ్బేల్ స్కూల్ కు ప్రభుత్వం అనుమతి లేదనీ ఒక ప్రకటనలో మండల విద్యాధికారి కొమురయ్య తెలిపినారు. కావున కల్వచర్ల, సెంటినరీ కాలనీ ప్రజలు ఆపాఠశాల లో విద్యార్థులను జాయిన్ చేయకూడదు అని అన్నారు. ప్రభుత్వం అనుమతి లేకుండా నడుపుతున్న ఆ పాఠశాల లో విద్యార్థులను జాయిన్ చేసుకున్నట్లతే పాఠశాల పైచట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఒక ప్రకటనలో రామగిరి మండల విద్యాధికారి కొమురయ్య తెలిపినారు.అన్ని ప్రభుత్వ అనుమతులు పొందిన తర్వాతనే తన కార్యకలాపాలు కొనసాగించాలని అక్కడ ఉన్నటువంటి పాఠశాల సిబ్బందికి ఆయన తెలియజేశారు. రామగిరి మండలములోని ఏ పాఠశాల అయినా నిబంధనలు ప్రకారం నడవాలినీ ప్రైవేట్ పబ్లిషార్సు, బుక్స్ లు ఏ పాఠశాలలో అమ్మ కూడదనీ రాష్ట్ర ప్రభుత్వం చే ముద్రితమైన పుస్తకాలు వాడాలి తెలిపారు.

## పుడమిపుత్ర అవార్డు అందుకున్న "సాన"



**రామగిరి జూన్ 10:-** కమాన్ పూర్ మండలం జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఆదర్శనగర్ చెందిన ప్రముఖ రైతు సాన రామకృష్ణారెడ్డి పుడమిపుత్ర అవార్డును హైదరాబాదులోని రవీంద్రభారతిలో మంగళవారం అందుకున్నారు.రైతు, జంతు ప్రేమికుడు, సానా రామకృష్ణారెడ్డికి హైదరాబాదులోని రవీంద్ర కాన్ఫరెన్స్ భారతి హాల్లో పుడమి పుత్ర అవార్డును వసుంధర విజ్ఞాన వికాస మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు మధు ధర్మారెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు. కమాన్ పూర్ మండలం జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఆదర్శనగర్ కు చెందిన పుడమిపుత్ర అవార్డుకు జూరీ కమిటీ ఎంపిక చేశారు. వసుంధర విజ్ఞాన వికాస మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు మధు ధర్మారెడ్డి ఆధ్వర్యంలో అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏనుగు నరసింహారెడ్డి ,దేవీ లక్ష్మీనరసయ్య, కట్కు రే శంకర్, కే చంద్రశేఖర్ రెడ్డి, జబ్బార్ ఖాన్, నల్లవెల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్

# అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన నికోలస్ పూరన్

వెస్టిండీస్ విధ్వంసకర బ్యాటర్ నికోలస్ పూరన్ అంతర్జాతీయ క్రికెట్?కు వీడ్కోలు పలికాడు. కేవలం 29 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించి అందరినీ షాక్?కు గురిచేశాడు. ఇది ఎంతో కఠినమైన నిర్ణయమని తన ఇన్‌స్టా ఖాతాలో పేర్కొన్నాడు. తనపై ఎంతో ప్రేమను చూపించిన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపాడు. విండీస్? టీమ్?లో నికోలస్ పూరన్?ను ముద్దుగా నిక్కీ పీ అని పిలుస్తుంటారు. విండీస్ తరఫున నికోలస్ పూరన్? 61- వన్డేలు, 106- టీ20లు ఆడాడు. అంతేకాదు టీ20లో విండీస్? జట్టుకు కెప్టెన్?గానూ వ్యవహరించాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో లఖ్‌నవూ తరఫున ఆడి భారీ ఇన్నింగ్స్‌లతో క్రికెట్ అభిమానులను ఆకట్టుకున్నాడు. మొత్తంగా చూసుకుంటే, నికోలస్ పూరన్ వన్డేల్లో 1,983 పరుగులు, టీ20ల్లో 2,275 పరుగులు చేశాడు.క్రికెట్ వెస్టిండీస్? నికోలస్ పూరన్?ను 'గేమ్-ఛేంజర్?' అని ప్రశంసించింది. క్రికెట్?కు, వెస్టిండీస్? జట్టుకు కోసం చేసిన అత్యుత్తమ కృషికి కృతజ్ఞతలు తెలిపింది. 'డియర్ ఫ్యాన్స్.. చాలా ఆలోచనలు, పరిశీలనల తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నాను. ఈ ఆట నాకెంతో ఇచ్చింది. ఇంకా ఇస్తూనే ఉంటుంది. ఈ ప్రయాణంలో ఎంతో ఆనందం, ఎన్నో మరుపురాని జ్ఞాపకాలు ఉన్నాయి. వెస్టిండీస్‌కు ప్రాతినిధ్యం వహించడాన్ని గర్వంగా భావిస్తున్నా. మెరూన్ జెర్సీని ధరించడం, మైదానంలో నిలబడి జాతీయ గీతం ఆలపించడం.. జట్టు కోసం సాయశక్తులా కృషి చేయడం.. ఇవన్నీ నాకు ఎంత ముఖ్యమో మాటల్లో చెప్పలేను. వెస్టిండీస్ జట్టుకు సారథ్యం వహించడం ఎప్పటికీ మరిచిపోలేను. అత్యంత అరుదైన గౌరవంగా భావిస్తాను. నాపై



ప్రేమను చూపించిన అభిమానులకు కృతజ్ఞతలు. కష్ట సమయాల్లో అండగా నిలిచారు. నా సక్సెస్‌ను సెలెబ్రేట్ చేసుకున్నారు.నా కుటుంబం, స్నేహితులు, నా సతీమణితో పాటు నా ఈ ప్రయాణంలో నాతో నడిచిన మీకు ధన్యవాదాలు. మీ మద్దతు, నమ్మకం నన్ను నిలబెట్టాయి. నా కెరీర్‌లో అంతర్జాతీయ అధ్యాయం ముగిసినప్పటికీ.. వెస్టిండీస్ క్రికెట్‌పై నాకున్న ప్రేమ ఎప్పటికీ చెక్కు చెదరదు. వెస్టిండీస్ జట్టు మరింత బలంగా మారడంతో పాటు అద్భుతమై విజయాలు అందుకోవాలని కోరుకుంటా.'అని నికోలస్ పూరన్ తన పోస్ట్‌లో పేర్కొన్నాడు. నికోలస్ పూరన్ ఫ్రాంచైజీ క్రికెట్‌లో మాత్రమే ఆడనున్నాడు. 2016లో పాకిస్థాన్‌తో దుబాయ్ వేదికగా జరిగిన టీ20 మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన నికోలస్ పూరన్ 106 మ్యాచ్‌లు ఆడి 2275 పరుగులు చేశాడు. ఇందులో 13 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 2019లో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌తో అంతర్జాతీయ వన్డేల్లోకి అడుగుపెట్టిన నికోలస్ పూరన్.. 61 మ్యాచ్‌ల్లో 1983 పరుగులు చేశాడు. ఇందులో మూడు సెంచరీలతో పాటు 11 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. టెస్ట్ క్రికెట్ ఆడకుండానే నికోలస్ పూరన్ 9 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్ ముగిసింది. 2019 వన్డే ప్రపంచ కప్‌లో నికోలస్ పూరన్ అసాధారణ ప్రదర్శన కనబర్చాడు. 9 మ్యాచ్‌ల్లో 367 పరుగులు చేసి విండీస్ తరఫున టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ టోర్నీలో శ్రీలంకపై తొలి సెంచరీ సాధించిన పూరన్.. నెదర్లాండ్స్, నేపాల్‌పై మరో రెండు శతకాలు నమోదు చేశాడు. ఈ టోర్నీలో పూరన్ కనబర్చిన అత్యుత్తమ ప్రదర్శనకు ఐసీసీ రైజింగ్ స్టార్ అని పేర్కొంటూ అభినందించింది. టీ20ల్లో వెస్టిండీస్ తరఫున అత్యధిక పరుగులు (2275) సాధించిన ఆటగాడి పూరన్ నిలిచాడు. ఈ క్రమంలో అతను క్రిస్ గేల్ రికార్డును అధిగమించాడు. భారీ సిక్స్‌లు బాదడం.. తన విధ్వంసకర బ్యాటింగ్‌తో క్షణాల్లో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేయడం పూరన్ నైజం. 2024 టీ20 ప్రపంచ కప్ 2024లో పూరన్ 113 మీటర్ల భారీ సిక్సర్ కొట్టాడు. నిక్కీపీ అని ముద్దుగా పిలుచుకునే పూరన్.. టీ20ల్లో వెస్టిండీస్‌కు సారథ్యం కూడా వహించాడు. జట్టులో కీలక ఆటగాడిగా మారాడు. వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ జరగనుండగా.. పూరన్ రిటైర్మెంట్ ప్రకటించడం అభిమానులను షాక్‌కు గురి చేసింది.

## ఆర్సీబీకి కర్ణాటక హైకోర్టులో దక్కని ఊరట

బెంగళూరు చిన్నస్వామి తొక్కిసలాట కేసులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కి కర్ణాటక హైకోర్టులో ఊరట దక్కలేదు. ఈ కేసులో అరెస్ట్ అయిన ఆర్సీబీ మేనేజర్‌కు బెయిల్ ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది. హైకోర్టు తన తీర్పును బుధవారం (జూన్ 11వ తేదీకి) రిజర్వ్ చేసింది. చిన్నస్వామి తొక్కిసలాట ఘటనపై తదుపరి విచారణ జూన్ 12న జరగనుంది. కర్ణాటక హైకోర్టు మంగళవారం నాడు (జూన్ 10న) మార్కెటింగ్ అండ్ రెవెన్యూ హెడ్ నిఖిల్ సోస్లేకు మధ్యంతర బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది. జూన్ 11 వరకు రిజర్వ్ చేయాలని కోర్టు సూచించింది. జూన్ 6న పోలీసులు సోస్లేను అరెస్టు చేశారని తెలిసిందేఆర్సీబీ మార్కెటింగ్ అండ్ రెవెన్యూ హెడ్ నిఖిల్ సోస్లే తనను అరెస్ట్ చేయడంపై హైకోర్టును ఆశ్రయించారు. కానీ ఆర్సీబీ మేనేజర్ సోస్లేకు కోర్టులో ఊరట దక్కలేదు. ఇప్పుడు ఈ కేసులో తదుపరి విచారణ జూన్ 12న జరగనుంది. సోస్లే తన అరెస్టు చట్టవిరుద్ధమని మధ్యంతర బెయిల్ పిటిషన్‌లో పేర్కొన్నారు. రాజకీయ ఆదేశాల ద్వారా పోలీసులు ప్రభావితమై అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం కర్ణాటక హైకోర్టు సోస్లేకు బెయిల్ నిరాకరించింది.%=జదీ% ఐపీఎల్ 2025 టైటిల్‌ను గెలిచింది. ఐపీఎల్ చరిత్రలో అది వారికి తొలి ఐపీఎల్ ట్రోఫీ. మరుసటి రోజు (జూన్ 4న) విన్నింగ్ సెలబ్రేషన్ చేయాలని ఆర్సీబీ నిర్ణయం తీసుకుంది. దాంతో ట్రోఫీని చూడటానికి, ఆర్సీబీ జట్టు విక్టరీ వేడుకలో భాగం కావాలనుకున్నారు. చిన్నస్వామి స్టేడియం వద్దకు ఫ్యాన్స్ పెద్ద ఎత్తున రావడంతో పోలీసులు వారిని అదుపు చేయడానికి లాఠీఛార్జ్ చేశారు. ఈ క్రమంలో స్టేడియం వ్ద తొక్కిసలాట జరగడంతో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ తొక్కిసలాట ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలలో భాగంగా పలువురు పోలీసు అధికారులను సస్పెండ్ చేసింది. తొక్కిసలాటలో మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షలు ఇస్తామని కర్ణాటక ప్రభుత్వం ప్రకటించింది. అయితే నష్టపరిహారం పెంచారు. రాష్ట్ర ప్రభుత్వం మరణించిన వారికి రూ.25 లక్షలు నష్టపరిహారంగా అందజేస్తుంది. ఫ్రాంచైజీ %=జదీ% కూడా మరణించిన వారికి రూ.10 లక్షలు ఇవ్వాలని ప్రకటించింది.



## నలుగురు ఆటగాళ్లను వదిలేసిన లక్నో

ఐపీఎల్ 2025 సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ తీవ్రంగా నిరాశపరిచింది. పేలవ ఆటతీరుతో ప్లే ఆఫ్స్ చేరకుండానే ఇంటిదారి పట్టింది. 14 మ్యాచ్‌ల్లో 6 విజయాలు మాత్రమే నమోదు చేసి ఏడో స్థానంతో సరిపెట్టుకుంది. రూ. 27 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసిన కెప్టెన్సీ



బాధ్యతలు ఇచ్చిన రిషభ్ పంత్ దారుణంగా విఫలమయ్యాడు. అతనితో పాటు ఇతర ఆటగాళ్ల వైఫల్యం లక్నో విజయవకాశాలను దెబ్బతీసింది. ఈ క్రమంలోనే జట్టు బలహీనతలపు అధిగమించడంపై లక్నో సూపర్ జెయింట్స్ ఫోకస్ పెట్టింది. ఐపీఎల్ 2026 మినీ వేలానికి ముందు జట్టుకు భారంగా మారిన ఓ ఐదుగురు ఆటగాళ్లను వదిలేసే అవకాశం ఉంది.లక్నో సూపర్ జెయింట్స్ తమ కెప్టెన్ రిషభ్ పంత్‌నే వేలంలోకి వదిలేసే అవకాశం ఉంది. ఐపీఎల్ 2025 మెగా వేలంలో రిషభ్ పంత్‌ను రూ. 27 కోట్ల ఆల్‌టైమ్ రికార్డ్ ధరకు కొనుగోలు చేసిన లక్నో సూపర్ జెయింట్స్.. అతనికి సారథ్య బాధ్యతలు కూడా అప్పగించింది. కానీ అతను మాత్రం 14 మ్యాచ్‌ల్లో 24.45 సగటు 133.17 స్ట్రైక్‌రేట్‌తో 269 పరుగులు చేసింది. ఇందులో ఓ సెంచరీతో పాటు హాఫ్ సెంచరీ ఉంది. తమ ఆఖరి మ్యాచ్‌లో పంత్ శతకంతో చెలరేగాడు. కానీ ఈ మ్యాచ్‌లోనూ ఆ జట్టుకు ఓటమి తప్పలేదు. మరోవైపు కెప్టెన్‌గా కూడా రిషభ్ పంత్ విఫలమయ్యాడు. భారీ ధర నేపథ్యంలో అతన్ని వేలంలోకి వదిలేసి తక్కువ ధరకు మళ్లీ తీసుకునే ప్రయత్నం కూడా చేయవచ్చు.ప్రతిభావంతమైన పేసర్ అని, అత్యంత వేగంతో బౌలింగ్ చేయగలిగే సామర్థ్యం ఉందని మాయంక్ యాదవ్‌కు లక్నో సూపర్ జెయింట్స్ గత మూడు సీజన్లుగా అండగా నిలుస్తోంది. అతను మాత్రం జట్టుకు భారంగానే మారాడు. తరుచూ గాయాల బారిన పడుతూ జట్టుకు దూరమవుతున్నాడు. ఎక్స్‌ట్రా పేస్‌ను రాబట్టే విషయంలో ఎక్స్‌ట్రా ఎఫర్ట్ పెడుతూ గాయాల బారిన పడుతున్నాడు. ఐపీఎల్ 2025 మెగా వేలంలో రూ. 11 కోట్ల భారీ ధరకు రిటైన్ చేసుకోగా.. అతను రెండు మ్యాచ్‌లు ఆడి రెండు వికెట్లు మాత్రమే తీసి గాయంతో జట్టుకు దూరమయ్యాడు. తరుచూ గాయాల బారిన పడుతున్న మయాంక్ యాదవ్‌కు వచ్చే సీజన్ ముంగిట లక్నో గుడ్‌బై చెప్పే అవకాశం ఉంది.ఐపీఎల్ 2025 మెగా వేలంలో రూ.7.50 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసిన డేవిడ్ మిల్లర్ సైతం తీవ్రంగా నిరాశపరిచాడు. 11 మ్యాచ్‌లు ఆడిన అతను 30.60 సగటుతో 153 పరుగులే చేశాడు.అతని అత్యధిక స్కోర్ 27 పరుగులు మాత్రమే. విధ్వంసకర ఫినిషర్‌గా గుర్తింపు పొందిన మిల్లర్.. ఈ సీజన్‌లో తన బాధ్యతను నిర్వర్తించలేకపోయాడు. ఈ క్రమంలోనే అతన్ని వదిలేసి మరో ఆటగాడిని లక్నో తీసుకోవచ్చు.మాయంక్ యాదవ్ తరహాలోనే తరుచూ గాయల బారిన పడి జట్టుకు దూరమవుతున్న మోహ్‌సిన్ ఖాన్‌ను కూడా లక్నో వదిలేసే అవకాశం ఉంది. రూ. 4 కోట్లకు మోహ్‌సిన్ ఖాన్‌ను తీసుకోగా.. అతను సీజన్ ఆరంభానికి ముందే గాయంతో జట్టుకు దూరమయ్యాడు. దాంతో అతని స్థానంలో శార్దూల్ ఠాకూర్‌ను జట్టులోకి తీసుకున్నారు. గాయాల బెడద నేపథ్యంలో మోహ్‌సిన్ ఖాన్‌కు కూడా లక్నో ఉద్వాసన పలికే ఛాన్స్ ఉంది.



## బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్..

### 18 మంది సభ్యులతో భారత జట్టు

టీం ఇండియా ఇంగ్లాండ్ పర్యటనలో ఉంది. అక్కడ బంగ్లాదేశ్‌తో టెస్ట్ సిరీస్ ఆడనుంది. ఆ తర్వాత, భారత జట్టు వైట్ బాల్ క్రికెట్‌లోకి తిరిగి వస్తుంది. ఆగస్టులో, నీలిరంగు జెర్సీలో ఉన్న జట్టు బంగ్లాదేశ్‌తో పరిమిత ఓవర్ల క్రికెట్ సిరీస్ కోసం పొరుగు దేశంలో పర్యటిస్తుంది. ఈ సమయంలో, భారత్ వర్సెస్ బంగ్లాదేశ్ మధ్య 3 వన్డేలతోపాటు టీ20 మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. టీ20 సిరీస్‌లో ఎవరికి అవకాశం లభిస్తుందో అందరూ గమనిస్తూ ఉన్నారు.అందువల్ల బంగ్లాదేశ్‌తో జరిగే టీ20 సిరీస్ ముఖ్యమైనది. ఆ తర్వాత, భారత జట్టు ఆసియా కప్ ఆడాల్సి ఉంది. ఇది సెప్టెంబర్‌లో జరగనుంది. ఇటువంటి పరిస్థితిలో, ఆసియా కప్‌నకు సన్నాహాలను పరిగణనలోకి తీసుకుంటే, జస్ప్రీత్ బుమ్రా కూడా బంగ్లాదేశ్‌తో జరిగే మ్యాచ్‌లో చోటు దక్కించుకోవచ్చు. బుమ్రాకు తరచుగా అగ్రశ్రేణి జట్లతో జరిగే మ్యాచ్‌లకు విశ్రాంతి ఇస్తారని తెలిసింది. కానీ, ఆసియా ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుంటే, అతనిని ఖచ్చితంగా పరిశీలిస్తారు. అయితే, ఆసియా కప్ నిర్వహణ ఇంకా సందిగ్ధంలో ఉంది. కానీ, టోర్నమెంట్ జరిగితే బుమ్రా ఆడగలడు. జస్ప్రీత్ బుమ్రాతో పాటు, హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్ యాదవ్ కూడా స్థానం దక్కించుకుంటారు. ఎందుకంటే వారిద్దరూ సీనియర్ ఆటగాళ్ళు. వీరితో పాటు, తిలక్ వర్మ కూడా చోటు దక్కించుకుంటాడు . దీంతో పాటు, యువ ఫాస్ట్ బౌలర్ అశ్విని కుమార్‌కు అవకాశం లభిస్తుంది. తరచుగా ఐపీఎల్‌లో బాగా రాణిస్తున్న ఆటగాళ్లకు మాత్రమే అవకాశం లభిస్తుందనే విషయం తెలిసిందే. ఈ కారణంగా, అశ్విని కూడా చోటు సంపాదించుకోవచ్చు. అతనితో పాటు, కరణ్ శర్మ కూడా అవకాశం పొందవచ్చు. ఐపీఎల్‌లో ఆడే ముంబై ఇండియన్స్ జట్టులో మొత్తం ఆరుగురు ఆటగాళ్ళు వీరే. మిగిలిన ఆటగాళ్ల గురించి చెప్పాలంటే, బంగ్లాదేశ్‌తో జరిగే టీ20 సిరీస్ లో కేఎల్ రాహుల్ కూడా తిరిగి జట్టులోకి రావచ్చు. 2025ఐపీఎల్‌లో అద్భుతమైన ప్రదర్శన తర్వాత అతను తిరిగి వస్తాడని మీడియా నివేదికలు పేర్కొన్నాయి. ఈ సీజన్‌లో అతను బ్యాటింగ్‌తో మంచి ఫామ్‌ను ప్రదర్శించాడు. అతను చివరిసారిగా 2022లో ఆడటం కనిపించింది. టీం ఇండియా ప్రాబబుల్ స్క్వాడ్.. అభిషేక్ శర్మ, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), సంజూ శాంసన్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), రింకూ సింగ్, హార్దిక్ పాండ్యా, నితీష్ కుమార్ రెడ్డి, శివమ్ దూబే, అక్షర్ పటేల్, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, అవేష్ ఖాన్, రవి, సింఘ్‌దీప్, అశ్వినీ కుమార్, అశ్వినీ కుమార్.

## అశ్విన్‌కు భారీ ఫైన్


చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్?కు షాక్ తగిలింది. అంపైర్?పై కోపం ప్రదర్శించినందుకు అతడికి మ్యాచ్ రిఫరీ భారీ జరిమానా విధించారు. ఏంటీ ఐపీఎల్ టోర్నీ ముగిసింది కదా, మరి ఫైన్ ఎలా పడింది అనుకుంటున్నారా? మరి ఇది ఏ మ్యాచ్?లో జరిగిందంటే??అశ్విన్ ప్రస్తుతం 2025 తమిళనాడు ప్రీమియర్ లీగ్ టోర్నీలో ఆధుతున్నాడు. ఇందులో అశ్విన్ దుండిగల్ డ్రాగన్స్? జట్టుకు కెప్టెన్?గా వ్యవహరిస్తున్నారు. టోర్నీలో భాగంగా సోమవారం దుండిగల్ డ్రాగన్స్ - ఐడ్రీమ్ తిరుప్పూర్ తమిజాన్స్ మధ్య మ్యాచ్ జరిగింది. మ్యాచ్?లో సాయి కిషోర్ బంతిని స్వీప్ ఆడబోయిన అశ్విన్?ను అంపైర్ ఎల్?బీడబ్ల్యూగా ఔటిచ్చాడు. 5వ ఓవర్లో ఐదో బంతిని అశ్విన్ ప్యాడల్ స్వీప్ ఆడగా, బాల్ ప్యాడ్లను తాకింది. అశ్విన్ సింగిల్ కోసం పరుగెత్తగా, బౌలర్ అప్పీల్ చేశాడు. ఫీల్డ్ అంపైర్ కృతిక వెంటనే ఔటిచ్చింది. లెగ్ స్టంప్ ఆవల బంతి పిచ్ అయినట్లు రిప్లేలో స్పష్టంగా కనిపించింది. అయితే అశ్విన్, శివమ్ సింగ్ తొలి ఓవర్లోనే రెండు రివ్యూలు వాడేయడంతో, సమీక్ష తీసుకోడానికి ఛాన్స్ లేకుండా పోయింది.దీంతో తనను ఔటివ్వడంతో అశ్విన్‌కు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. అంపైర్ వద్ద వాదించినా ఫలితం లేకపోయింది. మైదానాన్ని వీడుతూ సహనం కోల్పోయిన అశ్విన్, బ్యాట్?ను బలంగా తన ప్యాడ్లపై కొట్టుకున్నాడు. బౌండరీ లైన్ దగ్గరికి రాగానే గ్యాలరీలోకి గ్లోవ్‌ను విసిరికొట్టాడు. అశ్విన్ దురుసు ప్రవర్తనపై టీఎన్‌పీఎల్ తాజాగా చర్యలు తీసుకుంది. మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా విధించింది. ఇందులో 10 శాతం అంపైర్?పై ఆగ్రహం వ్యక్తం చేసినందుకు, 20 శాతం పరికరాలు ధ్వంసం చేసినందుకు ఫైన్ పడింది.



# నా జిడ్డు బ్యాటింగ్ వల్లే పంజాబ్‌కు ఓటమి

## యువ బ్యాటర్ నెహాల్ వధేరా

ఐపీఎల్ 2025 ఫైనల్లో పంజాబ్ కింగ్స్ ఓటమికి తన బ్యాటింగ్ వైఫల్యమే ప్రధాన కారణమని యువ బ్యాటర్ నెహాల్ వధేరా అన్నాడు. తాను ఇంకాస్త మెరుగ్గా ఆడి ఉంటే పంజాబ్ విజయం సాధించేదని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో అసాధారణ ప్రదర్శన కనబర్చిన పంజాబ్ కింగ్స్.. 11 ఏళ్ల తర్వాత ఫైనల్ చేరింది. కానీ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ)తో అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఫైనల్లో 6 పరుగుల తేడాతో ఓటమిపాలై తృటిలో టైటిల్ చేజార్చుకుంది. 191 పరుగుల లక్ష్యచేధనలో 18 బంతులాడిన నెహాల్ వధేరా 15 పరుగులు మాత్రమే చేసి వెనుదిరిగాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(1) కూడా తీవ్రంగా నిరాశపర్చాడు. దాంతో శశాంక్ సింగ్(30 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్స్‌లతో 61) ఒంటరి పోరాటం చేసినా ఫలితం దక్కలేదు.తాజాగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫైనల్ మ్యాచ్‌పై స్పందించిన నెహాల్ వధేరా.. తమ ఓటమికి పిచ్ కండిషన్స్‌ను సాకుగా చూపించలేనని స్పష్టం చేశాడు. తాను వేగంగా ఆడి ఉంటే ఫలితం మరోలా ఉండేదన్నాడు. 'ఫైనల్లో పంజాబ్ కింగ్స్ ఓటమికి పూర్తి బాధ్యత నాదే. ఆ సమయంలో నేను ఇంకాస్త మెరుగ్గా బ్యాటింగ్ చేసుంటే ఖచ్చితంగా విజయం సాధించేవాళ్లం. పిచ్‌ను నేను నిందించను. ఎందుకంటే ఇదే వికెట్‌పై ఆర్సీబీ 190 పరుగులు చేసింది. నేను ఆటను ఆఖరి వరకు తీసుకెళ్తాం అనుకున్నాను. చివరి వరకు క్రీజులో ఉండి విజయలాంఛనాన్ని పూర్తి చేయాలని భావించాను. కానీ అలా చేయలేకపోయాను.నేను ఇప్పటి వరకు ఆడిన టోర్నీల్లో వేగంగా ఆడిన ప్రతీసారి ఆశించిన ఫలితం దక్కింది. కానీ ఫైనల్ మ్యాచ్‌లో మాత్రం



ప్రతికూల ఫలితం ఎదురైంది. కొన్ని రోజులు మన ఆటకు అనుకూలించవు. ఆ రోజు కూడా నాకు కలిసి రాలేదు. ఇందుకు నాకు ఎలాంటి పశ్చాతాపం లేదు. వికెట్లు పడుతున్నా.. ఆటను చివరి వరకు తీసుకెళ్లే ప్రయత్నం చేశాను. కానీ నేను ఇంకొంచెం వేగంగా ఆడాల్సింది. ఈ ఓటమి ద్వారా నేను నేర్చుకున్న విషయం ఇదే. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితుల్లో వేగంగా ఆడే ప్రయత్నం చేస్తాను.రెండో మ్యాచ్‌లోనే నాకు ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడే అవకాశం దక్కుతుందని అస్సలు ఊహించలేదు. అదృష్టవశాత్తూ.. ఆ మ్యాచ్‌లో మేం ముందుగా బౌలింగ్ చేశాం. ఛేజింగ్ సమయంలో రికీ పాంటింగ్ వచ్చిన ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగాల్సి ఉంటుందని చెప్పాడు. నేను గత ఇంటర్వ్యూలో చెప్పినట్లుగా నా దగ్గర ఒక్క క్రికెట్ కిట్ మాత్రమే ఉండేది. ఐపీఎల్‌కు కూడా ఒక్క కిట్‌తోనే వచ్చాను. సాధారణంగా ఆటగాళ్లు ఎక్స్‌ట్రా కిట్‌తో వస్తారు. నేను మాత్రం ఒక్క కిట్‌తోనే ఆడాలనుకున్నాను. ఆ మ్యాచ్‌లో నాపై ఎలాంటి ఒత్తిడి లేదు. నేను నేరుగా రికీ పాంటింగ్ వద్దకు వెళ్లాను. మ్యాచ్‌ను ముగించాలని రికీ పాంటింగ్ చెప్పారు. నేను ముగిస్తానన్నాను. సహజంగా ఆడుతూ లూజ్ బాల్స్‌ను బౌండరీకి తరలించాను.'అని నెహాల్ వధేరా చెప్పుకొచ్చాడు.

## విశ్వజి



# దేవుడు వచ్చిన వరమే ఈ పండు..

### ఆ ప్రాబ్లమ్ ఉన్నోళ్లకి ఇది దివ్యౌషధం..

వేసవి వచ్చిందంటే చాలు మామిడి పండ్లతో పాటు మనకు గుర్తొచ్చే మరో అద్భుతమైన పండు నేరేడు. తియ్యదనం, వగరు కలగలిపిన తన ప్రత్యేకమైన రుచితో ఈ పండుతో మనల్ని కట్టిపడేస్తుంది. అయితే నేరేడు పండు కేవలం రుచికి మాత్రమే పరిమితం కాదు అది ఒక ఔషధ గని. సంవత్సరంలో కొద్ది నెలలు మాత్రమే లభించే ఈ పండు..తనలో ఎన్నో ఆరోగ్య రహస్యాలను దాచుకుంది. ముఖ్యంగా మధుమేహంతో బాధపడేవారికి ఇది ఒక సంజీవనిలా పనిచేస్తుందని ఆయుర్వేదం బలంగా చెబుతోంది. ఆయుర్వేదంలో నేరేడు ప్రాముఖ్యత శతాబ్దాలుగా ఆయుర్వేద వైద్యంలో నేరేడు పండుకు చాలా ప్రముఖ స్థానం ఉంది. కేవలం నేరేడు పండు మాత్రమే కాకుండా దాని గింజలు, బెరడు, ఆకులు కూడా ఎన్నో వ్యాధుల నివారణకు ఉపయోగపడతాయి. నేరేడు పండులోని గుణాలు శరీరంలోని కఫ, పిత్త దోషాలను సమతుల్యం చేయడానికి సహాయపడతాయి. ఈ సహజ సిద్ధమైన లక్షణాలే మధుమేహాన్ని నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. గింజలలో దాగి ఉన్న అసలైన శక్తి నేరేడు పండు అసలైన శక్తి దాని గింజలలో దాగి ఉందని చెప్పవచ్చు. ఈ గింజలను ఎండబెట్టి పొడి చేసి వాడటం వల్ల మధుమేహంపై అద్భుతమైన ప్రభావాన్ని చూపవచ్చు. నేరేడు గింజలలో జాంబోలిన్, జాంబోసిన్ అనే రెండు శక్తివంతమైన సమ్మేళనాలు ఉంటాయి. ఇవి మన శరీరంలో పిండిపదార్థాలు చక్కెరగా మారే ప్రక్రియను నెమ్మదింపజేస్తాయి. దీనివల్ల భోజనం తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగకుండా నియంత్రణలో ఉంటాయి. పోషకాల గని, ఆరోగ్య ప్రయోజనాలు నేరేడు పండు ఒక పోషకాల నిధి. ఇందులో విటమిన్ సి, ఐరన్, ఫైబర్, కాల్షియం, ఫాస్పరస్ వంటి విటమిన్లు, ఖనిజాలతో పాటు శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. రోగనిరోధక శక్తి విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంపొందించి ఇన్ఫెక్షన్ల నుండి కాపాడతాయి. ఇన్సులిన్ సున్నితత్వం నేరేడును క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరంలో ఇన్సులిన్ సున్నితత్వం పెరుగుతుంది. ఇది కణాలు గ్లూకోజ్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకునేలా చేసి రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. జీర్ణక్రియ, బరువు నియంత్రణ అధిక ఫైబర్ కంటెంట్ జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. ఆకలిని నియంత్రించి ఊబకాయం వంటి మధుమేహానికి సంబంధించిన ప్రమాద కారకాలను తగ్గించడంలో కూడా ఇది తోడ్పడుతుంది. భోజనం తర్వాత ఈచిన్న పని చేస్తే ఆ పెద్ద సమస్యకు చెక్ పెట్టొచ్చు..గ్యాస్ రిలీజ్ కూడా! షుగర్ లెవల్ ని నియంత్రించడానికి నేరేడును ఎలా ఉపయోగించాలి? మధుమేహ నియంత్రణ కోసం నేరేడు పండును వివిధ రకాలుగా మన ఆహారంలో చేర్చుకోవచ్చు. సీజన్‌లో దొరికే తాజా నేరేడు పండ్లను తినడం ఉత్తమమైన మార్గం. ఇది శరీరానికి తక్షణ శక్తిని, తాజాదనాన్ని ఇస్తుంది. నేరేడు గింజలను సేకరించి, శుభ్రంగా కడిగి, ఎండబెట్టి, మెత్తని పొడిగా చేసుకోవాలి. ప్రతిరోజూ ఉదయం పరగడుపున అర టీస్పూన్ పొడిని గోరువెచ్చని నీటితో కలిపి తీసుకోవడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి. నేరేడు పండ్లతో తయారుచేసిన వెనిగర్ జీర్ణక్రియకు సహాయపడటమే కాకుండా బ్లడ్ షుగర్ లెవెల్స్‌ను స్థిరంగా ఉంచడంలో సహాయపడుతుంది.

# జుట్టు రాలటానికి మూలాలివే.. ఇవి తెలిస్తే నివారణ సాధ్యం!



జుట్టు రాలడం అతి పెద్ద సమస్య, దీనికి అనేక కారణాలున్నాయి. జుట్టు రాలటానికి పోషక లోపాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి, ఎందుకంటే అనేక వ్యక్తులు అవసరమైన విటమిన్లు మరియు ఖనిజాలను ఆహారంలో తీసుకోవటం లేదు. ఒత్తిడి మరియు ఆందోళన కూడా జుట్టు రాలటానికి ప్రధాన కారణాలు. చాలా మంది అనుసరించే వేగవంతమైన జీవనశైలి కూడా జుట్టు రాలటానికి ప్రధాన కారణంగా మారుతుంది.

జుట్టు ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే అంశాలు వాతావరణ మార్పులు, వాతావరణ నమూనాలలో మార్పులు వంటి వాటి వల్ల జుట్టు ఆరోగ్యం ప్రభావితమవుతుంది. కొన్ని జుట్టు సంరక్షణ ఉత్పత్తుల వినియోగం కూడా ప్రతికూల ప్రభావాలను కలిగి ఉండవచ్చు.

అదనంగా, జీర్ణ సంబంధ ఆరోగ్య సమస్యలు జుట్టు రాలడాన్ని ప్రభావితం చేయవచ్చు, జుట్టు రాలే సమస్యలు మొత్తం ఆరోగ్యానికి ప్రాధాన్యతను హైలైట్ చేస్తుంది.


జుట్టు రాలటంలో కీలక పాత్ర పోషించేవి ఇవే జెనెటిక్స్ జుట్టు రాలడంలో మరో కీలక అంశం. కుటుంబ చరిత్ర వ్యక్తులను ఈ సమస్య ముందు నుండి ఉంటే వారికి కూడా ఈ సమస్య తప్పక వస్తుంది. వయస్సుతో సంబంధిత హార్మోన్ల మార్పులు కూడా జుట్టు పలుచబడడం మరియు రాలడంలో తోడ్పడతాయి. ఈ సహజ ప్రక్రియలు తరచుగా నివారించలేనివి కానీ సరైన సంరక్షణతో జుట్టు బాగా రాలే సమస్యను తగ్గించవచ్చు.

జీవనశైలి, ఒత్తిడి జుట్టు ఆరోగ్యంపై ప్రభావం ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో పనులు చేసే జీవనశైలి ఒత్తిడి స్థాయిలను పెంచుతుంది. పరోక్షంగా జుట్టు ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. పర్యావరణ కాలుష్యం మరో సమస్య. ఇది జుట్టును హానికరమైన మూలకాలకు గురిచేస్తుంది. అంతేకాదు హానికరమైన రసాయనాల షాంపూ లను ఉపయోగించటం లేదా స్టైలింగ్ చేయటం కోసం ఉపయోగించే లేటెస్ట్ టెక్నాలజీలు కూడా పెరిగిన జుట్టు రాలడానికి దారితీస్తాయి.

### జుట్టు రాలటానికి కారణాల అధ్యయనం నివారణకు కీలకం

ఈ కారణాలను అర్థం చేసుకోవడం జుట్టు రాలడాన్ని సమర్థవంతంగా పరిష్కరించడంలో సహాయపడుతుంది. జుట్టు పోషణపై దృష్టి పెట్టడం, ఒత్తిడిని తగ్గించుకోవటం మరియు అనుకూలమైన జుట్టు సంరక్షణ పద్ధతులను అవలంబించడం ద్వారా జుట్టు సంరక్షణకు కృషి చేయవచ్చు. కనుక జుట్టు రాలటానికి కారణాలు తెలుసుకుని తదనుగుణంగా జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.

# మైగ్రేన్ తలనొప్పి వేధిస్తుందా? కారణాలు, లక్షణాలు, నివారణలు ఇవే!



ప్రస్తుత జీవన శైలి కారణంగా చాలామంది అనేక అనారోగ్యాల బారిన పడుతున్నారు. అటువంటి అనారోగ్య సమస్యలలో మైగ్రేన్ ఒకటి. మైగ్రేన్ అనేది తీవ్రమైన తలనొప్పితో కూడిన నాడీ సంబంధిత రుగ్మత. ఇది సాధారణంగా ఒత్తిడి కారణంగా వస్తుంది. తలకు ఒక వైపున లేదా రెండు వైపులా విపరీతమైన నొప్పితో కొన్ని గంటల నుండి రోజుల వరకు కూడా ఈ నొప్పి ఉండవచ్చు. మైగ్రేన్ లక్షణాలు.. మైగ్రేన్ యొక్క సాధారణ లక్షణాలలో తలనొప్పి తీవ్రంగా ఉండవచ్చు. కంటి చూపులో మార్పులు, కంటి చూపు మందగింపు, చేతుల్లో జలదరింపు, కడుపులో వికారం, వాంతులు, విరోచనాలు, కాంతి మరియు శబ్ద సున్నితత్వం, నీరసం, విపరీతమైన అలసట, కండరాల బలహీనత, హార్మోన్ల మార్పులు, ఒత్తిడి, ఆందోళన వంటి అనేక లక్షణాలు కనిపిస్తాయి. కుటుంబ చరిత్రలో మైగ్రేన్ ఉంటే కూడా మైగ్రేన్ వచ్చే అవకాశం ఉంటుంది. మైగ్రేన్ తలనొప్పి రావడానికి కారణాలు ఇవి కూడా కావొచ్చు.. కొందరిలో శరీరం డీహైడ్రేషన్ కు గురైతే కూడా మైగ్రేన్ వస్తుంది. మెడనొప్పి ఎక్కువగా ఉన్నవారిలో కూడా మైగ్రేన్ వచ్చే ప్రమాదం ఉంది. క్రమరహిత జీవనశైలి, భావోద్వేగ ఒత్తిడి, తీవ్రమైన శారీరక శ్రమ, పానీయాలను ఎక్కువగా తీసుకోవడం, సరైన సమయానికి తినకపోవడం కూడా మైగ్రేన్ తలనొప్పి రావడానికి కారణాలుగా చెప్పవచ్చు.

### వీటివల్ల మైగ్రేన్ తలనొప్పి ప్రమాదం

ఎక్కువగా ప్రయాణాలు చేసే వారిలోనూ, వాతావరణంలో మార్పుల కారణంగాను, వెన్నెముక సమస్యలు ఉన్న వారిలోనూ, ఎక్కువగా ధూమపానం, మద్యపానం చేసే వారిలోనూ, మైగ్రేన్ సమస్యలు వచ్చే అవకాశం లేకపోలేదు. ఓరల్ కాంట్రాసెప్టివ్ పిల్స్ లాంటివి వాడే వారిలోనూ, నిరాశ ఆందోళనలకు లోనయ్యే వారిలోనూ, నిద్ర రుగ్మతలు ఉన్న వారిలోనూ మైగ్రేన్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

### మైగ్రేన్ తలనొప్పి కారణంగా ఈ ప్రమాదం

మైగ్రేన్ తలనొప్పి వచ్చిన వారిలో కళ్ళు ఎర్రబడడం, కళ్ళల్లో నీళ్ళు రావడం, మాట్లాడలేకపోవడం, కళ్ళముందు జిగ్జాగ్ లైన్లు కనబడడం, శబ్దాలు వినిపించడం, కాళ్లు చేతులలో తిమ్మిర్లు రావడం, తల తిరగడం, వాంతులు కావడం, వికారం అనిపించడం, తలలో తీవ్రమైన నొప్పి రావడం వంటి సాధారణమైన లక్షణాలు కనిపిస్తాయి. అయితే మైగ్రేన్ తలనొప్పి తగ్గాలంటే అన్నిటికంటే ముందుగా జీవనశైలి మార్పులు చేసుకోవాలి. క్రమం తప్పకుండా నిద్ర మరియు ఆహారపు అలవాట్లు చేసుకోవాలి.

### మైగ్రేన్ తలనొప్పి తగ్గేందుకు ఇలా చెయ్యండి

ఒత్తిడి నిర్వహించడానికి యోగా, ధ్యానం వంటి వాటిని చేయాలి. మైగ్రేన్ తలనొప్పి ట్రిగ్గర్ అయ్యే ఆహారాలను నివారించాలి. శరీరాన్ని హైడ్రేటెడ్ గా ఉంచుకునేందుకు తగినంత నీటిని తాగాలి. నొప్పి నివారణ ఔషధాలను, మైగ్రేన్ కు డాక్టర్ ఇచ్చే మందులను తప్పనిసరిగా వాడాలి. నొప్పి మొదలైనప్పుడు ప్రశాంతంగా నిశ్శబ్దంగా, కాంతిలేని ప్రదేశంలో విశ్రాంతి తీసుకోవాలి. నొప్పి ఉన్నచోట వెచ్చని లేదా చల్లని కంప్రెస్ ను తలపైన పెట్టుకోవాలి. ఈ విధంగా మైగ్రేన్ తలనొప్పి నుంచి కొంతమేర ఉపశమనాన్ని పొందవచ్చు.

## మార్కెట్

# ఐపీవోకి లలితా జ్యువెల్లరీ

న్యూఢిల్లీ : ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ లలితా జ్యువెల్లరీ..స్టాక్ మార్కెట్లో అడుగుపెట్టడానికి సిద్ధమైంది. ఇందుకు సంబంధించి మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తు చేసుకున్నది. ఈ వాటాల విక్రయం ద్వారా గరిష్ఠంగా రూ.1,700 కోట్ల నిధులను సమీకరించాలని యోచిస్తున్నది. దీంట్లో తాజా షేర్లను జారీ చేయడం ద్వారా రూ.1,200 కోట్లు, కంపెనీ సీఎండీ కిరణ్ కుమార్ జైన్‌కు చెందిన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో విక్రయించడం ద్వారా మరో రూ.500 కోట్లను సేకరించాలని నిర్ణయించింది. ఈ విషయం సెబీకి సమర్పించిన డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్‌పెక్టస్(డీఆర్‌హెచ్‌పీ)లో వెల్లడించింది. అర్హత కలిగిన ఉద్యోగులకు రాయితీతో కూడిన షేర్లను కేటాయించనున్నది సంస్థ. ఈ వాటాల విక్రయంతో వచ్చిన నిధుల్లో రూ.1,014.50 కోట్లను నూతన స్టోర్లను ఏర్పాటు చేయడానికి, కార్పొరేట్ అవసరాల నిమిత్తం వినియోగించనున్నట్టు ప్రకటించింది. 1985లో చెన్నైలో తన తొలి స్టోర్‌ను ప్రారంభించిన సంస్థ..ప్రస్తుతం తన స్టోర్ల సంఖ్యను 56కి పెంచుకున్నది. వీటిలో ఆంధ్రప్రదేశ్‌లో 22, తమిళనాడులో 20, కేరళలో ఏడు, తెలంగాణలో ఆరు, పుదుచ్చేరిలో ఒక్క స్టోర్‌ను నిర్వహిస్తున్నది. డిసెంబర్, 2024తో ముగిసిన తొమ్మిది నెలల కాలానికిగా సంస్థ రూ.12,594.67 కోట్ల ఆదాయంపై రూ.262.33 కోట్ల నికర లాభాన్ని గడించింది.




# వరుస లాభాలకు బ్రేక్.. ప్లాట్‌గా ముగిసిన సూచీలు..!



దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం ప్లాట్‌గా ముగిశాయి. ఇటీవల వరుస సెషన్లలో లాభాల్లో ముగిసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్లు అస్థిరతకు గురయ్యాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 82,643.73 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం ప్లాట్‌గా ముగిశాయి. ఇటీవల వరుస సెషన్లలో లాభాల్లో ముగిసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్లు అస్థిరతకు గురయ్యాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 82,643.73 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఆ తర్వాత కొద్దిసేపటిక మార్కెట్లు ఒడిదొడుకులను ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ ఇంట్రాడేలో 82,680.79 పాయింట్ల గరిష్టాన్ని తాకగా.. అత్యల్పంగా 82,240.40 పాయింట్ల కనిష్టానికి తగ్గింది. చివరకు 53.49 పాయింట్లు పతనమై.. 82,391.72 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 1.05 పాయింట్లు పెరిగి 25,104.25 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 2,160 షేర్లు పెరిగాయి. మరో 1,723 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో గ్రాసిమ్ ఇండస్ట్రీస్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, టెక్ మహీంద్రా, టాటా మోటార్స్, ఇన్ఫోసిస్ లాభపడగా.. ట్రెంట్, ఆసియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్ నష్టపోయాయి. రియాల్టీ ఇండెక్స్ ఒకశాతం పతనం కాగా.. ఐటీ ఇండెక్స్ 1.7 శాతం పెరిగింది. మీడియా ఇండెక్స్ ఒకశాతం వృద్ధిని నమోదు చేసింది. పవర్ ఇండెక్స్ దాదాపు ఒకశాతం లాభపడింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఫ్లాట్‌గా ముగియగా.. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.3 శాతం పెరిగింది.

# ఆర్ఆర్ఎల్ఆర్, ఎంసీఎల్ఆర్‌లకు బ్యాంకర్ల కోత..

### దిగొస్తున్న లోన్ టెన్యూర్, ఈఎంఐల భారం

### 10 నుంచి 50 బేసిస్ పాయింట్లదాకా తగ్గింపులు

న్యూఢిల్లీ, జూన్ 9: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇటీవలి ద్రవ్యసమీక్షలో రెపోరేటును అర శాతం కోత పెట్టిన నేపథ్యంలో ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులూ తమ రుణాలపై వడ్డీరేట్లను తగ్గిస్తున్నాయి. గత వారం జరిగిన ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో రెపోను ఆర్బీఐ 50 బేసిస్ పాయింట్లు తగ్గించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా, యూకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంక్‌లు రెపో లింక్డ్ లెండింగ్ రేటు (ఆర్ఆర్ఎల్ఆర్) ఆధారిత రుణాలపై, మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు (ఎంసీఎల్ఆర్) ఆధారిత లోన్లపై వసూలు చేస్తున్న వడ్డీరేట్లకు 10 నుంచి 50 బేసిస్ పాయింట్లదాకా కత్తెర వేశాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) తమ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు ఆర్ఆర్ఎల్ఆర్‌ను 50 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. తగ్గిన వడ్డీరేట్లు ఈ నెల 7 నుంచే వర్తిస్తాయని ఈ ప్రభుత్వ రంగ బ్యాంక్ తెలిపింది. ఆర్ఆర్ఎల్ఆర్ అనుసంధానంగా ఈ బ్యాంక్‌లో లోన్లు తీసుకున్న రుణగ్రహీతలందరికీ ప్రయోజనం చేకూరుతుంది. కాగా, ప్రస్తుతం బీవోబీ ఆర్ఆర్ఎల్ఆర్ 8.15 శాతంతో మొదలవుతున్నది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రైవేట్ రంగ బ్యాంక్ హెచ్‌డీఎఫ్‌సీ ఎంసీఎల్ఆర్ అన్ని కాలపరిమితులపై 10 బేసిస్ పాయింట్లు తగ్గింది. ఈ నెల 7 నుంచే తగ్గిన వడ్డీరేటు అమల్లోకి వచ్చింది. దీంతో ఎంసీఎల్ఆర్ ఆధారంగా రుణాలు తీసుకున్న రుణగ్రహీతలకు ఈ నిర్ణయం లాభిస్తుంది. కాగా, ప్రస్తుతం ఓవర్‌నైట్, నెల ఎంసీఎల్ఆర్ 8.90 శాతంగా ఉన్నాయి. 3 నెలలది 8.95 శాతానికి, 6 నెలలు, ఏడాది టెన్యూర్ 9.05 శాతంగా ఉన్నాయి. రెండేండ్లు, మూడేండ్లు టెన్యూర్స్‌పై వడ్డీరేటు 9.10 శాతంగా ఉన్నది. ఇదిలావుంటే ఆర్ఆర్ఎల్ఆర్‌నూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 50 బేసిస్ పాయింట్లు తగ్గించే అవకాశాలున్నాయి. దీని ఆధారంగా రుణాలు తీసుకున్నవారికి వచ్చే నెల నుంచి ఈ లాభం అందనున్నట్టు తెలుస్తున్నది. పంజాబ్ నేషనల్ బ్యాంక్.. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ఆర్ఆర్ఎల్ఆర్ 50 బేసిస్ పాయింట్లదాకా తగ్గింది.

# మహిళలపై సజ్జల వ్యాఖ్యలు దారుణం

### మూర్ఖుడిలా ప్రవర్తిస్తున్న సజ్జల తదితరులు
### ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



అన్నమయ్య : అమరావతి మహిళలపై వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఆమె మీడియాతో మాట్లాడారు. మహిళలను కించపరుస్తూ సజ్జల ఒక మూర్ఖుడిలా మాట్లాడారని మండిపడ్డారు. వైకాపా చేసిన తప్పునే మళ్లీ మళ్లీ చేస్తోందన్నారు. సజ్జల కుమారుడు భార్గవ్‌రెడ్డి సోషల్‌మీడియాను అడ్డుపెట్టుకొని నాపై కూడా దుష్ప్రచారం చేశారు. వైఎస్ కుమార్తె, ఒక మహిళ అని కూడా చూడకుండా కించపరిచారు. జగన్ అందరినీ నా అక్కాచెల్లెళ్లు అంటారు.. కానీ, ఆయన సొంత చెల్లికే మర్యాద లేదు. ఇక రాష్ట్రంలోని మహిళలను ఏం గౌరవిస్తారని విమర్శించారు. ఏపీ మహిళలను ఉద్దేశించి వైసీపీ నేత సజ్జల రామకృష్ణా రెడ్డి చేసిన వ్యాఖ్యలు పెను దుమారాన్ని రేపుతున్నాయి. సజ్జల వ్యాఖ్యలను ప్రతీ ఒక్కరూ ఖండిస్తున్నారు. తాజాగా వైసీపీ నేత చేసిన కామెంట్స్‌పై వైఎస్ షర్మిలా రెడ్డి స్పందిస్తూ.. మహిళల మీద సజ్జల రామకృష్ణా రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నా మన్నారు. మూర్ఖుడిలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మహిళలను పిశాచులతో పోల్చుతారా.. మహిళలను రాక్షసులు అంటారా అంటూ ఫైర్ అయ్యారు. సంకర జాతి అని మహిళలను అవమానిస్తారా అని అన్నారు. చేసిన తప్పుకి క్షమాపణ చెప్పడానికి ఎందుకు నామోషీ అని ప్రశ్నించారు. వైసీపీ చేసిన తప్పును మళ్ళీ మళ్ళీ చేస్తోందన్నారు. ఇదే సజ్జల కొడుకు సోషల్ మీడియాను అడ్డుపెట్టుకొని తనను కూడా వదిలి పెట్టలేదన్నారు. సైతాన్ సైన్యంతో తన మీద తప్పుడు ప్రచారం చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ బిడ్డ అని, ఒక మహిళా అని చూడకుండా కించపరిచారని అన్నారు. జగన్ నా అక్క చెల్లెళ్ళు అంటారని.. కానీ జగన్ సొంత చెల్లికే మర్యాద లేదని.. ఇక రాష్ట్రంలో వీళ్ళు మహిళలకు ఏం గౌరవం ఇస్తారు అంటూ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ మహాసముద్రమన్నారు. సముద్రంలో మంచితో పాటు చెత్త కూడా ఉంటుందని తెలిపారు. అప్పుడప్పుడు చెత్త పైకి వస్తుందన్నారు. పార్టీ అభివృద్ధి చెందుతుంటే లాగే వాళ్ళు కూడా ఉన్నారన్నారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. పార్టీకి క్రమశిక్షణ కమిటీ ఉందని.. అటు-వంటి వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. పార్టీపై దుష్ప్రచారం చేస్తే ఊరుకునేది లేదని వైఎస్ షర్మిలా రెడ్డి హెచ్చరించారు.

## అధికారిక కార్యక్రమంగా కూటమి ఏడాది పాలన

### సుపరిపాలన- స్వర్ణాంధ్రప్రదేశ్ పేరుతో వేడుకలు
### 12న వేడుకలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

అమరావతి : కూటమి ప్రభుత్వం ఏడాది పాలన సందర్భంగా సుపరిపాలన- స్వర్ణాంధ్రప్రదేశ్ పేరుతో రాష్ట్ర స్థాయి వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 12న గురువారం సాయంత్రం ఈ వేడుకలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, అఖిలభారత సర్వీసు అధికారులతో కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి తగిన ఏర్పాట్లు- చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయి.. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. దీనిపై కీలక ఉత్తర్వులు జారీ చేసింది ఏపీ సర్కార్.. రాష్ట్ర స్థాయి వేడుకగా కూటమి ఏడాది పాలన నిర్వహించాలని నిర్ణయించారు.. జూన్ 12వ తేదీన సాయంత్రం ఈ వేడుకలు నిర్వహించనున్నారు.. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఆల్ ఇండియా ఆఫీసర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని నిర్వహించాలని స్పష్టం చేసింది.. దీనికి సంబంధించిన తగిన ఏర్పాట్లు- చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది కూటమి సర్కార్.. 'సుపరిపాలన.. స్వర్ణాంధ్రప్రదేశ్' పేరుతో రాష్ట్ర స్థాయి కార్యక్రమం నిర్వహించనున్నారు.. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు.. ఐఏఎస్ అధికారులు, ఐపీఎస్ అధికారులు పాల్గొంటారని ఉత్తర్వుల్లో పేర్కొంది. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసి జూన్ 12 నాటికి ఏడాది పూర్తి కానుంది. దీనిని ప్రభుత్వం ఒక వేడుకలా ఈ కార్యక్రమం నిర్వహించనుంది.. ఈ కార్యక్రమంలో సీఎం, డిప్యూటీ- సీఎం, మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పాల్గొంటారు.. ఎంపీలు.. కేంద్ర మంత్రులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.. ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి.. సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి ప్రత్యేకంగా ఈ సమావేశంలో వివరించనున్నారు.

## భార్యపై అనుమానంతో హత్య

### పోలీసులకు లొంగిపోయిన హంతకుడు

హైదరాబాద్ : కలకాలం తోడు నీడగా ఉండాల్సిన భర్త అనుమానంతో భార్యను కడతేర్చాడు. వివాహేతర సంబంధం ఉందనే కారణంతో భార్యను చున్నీతో ఉరివేసి చంపాడు. ఈ దారుణ ఘటన హైదరాబాద్ సరూర్‌నగర్‌లో చోటుచేసుకుంది. భార్యను చంపిన తర్వాత భర్త పోలీసులకు లొంగిపోయాడు. తన భార్యను తానే చంపినట్లు పోలీసులకు చెప్పాడు. కేసు నమోదు చేసుకున్న సరూర్‌నగర్ పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. తూర్పుగోదావరి కొమ్మనపల్లికి చెందిన భార్య భర్తలు మరియాదాస్, అమృత పొట్టకూటికోసం హైదరాబాద్ వచ్చారు. గత మూడేళ్లుగా సరూర్‌నగర్‌లో ఉంటున్నారు. వివాహేతర సంబంధాలపై దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. మంగళవారం అమృత ఫోన్ మాట్లాడుతుండగా.. మరియాదాస్ గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్య గొడవ పెద్దది కావడంతో మరియాదాస్ కోపోద్రిక్తుడయ్యాడు. మెడకు చున్నీ బిగించి భార్య అమృతను చంపేశాడు. అమృతను చంపిన తర్వాత మరియాదాస్ నేరుగా సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి మరియాదాస్‌ను అరెస్ట్ చేశారు.

## కక్షసాధింపు చర్యలతో బాబు ప్రభుత్వం

### కొమ్మినేని అరెస్ట్ ఇందులో భాగమే
### అత్యాచార ఘటనలపై చర్యలు ఏవీ
### ఎక్స్ వేదికగా మాజీ సిఎం జగన్ విమర్శలు

అమరావతి : మా ప్రభుత్వ హయాంలో అవినీతి రహిత, పారదదర్శక పాలన అందించాం.. విప్లవాత్మక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశాం.. కానీ, చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా మోసపూరితంగా వ్యవహరిస్తోంది.. రెడ్ బుక్ పాలనతో ప్రభుత్వాన్ని అస్తవ్యస్తంగా మార్చారు అంటూ సోషల్ మీడియా వేదికగా ఏపీ సర్కార్‌పై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేని అసమర్థుడు చంద్రబాబు.. ప్రజలను పూర్తిగా మోసం చేశారు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవటానికి ప్రజల దృష్టి మళ్లించటానికి రాష్ట్రంలో అలజడి సృష్టిస్తున్నారు అంటూ దుయ్యబట్టారు..సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావుని అన్యాయంగా కేసులో ఇరికించి అరెస్టు చేశారు.. చట్టానికి విరుద్ధంగా రాజకీయ కక్షసాధింపునకు దిగారు.. టీవీ చర్చలో జరిగిన దానికి కొమ్మినేనిని బాధ్యులను చేయటం ఏంటి? అప్పటికీ ఆయన చర్చను పక్క దారి పట్టకుండా నియంత్రించారు.. కానీ, చంద్రబాబు ఒక కుట్రతో దాన్ని వక్రీకరించారని ఆరోపించారు. ఒక పథకం ప్రకారం సాక్షి మీడియా కార్యాలయాలపై రాష్ట్రవ్యాప్తంగా దాడులను ప్రోత్సాహించారు. మహిళల గౌరవాన్ని కాపాడతామని చెబుతూ వారితోనే దాడులు చేయించారు. రాష్ట్రంలో ఈ ఒక్క సంవత్సరంలోనే 188 లైంగిక దాడులు, 15 హత్యాచార సంఘటనలు జరిగాయని పేర్కొన్నారు.. అనంతపురం జిల్లాకు చెందిన ఇంటర్మీడియట్ గిరిజన విద్యార్థిని హత్య చేసి డెడ్‌బాడీని అడవిలో పడేశారు.. మరోచోట 14 మంది టీడీపీ కార్యకర్తలు 9వ తరగతి చదువుతున్న దళిత బాలికపై ఆరు నెలల పాటు- గ్యాంగ్ రేప్ చేశారు. ఆమె గర్భవతి అయిందని ఆవేదన వ్యక్తం చేశారు.. రాజకీయ ఒత్తిడి, పోలీసుల నిర్లక్ష్యం వలన బాధితురాలి కుటుంబం రోడ్డున పడింది. మహిళలు, చిన్నారులను రక్షిస్తామన్న చంద్రబాబు వారికి ఇచ్చే గౌరవం ఇదేనా? అని ప్రశ్నించారు.. పైగా ఆడవారిని అడ్డం పెట్టుకుని రాజకీయ కక్షసాధింపునకు దిగటం చంద్రబాబుకే చెల్లింది అంటూ వైఎస్ జగన్ ఫైర్ అయ్యారు..

## కొమ్మినేనికి బిగ్ షాక్

### 14 రోజుల రిమాండ్ విధించిన కోర్టు

గుంటూరు : అమరావతి మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన కేసులో సాక్షి ఛానల్ యాంకర్ కొమ్మినేని శ్రీనివాస్‌కు బిగ్ షాక్ తగిలింది. కొమ్మినేనికి రిమాండ్ విధిస్తూ మంగళగిరి కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం ఉదయం కొమ్మినేనిని పోలీసులు మంగళగిరి కోర్టులో హాజరుపర్చగా.. వాదనలు జరిగాయి. అనంతరం ఆయనకు కోర్టు 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. దీంతో కొమ్మినేని శ్రీనివాస్‌ను గుంటూరు జిల్లా జైలుకు పోలీసులు తరలించారు.అసభ్యకర వ్యాఖ్యలు చేసిన కేసులో కొమ్మినేని శ్రీనివాస్ రావును ఉదయం గుంటూరు జీజీహెచ్‌లో శ్రీనివాస్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షలు ముగిసిన తరువాత భారీ బందోబస్తు నడుమ కొమ్మినేని మంగళగిరి కోర్టుకు తరలించారు. ఏపీ రాజధానిపై, రాజధాని మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ సాక్షి ఛానల్‌లో జరిగిన డిబేట్‌పై రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు నిరసనలు, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని పలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు నమోదు అయ్యాయి. ఈ క్రమంలో తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో రాజధాని ప్రాంతం మహిళగా ఉన్న తెలుగుదేశం పార్టీ దళిత నాయకురాలు కొమ్మంపాటి శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఏ1గా కృష్ణం రాజు, ఏ2గా కొమ్మినేని శ్రీనివాస్ రావు, ఏ3గా సాక్షా యాజమాన్యాన్ని చేర్చారు. కేసు నమోదు చేసిన తుళ్లూరు పోలీసులు సోమవారం హైదరాబాద్‌లో ఏ2 కొమ్మినేని శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని సాయంత్రానికి గుంటూరుకు తీసుకొచ్చారు. గత రాత్రి మొత్తం నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో విచారణ జరిపిన పోలీసులు మంగళవారం ఉదయం గుంటూరు జీజీహెచ్‌లో వైద్య పరీక్షల అనంతరం మంగళగిరి కోర్టులో కొమ్మినేనిని హాజరుపర్చారు. ఫిర్యాదుదారు శిరీష కూడా తన న్యాయవాదులతో వచ్చి జడ్జి ఎదుట స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రాంతాల మధ్య, వర్గాల మధ్య ఘర్షణలు సృష్టించే విధంగా వ్యాఖ్యలు చేశారనే అంశంతో పాటు- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అయితే కులపరంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు కాబట్టి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు వర్తించదని వైసీపీ తరపు న్యాయవాదులు వాదించినట్లు- తెలుస్తోంది. అనంతరం జడ్జి 14 రోజుల రిమాండ్ విధించారు. మరోవైపు జర్నలిస్టు కృష్ణంరాజు కోసం కూడా పోలీసులు గాలిస్తున్నారు.


## రఘువంశీ హత్యకేసు

### సీన్ రీ కన్‌స్ట్రక్షన్ కోసం సోనమ్ తరలింపు
### ఘటనా స్థలికి తీసుకెళ్లిన మేఘాలయ పోలీసులు

షిల్లాంగ్ : మధ్యప్రదేశ్ వ్యక్తి రాజా రఘువంశీ హనిమూన్‌లో ఉండగా హత్యకు గురైన ఘటనలో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. షిల్లాంగ్‌లో హనీమూన్‌లో ఉండగా అతడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ హత్యకు కుట్ర పన్నిన మృతుడి భార్య సోనమ్‌ను షిల్లాంగ్ తరలించారు. సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేసే క్రమంలో పోలీస్ బందోబస్తు మధ్య ఆమెను మేఘాల పోలీసులు తీసుకుని వెళ్లారు. ఆమె యూపీలో పోలీసులకు పట్టుబడింది. ఆమె ట్రాన్సిట్ రిమాండ్‌లో ఉంది. మరోవైపు, రఘువంశీని హత్య చేసిన సోనమ్ ప్రియుడు రాజ్ కుశ్వాహా, అతడి స్నేహితులను మేఘాలయ పోలీసులు విచారిస్తున్నారు. ఇక సోనమ్ తనకు ఎవరో మత్తుమందు ఇచ్చి యూపీకి తీసుకొచ్చారని విచారణలో తొలుత పేర్కొన్నట్టు- యూపీ అడిషనల్ జనరల్ అమితాబ్ యశ్ వెల్లడించారు. 'సోమవారం ఆమె ఘాజీపూర్‌లోని ధాబా వద్దకు చేరుకుంది. ఆ తరువాత తన కుటు-ంబానికి తాను ఎక్కడున్నదీ సమాచారం అందించింది. పోలీసులు తానున్న చోటకు వస్తారని తెలిసి ఇలా చేసింది. ఆమె కుటు-ంబసభ్యులు వెంటనే మధ్యప్రదేశ్ పోలీసులకు సమాచారం అందించారు. వారు యూపీలో స్థానిక పోలీసులను అలర్ట్ చేశారు. దీంతో, వారు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. తనకు ఎవరో డ్రగ్స్ ఇచ్చి అక్కడ వదిలిపెట్టారని ఆమె పేర్కొంది. ఆ తరువాత ఆమెను మెడికల్ చెకప్‌కు పంపించాము'సోనమ్‌కు పోలీసుల దర్యాప్తు తీరుతెన్నుల గురించి ఏమీ తెలియదు. బాధితురాలిగా నటించి తప్పించుకుందామని అనుకుంది. కానీ మేఘాలయ పోలీసుల అద్భుతంగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఈ కేసును వారే హ్యాండిల్ చేస్తున్నారు' అని యశ్ అన్నారు. రాజా హత్యలో అతడి భార్య సోనమ్ ప్రధాన సూత్రధారి అని మేఘాలయ పోలీసులు బలంగా విశ్వసిస్తున్నారు. ఎ÷-లాన్ ఆమెదే అని అనుమానిస్తున్నారు. భర్తను హత్య చేయించేందుకు కాంట్రాక్ట్ కిల్లర్‌లను రంగంలోకి దిపిందని చెబుతున్నారు. రాజాను నిందితులు హత్య చేసి ఓ లోయలో పడేశారు. దాదాపు రెండు వారాల తరువాత అతడి మృతదేహం పోలీసులకు లభించింది. అక్కడికి సమీపంలోనే రక్తపు మరకలు ఉన్న కొడవలిని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఘటన జరిగిన ప్రాంతానికి సమీపంలో ఇతర నిందితులతో కలిసి సోనమ్ ఉన్నట్టు సీసీటీ-వీల్లో కనిపించింది. మరోవైపు, రాజా హత్యకు కారణమైన వారిని మరణ శిక్ష విధించాలని మృతుడి కుటుంబం డిమాండ్ చేస్తోంది. నిందితులందరినీ మేఘాలయ పోలీసులు విచారిస్తున్నారు.

## చంద్రబాబు నివాసంలో కిషన్ రెడ్డి లంచ్

### బాబుతో పలు రాజకీయ అంశాలపై చర్చ



అమరావతి,జూన్10 : విజయవాడ పర్యటకు వెళ్లిన కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి.. టీ-డీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు.. చంద్రబాబు నివాసంలో జరిగిన ఈ లంచ్ మీటింగ్‌లో పలు అంశాలపై చర్చించారు.. ఆ తర్వాత చంద్రబాబు నివాసం నుంచి విజయవాడ బయల్దేరి వెళ్లారు.. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. విజయవాడ వచ్చినందుకు సీఎం చంద్రబాబు లంచ్ కి పిలిచారని తెలిపారు.. కేంద్ర సహాయం, ఏపీకి రావాల్సిన ప్రాజెక్ట్ లపై చర్చించామని వెల్లడించారు.. ఇక, విజయవాడ పర్యటనకు వచ్చినందుకు మర్యాద పూర్వకంగా కలవడానికి సీఎం చంద్రబాబు పిలిచారని తెలిపారు.. మైనింగ్, ఇతర ప్రాజెక్ట్ లపై ఈ లంచ్ సమావేశంలో చర్చించమన్నారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి.. వాటితో పాటు- తాజా రాజకీయ పరిణామాలు..తెలంగాణ రాజకీయాలపై కొద్దిసేపు చర్చించినట్టు సమాచారం..ఇక, విజయవాడలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి.. 'మోదీ ప్రభుత్వం 11 ఏళ్ల అభివృద్ధి ' కార్యక్రమాలపై పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు- ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి ఇంకా బీజేపీ నేతలు దేశ అభివృద్ధికి మోడీ పాలన ఎంత కీలకమైందో వివరించారు. కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. గత 11 ఏళ్లలో మోడీ ప్రభుత్వం మీద ఒక్క అవినీతి ఆరోపణ కూడా రాలేదని, ఇది దేశ ప్రజల నమ్మకానికి నిదర్శనమన్నారు. పేద, అణగారిన వర్గాలకు పెద్దపీట వేసేలా మోడీ పాలన ఉండిందని అన్నారు. రైతులు, యువత, మహిళలు ఈ నాలుగు ప్రధాన విభాగాల అభివృద్ధి కోసమే ప్రతి కార్యక్రమం రూపకల్పన చేశారని అన్నారు. భారతదేశం నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని, ఇటీవలే 4 ట్రిలియన్ డాలర్స్ ఎకానమీగా మారిందని కిషన్ రెడ్డి తెలిపారు. పన్నుల వ్యవస్థలో సమగ్ర మార్పులు చేసి, జీఎస్టీ ద్వారా 'వన్ నేషన్ వన్ ట్యాక్స్' లక్ష్యాన్ని సాధించామని తెలిపారు. 2014లో 6.91 కోట్ల పన్నులు కట్టే వారు ఉండగా, ఇప్పుడు 15.66 కోట్లకు పెరిగిందని వివరించారు.

## అమరావతి మహిళలపైకు వ్యాఖ్యలు

### సుమోటగా తీసుకున్న జాతీయ మహిళా కమిషన్
### మూడ్రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని డిజిపికి ఆదేశం

న్యూఢిల్లీ : అమరావతి మహిళలను ఉద్దేశించి సాక్షి ఛానెల్‌లో జర్నలిస్టు కృష్ణంరాజు చేసిన అసభ్యకర వ్యాఖ్యలను జాతీయ మహిళా కమిషన్ సుమోటోగా తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర డీజీపీకి కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ రహత్కర్ లేఖ రాశారు. కృష్ణంరాజు చేసిన అసభ్యకర వ్యాఖ్యలను ఎన్‌సీడబ్ల్యూ తీవ్రంగా ఖండించింది. ఈ వ్యవహారంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారో మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని డీజీపీని ఆదేశించింది. అమరావతి ఉద్యమంలో మహిళా రైతులు కీలకపాత్ర పోషించారని మహిళా కమిషన్ పేర్కొంది. కృష్ణంరాజు వ్యాఖ్యలపై మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా సుమోటోగా తీసుకుని మహిళా కమిషన్ విచారణకు ఆదేశించింది. అలాగే అసభ్య వ్యాఖ్యలపై జాతీయ మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. అమరావతిని 'వేశ్యల రాజధాని'గా సంబోధించడం అనేది రాజధాని ఉద్యమంలో ముఖ్యపాత్ర పోషించిన మహిళా రైతులను తీవ్రంగా అవమానించడమేనని జాతీయ మహిళా కమిషన్ పేర్కొంది. ఈ అసహ్యకరమైన, రెచ్చగొట్టే వ్యాఖ్యలను తీవ్రంగా జాతీయ మహిళా కమిషన్ ఖండిస్తోందని ఛైర్‌పర్సన్ విజయా రహట్కర్ అన్నారు. కాగా మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన ప్రధాన నిందితుడైన కృష్ణంరాజు మూడు రోజుల కిందటే విజయవాడలోని తన ఇంటికి తాళం వేసి కుటుంబంతోపాటు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అతని కోసం మూడు ప్రత్యేక పోలీస్ బృందాలు వివిధ ప్రాంతాల్లో గాలిస్తున్నాయి. వేరే రాష్ట్రానికి వెళ్లి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. సాధ్యమైనంత త్వరలోనే కృష్ణంరాజును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తామని పోలీసులు చెబుతున్నారు. మరోవైపు జగన్ మీడియా తీరుపై ఏపీ వ్యాప్తంగా మహిళల నిరసనలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి.

## మహిళలపై సజ్జల అనుచిత వ్యాఖ్యలు

### చర్య తీసుకోవాలంటూ డిజిపికి రఘురామ లేఖ

అమరావతి : రాజధాని ప్రాంత మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన లేఖ రాశారు. కుల వివక్షకు సంబంధించిన పదం వాడిన సజ్జలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన దూషణలు అమరావతిలోని వేలాది మంది మనోభావాలను దెబ్బతీశాయని.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అవమానకర భాషను ఎవరూ వాడకుండా చర్యలు తీసుకోవాలని రఘురామ కోరారు. అమరావతి మహిళలపై సాక్షి ఛానెల్‌లో జర్నలిస్టు కృష్ణంరాజు చేసిన అసభ్యకర వ్యాఖ్యలపై నిరసన తెలుపుతున్న మహిళలను ఉద్దేశించి సజ్జల నోరు పారేసుకున్నారు. వైకాపా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పిశాచాలు కూడా ఇలా చేయరేమో? వారిని రాక్షసులు అని కూడా అనలేం. అందరూ కలిసి సంకరం అయినట్టుంది. ఇవన్నీ కలిసి తయారైన తెగ ఏదో ఒకటున్నట్టుంది. ఆ తెగ పూనుకుంటే మాత్రమే ఇలా చేయగలదు. పూర్తిగా సమన్వయంతో కుమ్మక్కుని కొట్టాలని ప్రయత్నిస్తోంది. ఇవేవీ సహజమైనవి కావు, వ్యవస్థీకృతంగా చేస్తున్న నిరసన ప్రదర్శనలే అని సజ్జల వ్యాఖ్యానించారు.

## తిరుమలలో కొనసాగుతున్న రద్దీ

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. మంగళవారం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ క్రమంలో స్వామివారి ఉచిత దర్శనం కోసం వచ్చిన భక్తులతో వైకుంఠ కాంప్లెక్స్ లోని అన్ని కంపార్ట్ మెంట్లు నిండిపోయాయి. దీంతో వెంకన్న సర్వ దర్శనానికి టోకెన్ పొందిన భక్తులకు 18 గంటల సమయం పడుతుంది. సోమవారం 84,258 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరిలో 35,776 మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించారు. స్వామి వారి హుండీ ఆదాయం రూ. 3.90 కోట్లుగా ఉందని టిటిడి అధికారులు వెల్లడించారు.

## శ్రీకాకుళంలో ఘోర రోడ్డు ప్రమాదం


### వాహనం ఢీకొని ముగ్గురు మృతి

శ్రీకాకుళం : జాతీయరహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎత్తురాళ్లపాడు వద్ద కోటబొమ్మాళి-శ్రీకాకుళం మార్గంలో జాతీయరహదారిపై దూసుకొచ్చిన ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఒడిశాకు చెందిన కొందరు సింహాచలం వెళు_ఒడగా.. కాలకృత్యాల కోసం ఎత్తురాళ్లపాడు వద్ద హైవేపై కారు నుంచి దిగిన ముగ్గురిని వాహనం ఢీకొట్టింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని.. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముగ్గురిని వెంటనే చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ముగ్గురు మరణించారు. ఈఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# మాల్దీవుల బ్రాండ్ అంబాసిడర్‌గా కత్రినా



పర్యాటకులకి మాల్దీవ్స్ ఎంతటి ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని ఇస్తుందనేది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. నీలి రంగు సముద్రం చూస్తుంటేనే మనసు పులకరించిపోతుంది. అయితే మాల్దీవ్స్ జీవితంలో ఒక్కసారైన చూడాలని చాలా మందికి కల ఉంటుంది. ఇప్పుడు మాల్దీవులకి గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా కత్రినా కైఫ్ ఎంపికయింది. మాల్దీవులను ప్రముఖ పర్యాటక గమ్యంగా పరిచయం చేయడంలో భాగంగా కత్రినాని అంబాసిడర్‌గా ఎంపిక చేసినట్లు మాల్దీవుల టూరిజం ప్రమోషన్ సంస్థ అయిన మాల్దీవ్స్ మార్కెటింగ్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ కార్పొరేషన్ తాజాగా ప్రకటించింది. కత్రినా కైఫ్ రాయబారిగా ఎంపిక కావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ.. మాల్దీవులు అనేవి సహజసిద్ధమైన అందం, ఎంతో ప్రశాంతంగా ఉండే ప్రదేశం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యాటకులని పెంచేందుకు, వారికి అత్యుత్తమ అనుభవాలను అందించేందుకు నా వంతు కృషి చేస్తానని కత్రినా స్పష్టం చేశారు. మరోవైపు, మాల్దీవ్స్ రాజకీయంగా కూడా భారత్ సంబంధాలు మెరుగుపరచుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు- తెలుస్తుంది. మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముఇజ్జు ఇచ్చిన ఆహ్వానానికి సానుకూలంగా స్పందించిన , భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జూలై నెలలో మాల్దీవులకు వెళ్లే అవకాశముందంటూ నెట్టింట ప్రచారం జరుగుతుంది. ఇదే నిజమైతే ముఇజ్జు అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని మోదీ మొదటి పర్యటన అవుతుంది. కత్రినా -కై-ఫ్ గ్లోబల్ అంబాసడర్‌గా, మరోవైపు ప్రధాని మోదీ పర్యటన ..ఈ రెండు సంఘటనలూ మాల్దీవులను ఒక ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా బలోపేతం చేయడం ఖాయం అని నెటిజన్స్ అంటున్నారు.




## కుబేరకు దేవిశ్రీప్రసాద్ టెన్షన్

### పెండింగ్‌లో రీ రికార్డింగ్ పనులు

శేఖర్ కమ్ముల దర్శకత్వంలో కుబేర అనే సినిమా ప్రేక్షలు ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ధనుష్ హీరోగా, నాగార్జున కీలక పాత్రలో నటిస్తున్న ఈ సినిమాలో రష్మిక మరో కీలక పాత్రలో నటిస్తోంది. ఇక ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ దాదాపు ఏడాదిన్నర క్రితం మొదలైంది. సినిమా అనౌన్స్‌మెంట్ అయితే మూడేళ్ల క్రితమే వచ్చింది. ఎట్టకేలకు ఈ సినిమా ఈ నెల 20వ తేదీన ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. అమెజాన్ ప్రైమ్‌తో ఉన్న అగ్రిమెంట్స్ కారణంగా ఆ విడుదల తేదీని మార్చలేని పరిస్థితి. అయితే సినిమా రిలీజ్‌కు ఇంకా పది రోజులుంది కానీ ఇంకా ఒక సాంగ్ పూర్తి కాలేదు, అలాగే సినిమా రీ-రికార్డింగ్ కూడా పూర్తి కాలేదు. ఈ విషయాన్ని స్వయంగా నిర్మాత ఏషియన్ సునీల్ తాజా ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఇక మరో మూడు రోజుల్లో సినిమాకు సంబంధించిన ట్రైలర్ కట్ రిలీజ్ కావాల్సి ఉంది. ఆ తర్వాత మరో రెండు రోజులకు మరో సాంగ్ రిలీజ్ కావాల్సి ఉంది. దేవిశ్రీ ప్రసాద్ కారణంగా ఎప్పుడూ సినిమాకు లాస్ట్ మినిట్ టెన్షన్ ఏర్పడినట్లుగా సినీ వర్గాల వారు చెబుతున్నారు. శేఖర్ కమ్ముల తన టీంతో కలిసి సినిమాకు సంబంధించిన పెండింగ్ వర్క్స్ పూర్తి చేయడానికి శాయశక్తులా కృషి చేస్తున్నాడు. సినిమాకు ఇప్పుడిప్పుడే కాస్త బజ్ పెరుగుతోంది. అయితే దేవిశ్రీ ప్రసాద్ తన అవుట్‌పుట్ ఇచ్చేవరకు సినిమా విషయంలో టెన్షన్ తప్పదని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎందుకంటే ఈ మధ్యకాలంలో సంగీత దర్శకులు రీ-రికార్డింగ్ లేట్ చేయడంతో కొన్నిసార్లు సినిమాలు వాయిదాలు వేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడు తున్నాయి. ఈ నేపథ్యంలో దేవిశ్రీ ప్రసాద్ ఏం చేస్తాడో చూడాలి.



## చిన్నారుల సమక్షంలో పుట్టిన రోజు వేడుకలు


బసవతారకం ఆస్పత్రిలో కేక్ కట్ చేసిన బాలకృష్ణ ప్రముఖ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రిలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఆసుపత్రి సిబ్బంది, చిన్నారుల సమక్షంలో బాలకృష్ణ కేక్ కట్ చేశారు. చిన్నారులకు ఈ సందర్భంగా ఆయన బహుమతులను అందజేశారు. ఎన్టీఆర్ దంపతుల విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయసు కేవలం ఒక నంబర్ మాత్రమేన్నారు. బాలకృష్ణ అంటే ఏంటో ఇక నుంచి చూపిస్తానని అన్నారు. నా దృష్టిలో నంబర్ పెద్ద విషయం కాదు. నా వయసు అందరికీ తెలిసిందే. తల్లిదండ్రుల దీవెనలతో 64 ఏళ్లు పూర్తి చేసుకున్నా. మా నాన్న కోరిక మేరకు ఒకసారి మెడిసిన్ ఎంట్రెన్స్ రాశాను. మెడిసిన్ చదవలేదు కానీ.. సినిమాల్లో డాక్టర్ పాత్రలు చేశాను. 15 ఏళ్ల క్రితం బసవతారకం ఆసుపత్రికి ఛైర్మన్ అయ్యాను. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వైద్యం అందించేలా కృషి చేస్తున్నాం. బాలకృష్ణ అంటే ఏంటో ఇక నుంచి చూపిస్తాను. నాకు చాలా పొగరని అందరూ అనుకుంటారు.. అవును నన్ను చూసుకొనే నాకు పొగరు. బిరుదులకు నేను అలంకారమేమో గానీ.. బిరుదులు నాకు అలంకారం కాదు. బిరుదులు వస్తుంటాయి.. కానీ మన పని మనం చేసుకుంటూ పోవాలని బాలకృష్ణ అన్నారు. ఇకపోతే బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా సినీ, రాజకీయ ప్రముఖులు విషెస్ తెలిపారు. అభిమానుల కోసం పుట్టినరోజు కానుకగా ఆయన నటిస్తోన్న 'అఖండ 2' నుంచి పవర్‌ఫుల్ టీజర్‌ను చిత్రబృందం పంచుకుంది. ప్రస్తుతం అది భారీ వ్యూస్‌తో సోషల్ మీడియాలో -ట్రెండింగ్‌లో ఉంది. సెప్టెంబర్ 25న ఈ సినిమా విడుదల కానుంది.



## విజయ్ దేవరకొండ కింగ్‌డమ్‌కు విఎఫ్‌ఎక్స్ ఎఫెక్ట్

### జూలైకి వాయిదా పడడం ఖాయమంటూ వార్తలు

ఇవాళ భారీ తెలుగు సినిమాలన్నీ విఎఫ్‌ఎక్స్ మీదనే ఎక్కువగా ఆధారపడి వుంటుతున్నాయి. ఆ వర్క్ కాస్తంత ఆలస్యమైనా... పోస్ట్ ప్రొడక్షన్ లో ఊహకందని జాప్యం ఏర్పడుతోంది. దాంతో సినిమాలను ముందు ప్రకటించిన తేదీకి విడుదల చేయలేని నిస్సహాయ స్థితిలోకి నిర్మాతలు జారిపోతున్నారు. పవన్ కళ్యాణ్ సినిమా కూడా ఈ కారణంగానే వాయిదా పడింది. తాజాగా విజయ్ దేవరకొండ కింగ్ డమ్ మూవీ మళ్లీ వాయిదా పడేలా ఉంది. ఇప్పటికే మే 30న రిలీజ్ చేస్తామని గతంలోనే ప్రకటించినా.. చివరకు జులై 4కు వాయిదా వేశారు. ఇప్పుడు మళ్లీ వాయిదా వేస్తారని తెలుస్తోంది. కింగ్ డమ్ కంటే ముందే నితిన్ నటించిన తమ్ముడు మూవీ జులై 4న రిలీజ్ డేట్ ప్రకటించింది. తమ్ముడు మూవీ ఉన్నా సరే రిలీజ్ కు ముందు డేర్ చేసింది. కానీ ఇప్పుడు వెనకడుగు వేస్తున్నట్టు తెలుస్తోంది. పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు జూన్ 12 నుంచి తప్పుకుంది. చూస్తుంటే వీరమల్లు జులై మొదటి వారంలోనే రిలీజ్ కు రెడీ అవుతున్నట్టు సమాచారం. వీరమల్లు జులై మొదటి వారంలోనే వస్తే తమ కింగ్ డమ్ మూవీని వాయిదా వేసుకుంటామని ఇప్పటికే నాగవంశీ క్లారిటీ ఇచ్చాడు. నిన్న అమేజాన్ తో ముంబైలో వీరమల్లు టీమ్ చర్చలు జరిపింది. ఆల్రెడీ అమేజాన్ వాళ్లు అడ్వాన్స్ ఇవ్వడంతో.. ఇప్పుడు త్వరగా రిలీజ్ చేయాలని ఒత్తిడి పెడుతున్నారంట. వీటన్నింటి నేపథ్యంలో వీరమల్లు జులైకే షిఫ్ట్ అయినట్టు- తెలుస్తోంది. ఒకటి, రెండు రోజుల్లో ప్రకటన కూడా రాబోతోంది. ఎటు చూసుకున్నా కింగ్ డమ్ వాయిదా తప్పేలా లేదు. ఎందుకంటే పోటీ- నడుమ కింగ్ డమ్ ను రిలీజ్ చేయడానికి మేకర్స్ రెడీగా లేరు. సోలోగా వచ్చి ఎక్కువ వసూళ్లు రాబట్టాలని చూస్తున్నారంట. అందుకే మరోసారి వాయిదా వేసినా ఆశ్చర్యపోనవసరం లేదు. జులై 25కు వాయిదా వేసే అవకాశం ఉంది.




## ది ఢిల్లీ ఫైల్స్' టైటిల్ బెంగాల్ ఫల్స్‌గా మార్పు

'ది కశ్మీర్ ఫైల్స్', 'ది తాష్కెంట్ ఫైల్స్' వంటి సంచలన చిత్రాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి తన తదుపరి చిత్రం 'ది ఢిల్లీ ఫైల్స్' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాను 'ది కశ్మీర్ ఫైల్స్' నిర్మించిన టాలీవుడ్ బ్యానర్ అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పతాకంపై అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రయూనిట్ చిత్ర టైటిల్‌పై సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఈ సినిమా -టైటిల్‌ను 'ది ఢిల్లీ ఫైల్స్ నుంచి 'ది బెంగాల్ ఫైల్స్: రైట్ టు- లైఫ్ అని మార్చినట్లుగా ప్రకటించాడు. దీంతో ఈ చిత్రం ది బెంగాల్ ఫైల్స్ అంటూ ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమా టీజర్‌ను జూన్ 12న విడుదల చేయనున్నారు. అభిషేక్ అగర్వాల్, పల్లవి జోషి సహనిర్మాతలుగా వ్యవహరించిన ఈ చిత్రంలో మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, పల్లవి జోషి, గోవింద్ నామ్‌దేవ్ వంటి ప్రముఖ నటు-లు కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రం అగ్నిహోత్రి 'ఫైల్స్ ట్రయాలజీలో మూడవ భాగం, దీనిలో 'ది తాష్కెంట్ ఫైల్స్' (2019) మరియు 'ది కశ్మీర్ ఫైల్స్' (2022) కూడా ఉన్నాయి.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com